## ఫైనల్స్‌లో @ అండర్ 19



12

### మీరు నవ్వినట్లు ఎప్పుడూ చూడలేదు

మహిళా జర్నలిస్టుతో ట్రంప్



2



# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 5 ఫిబ్రవరి 2026 | సంపుటి: 10 | సంచిక: 32 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA




# అభివృద్ధికి ఓటేయండి



## రైతు భరోసాకు 9 కోట్లు ఇచ్చాం

- గిట్టుబాటుతో పాటు 500 బోనస్ ఇచ్చాం
- పేదల ఆత్మగౌరవం మా బాధ్యత
- ఏప్రిల్ తర్వాత పేదలకు లక్షలాది ఇళ్లు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

గూడూరు(నల్లగొండ), ఫిబ్రవరి 4: రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ విజ్ఞప్తి చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం గూడూరులో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్కు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన 'ప్రజా పాలన-ప్రజా విజయోత్సవ' సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ''రేషన్ కార్డుల కోసం గతంలో పదేళ్ల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి. ప్రస్తుతం రాష్ట్రంలో 3.17 కోట్ల మందికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తున్నాం. సన్న బియ్యం వచ్చిన వారు ...మిగతా 2లో

## మున్సిపోల్స్‌లో బీజేపీకి
# గుండుసున్నానే

### మతం పేరుతో ఓటర్లను రెచ్చగొట్టే ప్రయత్నం

పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్



హైదరాబాద్, ఫిబ్రవరి 4 (మనం బ్యూరో): మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి గుండుసున్నానే మిగులుతుందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మతం పేరుతో ఓటర్లను రెచ్చగొట్టే ప్రయత్నం ఆ పార్టీ నేతలు చేస్తున్నారని విమర్శించారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎంత ఇచ్చారో బీజేపీ అధ్యక్షుడు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీ చట్టం ప్రకారం తెలంగాణకు ...మిగతా 2లో

## మార్చి 19న గద్దర్ అవార్డుల ప్రదానం



- హైదరాబాద్‌ను సినీ ఇండస్ట్రీకి కేంద్రంగా మారుస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (మనం బ్యూరో): కళల ద్వారా సమాజానికి తన జీవితాన్ని అర్పించిన ప్రజా గాయకుడు గద్దర్ అనీ, అందుకే ప్రభుత్వం ఆయన పేరిట సినిమా అవార్డులను ప్రదానం ...మిగతా 2లో



## ఎన్ని మార్పులొచ్చినా పత్రికలు చదివితేనే తృప్తి

మండలి చైర్మన్ గుత్తా

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (మనం బ్యూరో): ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో ఎన్ని మార్పులొచ్చినా పత్రికలు చదివితేనే తృప్తి కలుగుతుందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. పాత్రికేయ రంగంలో అనేక సంవత్సరాలు సేవలందించిన జర్నలిస్టుల జీవిత విశేషాలు తెలిపే మోనోగ్రాఫ్స్ ఆవిష్కరించడం రాబోయే తరాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. బుధవారం నాంపల్లిలోని మీడియా అకాడమీ ఆడిటోరియంలో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ, అకాడమి ప్రచురించిన మోనోగ్రాఫ్స్ ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావుతో కలసి మండలి చైర్మన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు అండగా మేమున్నామనే భరోసా ఇచ్చి వారికి ఆర్థిక సహాయం చేస్తున్న మీడియా అకాడమీ జర్నలిస్టుల సంక్షేమం అభినందనీయమని పేర్కొన్నారు. అక్షరమే ఆయుధంగా క్షేత్రస్థాయిలో పనిచేసే జర్నలిస్టులు అకాల మరణం చెందడం బాధాకరమన్నారు. వారి కుటుంబాల కోసం రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమ ...మిగతా 2లో

# ఓట్ల కోసం కాంగ్రెస్ ఫీట్లు

### ముస్లిం ఓట్ల కోసం తాపత్రాయ పడుతున్నారు



- తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది
- మూడు హైస్పీడ్ కారిడార్లను కేటాయించాం
- టెక్స్‌టైల్ పార్క్, పసుపు బోర్డు ఏర్పాటు చేశాం

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 4: మూడు హై స్పీడ్ కారిడార్లను తెలంగాణకు కేటాయించామని, తెలంగాణ ప్రజలకు రాష్ట్ర అభివృద్ధి కి బీజేపీ కట్టుబడి ఉందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పేర్కొన్నారు. బుధవారం మహబూబ్‌నర్‌లో ఆయన పర్యటించారు. ఎంవీఎస్ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో బీజేపీ నిర్వహించిన విజయ సంకల్ప సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పసుపు బోర్డు, ...మిగతా 2లో



తెలంగాణలో మున్సిపోల్స్‌కి

## పవన్ ప్రచారం

హైదరాబాద్, ఫిబ్రవరి 4: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రచారం చేయనున్నారు. ఈ నెల 7, 8వ తేదీల్లో ప్రచారం చేసేందుకు రానున్నారు. ఈ మేరకు జనసేన కేంద్ర కార్యాలయం వెల్లడించింది. భాజపా, జనసేన అభ్యర్థుల తరపున మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని పార్టీ తెలిపింది. పవన్ ఎన్నికల ప్రచార షెడ్యూల్, రూట్ మ్యాప్‌ను త్వరలో ప్రకటిస్తామని పేర్కొంది.


## ప్రమోషన్ టు డిమోషన్

- ప్రణీత్‌రావుకు పదోన్నతికి హోంశాఖ వాత
- డీఎస్పీ టు సీఐగా డిమోట్
- ట్యాపింగ్ నిందితుని అడ్డదారికి అడ్డుకట్ట



2


## గులాబీ రెపరెపలాడాలి

నామినేషన్లు ఉపసంహరించుకున్న రెబల్ అభ్యర్థులను ఆహ్వానించండి: కేటీఆర్

హైదరాబాద్, మనం ప్రతినిధి: రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించి, అన్ని పట్టణాలపై గులాబీ జెండా రెపరెపలాడాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిలు, మున్సిపల్ ఎన్నికల సమన్వయకర్తలు, ...మిగతా 2లో

## న్యాయవాది దారుణ హత్య



మొయినాబాద్, ఫిబ్రవరి 4: రంగారెడ్డి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. సొంత అన్న చేతిలో మహిళా న్యాయవాది స్వప్న (34) హత్యకు గురయ్యారు. మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల కోర్టులో స్వప్న న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆమె కుటుంబంలో ఆస్తి గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో బుధవారం ...మిగతా 2లో



## జమ్మూకశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతం

జమ్ము, ఫిబ్రవరి 4: జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. వారు జైషే మహ్మద్‌కు చెందినవారుగా గుర్తించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జైషేకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులకు సంబంధించి నిఘా సమాచారం అందింది. దీంతో భద్రతా దళాలు, సీఆర్పీఎఫ్ బలగాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. అనంతరం మిలిటెంట్లు పారిపోయారు. ఉదంపూర్ ప్రాంతంలోని గుహల్లో వారు ఉన్నట్టు సమాచారం అందడంతో మళ్లీ ...మిగతా 2లో

## ఎప్‌స్టీన్ ఫైల్స్ విచారణకు హాజరవుతాం

క్లింటన్ దంపతుల వెల్లడి



వాషింగ్టన్, ఫిబ్రవరి 4: లైంగిక నేరగాడిగా అపఖ్యాతి మూటగట్టుకోవడంతో పాటు అంతర్జాతీయ గూఢచారిగా పనిచేశారన్న ఆరోపణలు ఎదుర్కొన్న జెఫ్రీ ఎప్‌స్టీన్ వ్యవహారంపై విచారణ ...మిగతా 2లో


## ఆన్‌లైన్ గేమ్‌లో చివరి టాస్క్...సూసైడ్

ముగ్గురు అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య



9




# 'న్యూ స్టార్ట్'కు ది ఎండ్

### నేటితో ముగిసిన అమెరికా-రష్యా అణుఒప్పందం

ముందుకొస్తే కొనసాగిస్తామన్న పుతిన్ • స్పందించని అగ్రరాజ్యం

వాషింగ్టన్, ఫిబ్రవరి 4: అమెరికా-రష్యా అణ్వాయుధ నియంత్రణ ఒప్పందం ఫిబ్రవరి 5తో ముగియనుంది. దీంతో అణ్వాయుధ నిల్వలపై ఉన్న పరిమితులు తొలగిపోనున్నాయి. ఈ ఒప్పందం ముగింపు అనేది అణ్వాయుధ పోటీకి దారితీయొచ్చనే భయాలు మొదలవుతున్నాయి. అయితే, అమెరికా ఈ ఒప్పందాన్ని కొనసాగించేందుకు ముందుకొస్తే.. తాము కూడా మరో ఏడాది పాటు దీనికి కట్టుబడి ఉంటామని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇటీవల ప్రకటించారు. కానీ, ట్రంప్ యంత్రాంగం నుంచి ఎటువంటి ప్రకటన రాలేదు. దీనిపై సరైన సమయంలో అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకుంటారని వైట్‌హౌస్ వర్గాలు ప్రకటించాయి.

**నాటి ఒప్పందం..:** అణ్వాయుధ నిల్వలకు సంబంధించి 1972లో అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్, ...మిగతా 2లో

## గడాఫీ కుమారుడి హత్య



ట్రిపోలీ(లిబియా), ఫిబ్రవరి 4: లిబియా ఒకప్పటి నియంత దివంగత గడాఫీ కుమారుడు సయిఫ్ అల్ ఇస్లాం (53) హత్యకు గురయ్యారు. సాయుధ దుండగుల కాల్పుల్లో మరణించారని ఆయన బృందంలోని ఒకరు పేర్కొన్నారు. సయిఫ్ సలహాదారుడు మీడియాతో మాట్లాడుతూ.. ...మిగతా 2లో

మనం Manam



# మీరు నవ్వినట్లు ఎప్పుడూ చూడలేదు

## మహిళా జర్నలిస్ట్‌తో ట్రంప్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 4:** అమెరికా అధ్యక్ష భవనంలోని ఓవల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సీఎన్‌ఎన్ ఛానల్కు చెందిన ఓ రిపోర్టర్‌పై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణంలో కొత్తగా విడుదలైన పత్రాల గురించి సీఎన్‌ఎన్ ఛానల్‌కు చెందిన కైట్లాన్ కొల్లిన్స్ అనే రిపోర్టర్ ట్రంప్‌ను ప్రశ్నించారు. దీంతో ఆగ్రహానికి గురైన అమెరికా అధ్యక్షుడు 'నువ్వో చెత్త రిపోర్టర్వి' అంటూ ఆమెను విమర్శించారు.

''నేను పదేళ్లుగా మిమ్మల్ని చూస్తున్నాను. ఇప్పటివరకు ఒక్కసారి కూడా నవ్వినట్లు చూడలేదు. మీలాంటి వాళ్ల వల్లే సీఎన్‌ఎన్ ఛానల్ రేటింగ్ పడిపోతుంది. మీరు ఎప్పుడూ నిజాలు చెప్పరని మీకు బాగా తెలుసు. అందుకే ఎప్పుడూ సీరియస్గా ఉంటారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో నాతో సహా ఇతరుల పేర్లను కుట్ర పూరితంగా విడుదల చేశారు. ఇప్పుడు ఇటువంటి విషయాల గురించి కాకుండా దేశం గురించి ఆలోచిస్తే అందరికీ మంచిది'' అని ట్రంప్ రిపోర్టర్ని ఉద్దేశించి అన్నారు. ఈ మీడియా సమావేశానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్గా మారింది.

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం దర్యాప్తునకు సంబంధించి అమెరికా న్యాయశాఖ ఇటీవల మరిన్ని పత్రాలను విడుదల చేసింది. అందులో మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, ఎలాన్ మస్క్, బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూ, బిల్ గేట్స్, పాప్ స్టార్ మైఖేల్ జాక్సన్‌ల ప్రస్తావన, వారికి సంబంధించిన ఫొటోలు ఉన్నాయి. అయితే, అధ్యక్షుడు డొనాల్ ట్రంప్నకు సంబంధించిన ఫొటోలు మాత్రం ఎక్కడా కనిపించలేదు. దీనిపైనే తాజాగా జరిగిన విలేకరుల సమావేశంలో రిపోర్టర్ అమెరికా అధ్యక్షుడిని ప్రశ్నించారు.

# 'న్యూ స్టార్ట్'కు ది ఎండ్

(మొదటి పేజీ తరువాయి)

సోవియట్ నేత బ్రెజ్నెవ్‌ల మధ్య తొలిసారి ఒప్పందం జరిగింది. అయితే, 2001లో అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ సమయంలో అమెరికా బయటకు వచ్చింది. మళ్లీ 2010లో అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా, రష్యా అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదెవ్‌ల మధ్య 'న్యూ స్టార్ట్' పేరుతో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం.. ఇరుదేశాలూ 700 కన్నా ఎక్కువ క్షిపణులు, యుద్ధవిమానాలపై 1550 కన్నా ఎక్కువ అణ్వస్త్రాలను వినియోగానికి సిద్ధంగా ఉంచకూడదు. ఒకరి అణు కేంద్రాలను మరొకరు తనిఖీ చేసుకోవచ్చు. అయితే, ఇది 2021లోనే ముగియాల్సి ఉన్నప్పటికీ.. ఐదేళ్లపాటు పొడిగించారు.

### విఫలమైతే విస్తరణే..!

తాజాగా అది ఫిబ్రవరి 5తో ముగియనుంది. 35 ఏళ్లలో తొలిసారి ఇలాంటి పరిస్థితి రావడంతో అణ్వాయుధాల సంఖ్యను పెంచుకునే అవకాశం లభిస్తుందనే ఆందోళన మొదలైంది. ఈ పరిస్థితి రష్యా, అమెరికా మధ్య అణ్వాయుధ పోటీకి దారితీయడంతోపాటు ప్రపంచవ్యాప్తంగా అస్థిరత, 'అణు' ఘర్షణల ముప్పును పెంచుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఒప్పందం కొనసాగింపుపై ఇరుపక్షాలు అంగీకరించడంలో విఫలమైతే.. అణ్వాయుధ విస్తరణ భారీగా పెరిగే అవకాశం ఉందని అమెరికాలోని ఆయుధ నియంత్రణ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డారిల్ కింబాల్ పేర్కొన్నారు. అమెరికా అణు నిల్వలపై పరిమితులు లేకుంటే ప్రమాదకరమైన ప్రపంచమే అవుతుందని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఇటీవల హెచ్చరించారు.

తమ జాతీయ ప్రయోజనాలను రక్షించుకునేందుకు అన్ని మార్గాలను (అణ్వాయుధాలను ఉద్దేశిస్తూ) ఉపయోగించడానికి రష్యా సిద్ధంగా ఉందని అధ్యక్షుడు పుతిన్ ఉక్రెయిన్‌పై దండయాత్ర మొదలుపెట్టినప్పటి నుంచి చెబుతున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన ఓ ఆర్డర్ 2024లో ఆయన సంతకం కూడా చేశారు. అయితే, న్యూస్టార్ట్ ఒప్పందం పరిమితులపై ఇరు పక్షాలు చర్చించేందుకు అనుగుణంగా దీనిని మరో ఏడాది పొడిగించేందుకు సిద్ధంగా ఉన్నామని పుతిన్ ప్రకటించిప్పటికీ అమెరికా నుంచి ఎటువంటి ప్రకటన రాలేదు.

# గులాబీ రెపరెపలాడాలి

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో నేతలకు ఆయన కీలక దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఎన్నికల హామీల అమలులో విఫలమై ప్రజలను మోసం చేసిన తీరును ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్‌కు అనుకూల వాతావరణం ఉందని, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. వచ్చే వారం రోజుల పాటు పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేస్తే భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభంజనం ముందు ప్రతిపక్షాలు నిలవలేకపోయాయని, అప్పట్లో కాంగ్రెస్, బీజేపీలు కేవలం ఏడెనిమిది స్థానాలకే పరిమితమయ్యాయని గుర్తు చేశారు. ఎన్నికల వ్యూహంలో సమన్వయం అత్యంత కీలకమని కేటీఆర్ స్పష్టం చేశారు. పార్టీ విజ్ఞప్తిని మన్నించి నామినేషన్లు ఉపసంహరించుకున్న రెబల్ అభ్యర్థులను సాదరంగా ఆహ్వానించాలని సూచించారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి త్యాగం చేసిన ప్రతి నాయకుడి ఇంటికీ అభ్యర్థులు స్వయంగా వెళ్లి, వారిని ప్రచారంలో భాగస్వాముల్ని చేయాలన్నారు. వారికి తగిన గౌరవం ఇచ్చి కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన బాధ్యత మున్సిపల్ సమన్వయకర్తలపై ఉందని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిస్థితులపై సమగ్ర నివేదికను వెంటనే పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపాలని కేటీఆర్ సూచించారు. చివరి ఘట్టమైన ప్రచారంపై పూర్తి దృష్టి సారించి ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రులు తమ పరిధిలోని మున్సిపాలిటీల్లో విజయావకాశాలను అంచనా వేసి, గెలుపు సాధించే అభ్యర్థులను ముందుకు నడిపించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని కేటీఆర్ సూచించారు. అభ్యర్థుల గెలుపుతో పాటు పోలింగ్ రోజున ఓటింగ్ శాతం పెంచడంపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు సమన్వయకర్తలు తమకు కేటాయించిన మున్సిపాలిటీల్లోనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

# ప్రమోషన్ టు డిమోషన్

**హైదరాబాద్,ఫిబ్రవరి 4(మనం,ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్ర పోలీసు శాఖలో అరుదైన ఘటన చోటుచేసుకుంది. సీఐ నుంచి డీఎస్పీ కావడం సాధారణమైన విషయం.అయితే డీఎస్పీ నుంచి సీఐగా డిమోట్ అయిన ఘటన పోలీసు శాఖలో చర్చనీయాంశమైంది. వెరసి అడ్డదారిలో డీఎస్పీగా పదోన్నతి పొందిన పోలీసు అధికారికి సీఐగా డిమోట్ చేస్తూ హోంశాఖ వాత పెట్టింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడు, ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న ప్రణీత్‌రావు డీఎస్పీ హోదాను రద్దు చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈక్రమంలో ప్రణీత్‌రావు డీఎస్పీగా పదోన్నతి పొందిన అనంతరం ప్రొబేషన్ కాలంలో విధుల దుర్వినియోగానికి పాల్పడినందుకు డిమోట్ చేస్తున్నట్లు హోంశాఖ వెల్లడించింది. డీఎస్పీ నుంచి సీఐగా పదోన్నతిని తగ్గిస్తూ ఈ మేరకు హోంశాఖ ప్రధాన కార్యదర్శి సీ.వీ ఆనంద్ ఉత్తర్వులను జారీ చేశారు. దీంతో గతంలో ప్రణీత్‌రావుకు కల్పించిన యాక్సిలరేటెడ్ ప్రమోషన్ రద్దయినట్లయింది. ఇకపై ఆయన డీఎస్పీగా కాకుండా సీఐ గానే కొనసాగనున్నారు.

### అడ్డదారిలో అందలం:

పోలీసు శాఖలో సాధారణంగా తీవ్రవాద, ఉగ్రవాద కార్యకలాపాల అణచివేతలో అసమాన ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులకు మాత్రమే యాక్సిలరేటెడ్ పదోన్నతి కల్పించే విధానం అమల్లో ఉంది. అలాంటి కార్యకలాపాల్లో తన ప్రతిభ చూపనప్పటికీ 2007 బ్యాచ్‌కు చెందిన ప్రణీత్‌రావుకు అడ్డదారిలో డీఎస్పీగా పదోన్నతి కల్పించడం పోలీసు శాఖలో తీవ్ర కలకలం రేపింది. 2007 ఎస్ఐ బ్యాచ్‌లో దాదాపు 300 మంది ఉండగా ఒక్క ప్రణీత్‌రావుకు మాత్రమే డీఎస్పీగా పదోన్నతి కల్పించడంపై ఆ బ్యాచ్ ఎస్ఐలు ఇది అక్రమమని గుసగుసలాడుకున్నారు. అయితే అప్పటి ప్రభుత్వానికి అనుకూలంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినందుకే ప్రణీత్‌రావును అందలం ఎక్కించారనే విమర్శలు సైతం గుప్పుమన్నాయి. కాగా ప్రణీత్‌రావు 2016 అక్టోబరు 24న ఎస్ఐబీ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించాడు. ఈక్రమంలో 2023 డిసెంబరు 13వ తేదీ వరకు పనిచేశారు. అక్కడ ఉన్నప్పుడే ఇన్స్పెక్టర్ నుంచి యాక్సిలరేటెడ్ విధానంలో డీఎస్పీగా ప్రమోషన్ పొందారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌లో ఆయన నేతృత్వంలోనే స్పెషల్ ఆపరేషన్స్ టార్గెట్(ఎస్వోటీ) ఏర్పాటైంది. 2023 శాసనసభ ఎన్నికల ఫలితాలు విడుదలైన మరుసటి రోజు(డిసెంబరు 4వ తేదీన) ఎస్ఐబీ భవనంలోని సీసీ కెమెరాలను స్విచ్ఆఫ్ చేసి, ఎస్వోటీ లాగర్ రూంలోని ల్యాప్టాప్లు, కంప్యూటర్లలోని 42 హార్డ్‌డిస్కులు, అందులోని డేటాను ధ్వంసం చేయడంలో ప్రణీత్‌రావు కీలకపాత్ర పోషించినట్లుగా సిట్ దర్యాప్తులో వెల్లడైంది.

### చర్యలకు సిఫారసు:

టీఎస్‌సీఎస్(కాండక్ట్) రూల్స్, 1964లోని రూల్ నంబర్ 3 ఉల్లంఘన కిందకు వస్తుందని, ప్రణీత్‌రావును సస్పెండ్ చేయాలని అప్పటి ఎస్ఐబీ డీఐజీ సూచించారు. ఈ మేరకు ఇంటెలిజెన్స్ విభాగం నాటి అదనపు డీజీపీ 2024 జనవరి 17వ తేదీన ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఈ క్రమంలో అదే ఏడాది మార్చి 2వ తేదీన ప్రణీత్‌రావును సస్పెండ్ చేశారు.

# ఓట్ల కోసం కాంగ్రెస్ ఫీట్లు

(మొదటి పేజీ తరువాయి)



టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు, ఇండస్ట్రియల్ కారిడార్‌నుకేటాయించి తెలంగాణ అభివృద్ధికి మోడీ కట్టుబడి ఉన్నారన్నారు. మోడీ జీఎస్టీ స్లాబ్లను తగ్గించి ప్రజల ఖర్చును తగ్గించారని, యూరోపియన్ యూనియన్‌తో ట్రేడ్ డీల్ చేసి ప్రధాని మోడీ దేశాభివృద్ధికి తన బాధ్యత చాటుకున్నారని కొనియాడారు. వక్ఫ్ బోర్డును బలోపేతం చేయాలని కాంగ్రెస్ సర్కారు చూస్తోందని, హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నా వాటిని ఆపడం లేదన్నారు. తెలంగాణలో జరుగుతున్న ఇటువంటి దాడులను సహించబోమని హెచ్చరించారు.

కాంగ్రెస్ పాలనలో బలహీన వర్గాలకు ఎటువంటి న్యాయమూ జరగలేదని నితిన్ నబీన్ అన్నారు. ఎస్టీ, ఎస్సీ సంక్షేమ పథకాల నిధుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కోత పెడుతోందని నితిన్ నబీన్ చెప్పారు. కాంగ్రెస్ సర్కారు హామీల అమలులో విఫలమైందని తెలిపారు. రైతులకు, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చలేదని అన్నారు. అన్ని వర్గాల వారినీ ప్రభుత్వం మోసం చేసిందని చెప్పారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. రూ.2,500 ఆర్థిక సాయం చేయలేదు. గత ప్రభుత్వం తరహాలోనే ఈ ప్రభుత్వం నడుస్తుంది. మహిళలపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టడానికి బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు. రైతులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ మోసం చేసింది. రెండేళ్లుగా ఈ హామీలు అమలు చేయకుండా పాలన చేస్తుంది. రైతు భరోసా, రుణమాఫీ చేస్తామని మోసం చేసింది. కాంగ్రెస్ హయాంలో కూడా కమిషన్ రాజ్, గూండా రాజ్ పోలేదు. ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు.

### ముస్లిం ఓట్లు కోసం తాపత్రాయ పడుతున్నారు...

సనాతన ధర్మం పాటించే వారి మనోభావాలను దెబ్బతీసేలా తెలంగాణ సీఎం మాట్లాడుతున్నారు. తెలుగు ప్రజలకు, సంస్కృతికి నష్టం చేసేలా ముస్లిం అంటే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటే ముస్లిం అనే నినాదం ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల బడ్జెట్‌ను తగ్గించి మైనారిటీలకు నిదులు పెంచారు. ముస్లిం ఓట్లు కోసం ఎలా తాపత్రయ పడుతున్నారో ప్రజలు చూస్తున్నారు అని అన్నారు కాగా, తన పర్యటనలో భాగంగా ఉమ్మడి పాలమూరు జిల్లా నేతలకు మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నితిన్ నబీన్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పలువురు స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్నారు.

# ఎన్ని మార్పులొచ్చినా పత్రికలు చదివితేనే తృప్తి

(మొదటి పేజీ తరువాయి)

నిధి నుండి ఆర్థిక సహాయంగా రూ.లక్ష మంజూరు చేయడంతో పాటు ఐదు సంవత్సరాల పాటు పెన్షన్ సదుపాయం కల్పించడం హర్షణీయమన్నారు. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు మాట్లాడుతూ ప్రముఖుల చరిత్ర తెలిపే పుస్తకం చదవడం సులభం.

కానీ, అదే చరిత్రను మోనోగ్రాఫ్‌గా అందించడం మాటలు కాదు, అది అక్షర రూపం దాల్చడంలో భాగస్వాములు కావడం గొప్ప విషయమన్నారు.

సమాజానికి అద్దం పట్టేది వార్త అయితే, ఆ వార్త వెనక ఉన్న నిజాన్ని వెలికితీసే జర్నలిస్టులు భవిష్యత్ తరాలకు దారి చూపిన వారవుతారని పేర్కొన్నారు. సోషల్ మీడియాను కంట్రోల్ చేయడం ఎవరి తరం కాదనీ, కానీ, దీనిపై జర్నలిస్టులంతా ఏకతాటిపైకి వచ్చి చర్చించడం లేదా వర్క్‌షాప్‌లు నిర్వహించి కొంత మార్పుకు నాంది పలకాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర్‌రావు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఎప్‌స్టీన్ ఫైల్స్ విచారణకు హాజరవుతాం

(మొదటి పేజీ తరువాయి)

మరో మలుపు తిరిగింది. అమెరికా కాంగ్రెస్ (పార్లమెంటు) ఓవ్సట్ కమిటీ ముందు హాజరై వాంగ్మూలం ఇవ్వడానికి మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, ఆయన భార్య హిల్లరీ క్లింటన్‌లు అంగీకరించారు. ఈ విషయాన్ని తమ న్యాయవాదుల ద్వారా కమిటీకి తెలియజేశారు. రిపబ్లికన్ పార్టీకి చెందిన జేమ్స్ కోమర్ కాంగ్రెస్ హౌస్ ఓవ్సట్ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇంతకు ముందు క్లింటన్ దంపతులు వాంగ్మూలం ఇవ్వడానికి నిరాకరించడంతో వారిపై ధిక్కార చర్యలు చేపడతామని కమిటీ ఛైర్మన్ హెచ్చరించారు. ధిక్కార నేరం రుజువైతే భారీ జరిమానా చెల్లించడంతో పాటు కారాగార శిక్ష కూడా అనుభవించాల్సి ఉంటుంది. క్లింటన్ దంపతులపై అటువంటి చర్యలు తీసుకోవద్దని వారి తరఫు న్యాయవాదులు అభ్యర్థించారు.

### బ్రిటిష్ ఎంపీ రాజీనామా

మరోవైపు ఎప్‌స్టీన్‌తో దగ్గర సంబంధాలున్న వ్యక్తిగా పేరుబడ్డ ప్రముఖ బ్రిటిష్ రాజకీయ నాయకుడు పీటర్ మండెల్సన్ బ్రిటన్ పార్లమెంటు ఎగువసభ శాశ్వత సభ్యత్వం నుంచి నిష్క్రమించనున్నట్లు ప్రకటించారు. ఎప్‌స్టీన్‌తో సాన్నిహిత్యం కలిగివున్న మండెల్సన్‌ను సభ్యత్వం నుంచి తొలగించేందుకు ప్రభుత్వం చట్టాన్ని తేవాలని యోచిస్తున్న తరుణంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. తాజాగా విడుదలైన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో వెల్లడైన వివరాలు తనను ఆశ్చర్యానికి గురిచేశాయని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ అన్నారు. ఈ ఉదంతంలో అమెరికా ప్రభుత్వం తాజాగా 30 లక్షల పేజీల సమాచారాన్ని విడుదల చేసిన విషయం విదితమే.

# అభివృద్ధికి ఓటేయండి



(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలి. వరి ఉత్పత్తిలో మిర్యాలగూడ ఆసియాలోనే ముందుంది. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురే లేదు.. విజయాన్ని అడ్డుకోలేరు. మిర్యాలగూడ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ బీఫాం మీద పోటీ చేస్తున్న ఆడబిడ్డలకు కూడా ఆర్టీసీలో ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించాం. సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా వివక్ష చూపలేదు. రైతు రుణమాఫీ కింద 25.35 లక్షల మందికి రూ.21 వేల కోట్లు ఖర్చు చేశాం. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం. రైతు భరోసా కింద రూ.6వేల చొప్పున రూ.9వేల కోట్లు ఇచ్చాం. మున్సిపల్ ఎన్నికలు ముగిశాక రైతు భరోసా నిధులు జమ చేస్తాం. దేశంలో అత్యధికంగా రైతుల కోసం రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేశాం. ఏప్రిల్‌లో కొత్త బడ్జెట్లో లక్షలాది ఇళ్లు పేదలకు ఇస్తాం. పేదల ఆత్మగౌరవం పెంచే బాధ్యత తీసుకుంటాం. నల్గొండ జిల్లాపై కోపంతో ఎస్ఎల్బీసీని పక్కనపెట్టారు. ఎస్ఎల్బీసీ ఆగిపోతే మామ, అల్లుళ్లు దావత్ చేసుకున్నారు. నల్గొండ ప్రజలు ఫ్లోరైడ్ నీళ్లు తాగడానికి కారణం బీఆర్ఎస్. రెండేళ్లలో పూర్తి చేసే లక్ష్యంతో ఎస్ఎల్బీసీ పనులు చేపట్టాం. కేసీఆర్‌కు పోలీసులు నోటీసు ఇస్తే.. తెలంగాణ జాతికి ఇచ్చినట్టు చెబుతున్నారు'' అని సీఎం విమర్శించారు.

# మున్సిపోల్స్‌లో బీజేపీకి గుండుసున్నానే

(మొదటి పేజీ తరువాయి)

న్యాయంగా రావాల్సిన పథకాలు, నిధులు, ప్రాజెక్టులు మంజూరు చేయడం లేదని పేర్కొన్నారు. బయ్యారం స్టీల్ ప్లాంట్, నీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా, నవోదయ పాఠశాలలు, ఐఐఎమ్ ఏర్పాటుతో పాటు పలు అంశాల్లో అన్యాయం చేసిందనీ, తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంగా రాష్ట్రం ప్రణాళికలు రూపొందిస్తూ దేశ, విదేశీ సంస్థల నుంచి పెట్టుబడులను ఆకర్శిస్తుంటే కేంద్రం రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు సహకరించడం లేదనీ, ట్రిబుల్ ఆర్, మెట్రో రేల్, మూసీ ప్రాజెక్టు వంటి కీలక అంశాలను విస్మరిస్తున్నదని విమర్శించారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్దంగా బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాలకు పెద్ద పీట వేస్తూ దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తున్నదని వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్‌లో మహిళలకు రూ.90 వేల కోట్ల నిధులు కోత పెట్టారనీ, బీసీలకు ఇచ్చింది కేవలం రూ.13,600 కోట్లు మాత్రమేనన్నారు. అభివృద్ధి, సంక్షేమం పేరిట కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడుగుతోందనీ, మున్సిపల్ ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయాలని రాష్ట్ర ప్రజలకు ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# మార్చి 19న గద్దర్ అవార్డుల ప్రదానం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మార్చి ఉగాది రోజున గద్దర్ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో గద్దర్ అవార్డుల జ్యూరీ సభ్యులతో డిప్యూటీ సీఎం సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌ను ఫిల్మ్ ఇండస్ట్రీకి కేంద్రంగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. అన్ని భాషల సినీ పరిశ్రమలు ఇక్కడికి విస్తరించేలా అనుకూల వాతావరణం కల్పిస్తామనీ, దీని ద్వారా సినీ రంగంలో యువత, టెక్నీషియన్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. దీనికి సంబంధించిన బ్లూ ప్రింట్‌ను ప్రభుత్వం తయారు చేస్తున్నదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కొన్ని దశాబ్దాల కాలం పాటు సినిమా రంగానికి సంబంధించిన అవార్డుల విషయంలో నిర్లక్ష్యం వహించి వదిలేస్తే సమాజంలో అత్యంత ప్రభావం చూపే సామాజిక పరివర్తన చూపే సినీ రంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవార్డులు ఇచ్చి తిరిగి ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ అంటే కళలు, విప్లవం, ప్రశ్నించడం, సున్నిత మనసుతో, ప్రేమానురాగాలతో కూడినదనీ, కళలు, సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పిన వ్యక్తి గద్దర్ అని పేర్కొన్నారు. ప్రతిభ, పారదర్శకతలే ప్రమాణంగా సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందనీ, గత సంవత్సరం జ్యూరీ సభ్యులు అవార్డుల ఎంపికను గొప్పగా నిర్వహించి అభినందనలు పొందిన విషయాన్ని గుర్తు చేశారు. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందనీ, ప్రతిభ, పారదర్శకత ఆధారంగానే అవార్డులు ఇవ్వాలని జ్యూరీ సభ్యులకు సూచించారు.

# న్యాయవాది దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం పొలం వద్ద పంచాయతీ జరుగుతుండగా.. స్వప్నను సోదరుడు రాజు హతమార్చాడు. హత్య సమాచారం అందుకున్న మొయినాబాద్ పోలీసులు.. ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### రాజు మూడేళ్లుగా పథకం పన్నాడు: తల్లి వెంకటమ్మ

స్వప్నను చంపాలని రాజు మూడేళ్లుగా పథకం పన్నాడని తల్లి వెంకటమ్మ అన్నారు. హతమార్చేందుకు ఇప్పటికే రెండుసార్లు యత్నించాడని చెప్పారు. భూమి సర్వే అనంతరం తిరిగి వెళ్తుండగా స్వప్నపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని తెలిపారు. కర్రలు, కత్తులతో దాడి చేశారని.. రాజుతో పాటు నిందితులను కఠినంగా శిక్షించాలని వెంకటమ్మ కోరారు.

### న్యాయవాదుల ఆందోళన

స్వప్న హత్యపై చేవెళ్ల కోర్టు న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం విధులను బహిష్కరించి మొయినాబాద్ పీఎస్ వద్ద ఆందోళనకు దిగారు. పీఎస్ ఎదుట ఉన్న హైదరాబాద్-బీజాపూర్ హైవేపై బైఠాయించి నిరసన తెలిపారు.

# గడాఫీ కుమారుడి హత్య

(మొదటి పేజీ తరువాయి)

నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు జింటాన్‌లోని గడాఫీ ఇంటిలోకి చొరబడ్డారని తెలిపారు. నిఘా కెమెరాలను ధ్వంసం చేసి.. ఆ తర్వాత ఆయనను కాల్చి చంపారన్నారు. ఈ హత్య వెనక ఎవరున్నారనే దానిపై స్పష్టత లేదు. ఈ ఘటనకు కొన్ని రోజుల ముందు తన భద్రత గురించి సయిఫ్ తన స్నేహితుడి వద్ద ఆందోళన వ్యక్తంచేసినట్లు తెలిపారు. ఇక, గడాఫీ మరణం తర్వాత లిబియా రాజకీయాల్లో సయిఫ్ చురుగ్గా ఉన్నారు. 2021లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ఆయన ప్రకటించినా, పలు కారణాల వల్ల ఆ ఎన్నికలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

# జమ్మూకశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతం

(మొదటి పేజీ తరువాయి)

గాలింపు చేపట్టారు. గుహలో ఉన్న వారిపై కాల్పులు జరపడంతో ఇద్దరు మిలిటెంట్లు హతమయ్యారని.. వారిలో ఒకరు పాక్ జాతీయుడు కాగా మరొకరు స్థానిక వ్యక్తి అని పేర్కొన్నారు. వారి నుంచి ఎం4 కార్బన్ రైఫిల్స్, ఏకే-47 రైఫిల్స్, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

# మహిళా భద్రతా విభాగం 'ముందడుగు'

- వీవీసీ మోటార్స్‌తో ఒప్పందం
- 500మంది మహిళలకు స్వయం ఉపాధి

**హైదరాబాద్, ఫిబ్రవరి 4(మనం,ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్రంలో మహిళల ఆర్థిక సాధికారతను పెంపొందించడంతో పాటు రవాణా రంగంలో వారి భాగస్వామ్యం పెంచే దిశగా రాష్ట్ర పోలీస్ మహిళా భద్రతా విభాగం మరో ముందడుగు వేసింది. మహిళల నేతృత్వంలో పర్యావరణహిత రవాణా ఉపాధి మార్గాలను ప్రోత్సహించేందుకు ప్రముఖ వాహన డీలర్షిప్ సంస్థ 'వీవీసీ మోటార్స్'తో బుధవారం అవగాహన ఒప్పందం (ఎం ఓ యు) కుదుర్చుకుంది. మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ అధికారిక భాగస్వామైన వీవీసీ మోటార్స్ సహకారంతో నగరంలో 'మహిళా ఆధారిత ఎలక్ట్రిక్ మొబిలిటీ' పైలట్ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈ మేరకు మహిళా భద్రతా విభాగం అదనపు డిజిపి చారుసిన్హా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇరు విభాగాల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.ఈ వినూత్న పథకం ద్వారా హైదరాబాద్ పరిధిలోని నాలుగు పోలీస్ కమిషనరేట్ల పరిధిలో సుమారు 500 మంది మహిళలను ఎంపిక చేసి, వారిని ఎలక్ట్రిక్ ఆటో డ్రైవర్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సందర్భంగా మహిళా భద్రతా విభాగం అదనపు డిజిపి చారుసిన్హా మాట్లాడుతూ ఏడాది పాటు సాగే ఈ పైలట్ ప్రాజెక్టు ద్వారా మహిళలకు స్వయం ఉపాధి లభించడమే కాకుండా, బహిరంగ ప్రదేశాల్లో వారి ఉనికి పెరగడం వల్ల ప్రయాణికులకు మరింత సురక్షితమైన రవాణా వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా మహిళా భద్రతా విభాగం క్షేత్రస్థాయిలో మహిళా డ్రైవర్ల సమీకరణ, సంస్థాగత సమన్వయ బాధ్యతలను పర్యవేక్షిస్తుండగా, ఎంపికైన మహిళలకు వీవీసీ మోటార్స్ సంస్థ వాహనాల లభ్యతను కల్పిస్తుందని వివరించారు. మహిళా సాధికారత, సుస్థిర రవాణా వ్యవస్థల పట్ల తమకున్న నిబద్ధతకు ఈ భాగస్వామ్యం నిదర్శనమన్నారు. అంతేకాకుండా ఇది నగర రవాణా ముఖచిత్రాన్ని మార్చడమే కాకుండా మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతుందని భరోసా సొసైటీ మెంబర్ సెక్రటరీ, మహిళా భద్రతా విభాగం అదనపు డిజిపి చారు సిన్హా తెలిపారు.



# లింగోజిగూడ కార్పొరేటర్ పై మహేష్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు



రంగారెడ్డి, ఫిబ్రవరి 4 (మనం న్యూస్)ః ఎల్. బి నగర్ నియోజకవర్గం లింగోజి గూడ డివిజన్ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి వింత ప్రవర్తన పై టిపిసిసి అధ్యక్షులు , ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కి ఫిర్యాదు చేసిన ఎల్. బి నగర్ కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు.బైరామాల్ గూడ ఫ్లైఓవర్ పేరును ఇటీవలే అనారోగ్యంతో మరణించిన బిజెపి చంపాపేట డివిజన్ కార్పొరేటర్,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వంగ మధుసూదన్ రెడ్డి పేరును ఫ్లైఓవర్ కు పెట్టాల్సిందిగా జిహెచ్ఎంసి కమిషనర్ కు వినతిపత్రం అందించి కౌన్సిల్లో పెట్టడం ఎల్. బి నగర్ కాంగ్రెస్ పార్టీని ఆశ్చర్యానికి గురిచేసింది అన్నారు.ఇప్పటికే ఎల్. బి నగర్ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ మనుగడ కష్టంగా ఉన్న నేపథ్యంలో మన పార్టీకి చెందిన కార్పొరేటర్ వ్యాఖ్యలు రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అంతరింపజేసి బిజెపి పార్టీ గెలుపుకు సహకరించేలా ఉన్నాయని స్పష్టం అవుతుంది అన్నారు.కరోనా సమయంలో మరణించిన లింగోజిగూడ బిజెపి మాజీ కార్పొరేటర్, మాజీ మున్సిపల్ చైర్మన్ దివంగత రమేష్ గౌడ్ అంతక్రియల్లో పాల్గొనీ,అప్పుడు రమేష్ గౌడ్ కుమారుడిని ఏకగ్రీవంగా లింగోజి గూడ కార్పొరేటర్ గా చేస్తామని

ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి బిజెపి పార్టీకి వత్తాసు పలుకుతూ బహిరంగంగా ప్రకటించడం జరిగింది అన్నారు.ఎల్. బి నగర్ కాంగ్రెస్ పార్టీ లో బాధ్యతరహితంగా ఉంటూ కాంగ్రెస్ పార్టీ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తున్న కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి పై పార్టీ పరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.నగర ప్రయాణానికి క్లిష్టమైన ట్రాఫిక్ సమస్యను తగ్గించడానికి నిర్మించిన బైరమల్ గూడ ఫ్లై ఓవర్ కు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ , దివంగత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి , తెలంగాణ రాష్ట్ర మలిదశ అమరుడు శ్రీకాంత్ చారి ల పేర్లను నామకరణ చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు గంట శ్రవణ్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఇరిగి రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పృథ్వీరాజ్,శ్యామల్ రెడ్డి, విటల్ రెడ్డి, మైనార్టీ నాయకులు జానీ తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ కాలయాపన..
# డిస్మిస్ చేయడం చట్టవిరుద్ధమే?
### స్పీకర్ న్యాయబద్ధంగా వ్యవహరించడం లేదు? : జగదీశ్ రెడ్డి

హైదరాబాద్, మనం ప్రతినిధి : జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారినట్లు ఆధారాలు లేవంటూ తమ పిటిషన్లను స్పీకర్ ప్రసాద్ కుమార్ కొట్టివేయడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద స్పందించారు. సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీలో ఎందుకు చేర్చుకున్నారని ఆ పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డి ప్రశ్నించారని గుర్తు చేశారు. కానీ, స్పీకర్ పార్టీ మారిన ఎమ్మెల్యేలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అనర్హత పిటిషన్లపై కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఆధారాలు లేవంటూ ఎనిమిది మంది పార్టీ మారిన ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీతో బీజేపీ కూడా కుమ్మక్కయిందని ఆరోపించారు.

**స్పీకర్ న్యాయబద్ధంగా వ్యవహరించడం లేదు? : జగదీశ్ రెడ్డి**

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ న్యాయబద్ధంగా వ్యవహరించడం లేదని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగంగా పార్టీ మారి కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొంటున్నా స్పీకర్‌కు కనబడకపోవడం విచారకరం అని అన్నారు. స్పీకర్ ఏకపక్ష నిర్ణయాలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ చర్యలకు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు.

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నది కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ఫిరాయించిన ఎమ్మెల్యేలు బహిరంగంగా సభలకు, కాంగ్రెస్ కార్యక్రమాలకు హాజరవుతున్నారని, అది స్పీకర్‌కు కనపడటం లేదా అని నిలదీశారు. సభాపతి ఆత్మసాక్షిగా, చట్టపరంగా నిర్ణయం తీసుకోలేకపోతున్నారని విమర్శించారు. స్పీకర్ ఆ పిటిషన్‌ను డిస్మిస్ చేయడం చట్టవిరుద్ధమేనని అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను స్పీకర్ వదిలేసినా కోర్టుల్లో శిక్ష తప్పదని అన్నారు.



# డీసీపీ కార్యాలయ స్థల పరిశీలన

- **పరిశీలించిన డీసీపీ శిరీష,ఎసిపి లక్ష్మీ నారాయణ,సీఐ విజయ్ కుమార్,ఎమ్మార్వో నాగయ్య..**

షాద్ నగర్, ఫిబ్రవరి 4(మనం న్యూస్)ః రంగారెడ్డి షాద్ నగర్ పట్టణం ఫ్యూచర్ కమిషనరేట్ కు వెళ్ళడంతో షాద్ నగర్ జోన్ డీసీపీ గా శిరీష ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. అయితే డీసీపీ కార్యాలయం ప్రస్తుతం ఎసిపి కార్యాలయంలో కొనసాగుతుండగా తాత్కాలికంగా మిలీనియం టౌన్ షిప్ లో డీసీపీ కార్యాలయం రెడీ అవుతుంది.. అయితే శాశ్వత భవన నిర్మాణం కోసం ఎమ్మార్వో నాగయ్య తో కలిసి డీసీపీ శిరీష,ఎసిపి లక్ష్మీ నారాయణ, సీఐ విజయ్ కుమార్ లు కలిసి పట్టణంలోని సర్వే నంబర్ 179 లోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ రెండు ఎకరాల స్థలం,ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా ఉన్న కాళీ స్థలాన్ని పరిశీలించారు. స్థానికులుఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద డీసీపీ కార్యాలయం ఏర్పాటు చేస్తే ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందనికోరుతున్నారు.

## ప్రజాస్వామ్యం ఖూనీ
# స్పీకర్ తీరు రాజ్యాంగ విరుద్ధం: కేటీఆర్



హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీసుకుంటున్న నిర్ణయాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను వరుసగా కొట్టివేయడం రాజ్యాంగానికి గొడ్డలిపెట్టు అని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకే స్పీకర్ నడుచుకుంటున్నారని, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌పై అనర్హత పిటిషన్‌ను స్పీకర్ కొట్టివేయడాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే సంజయ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఫోటోలు, వీడియోలు కళ్లముందు కనిపిస్తున్నా, ఆధారాలు లేవంటూ పిటిషన్‌ను తిరస్కరించడం అర్థరహితమని అన్నారు. ఈ చర్య ద్వారా స్పీకర్ తన పదవికే అవమానం తెస్తున్నారని, అటు సుప్రీంకోర్టు తీర్పును, ఇటు ప్రజాతీర్పును కాలరాస్తున్నారని మండిపడ్డారు. జగిత్యాలలో మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డే ఆ ఫిరాయింపు ఎమ్మెల్యేను విమర్శిస్తున్న తరుణంలో స్పీకర్ ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

# ఊసురుతీసిన లోన్ యాప్

- **రూ.3 వేలకోసమే యాప్ వ్యక్తుల వేధింపులు..**
- **లోన్ యాప్ వేధింపుల(తో)కు మరో ప్రాణం బలి**
- **మనస్తాపంతో ఇంట్లోనే ఉరేసుకున్న వ్యక్తి.. చిక్కడపల్లిలో దారుణం**




హైదరాబాద్, మనం ప్రతినిధి : లోన్ యాప్ వేధింపులకు మరో ప్రాణం పోయింది. కేవలం రూ.3 వేల కోసం ఫోన్లు చేస్తూ బెదిరింపులకు గురిచేయడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఇంట్లోనే ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో ఈ దారుణం చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిక్కడపల్లిలో నివాసం ఉండే ప్రేమ్ కుమార్ గతంలో ఓ లోన్ యాప్ ద్వారా అప్పు తీసుకున్నాడు. రూ.3 వేల రుణం తిరిగి చెల్లించకపోవడంతో లోన్ యాప్ ఏజెంట్ ఫోన్ చేసి బెదిరింపులకు గురిచేస్తున్నాడు. ఇటీవల మేడారం జాతరకు వెళ్లిన ప్రేమ్ కుమార్‌కు తిరుగు ప్రయాణంలో లోన్ యాప్ ఏజెంట్ల నుంచి ఫోన్ వచ్చింది. తీసుకున్న రుణాన్ని వడ్డీతో సహా వెంటనే చెల్లించాలని ఏజెంట్ డిమాండ్ చేశాడు. వెంటనే చెల్లించకపోతే ప్రేమ్ కుమార్ ఫొటోలను న్యూడ్‌గా మార్చి కుటుంబ సభ్యులకు పంపడంతో పాటు ఆన్‌లైన్‌లో పెడతామని బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రేమ్ కుమార్.. బుధవారం తానుండే అద్దె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని చనిపోయాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# పురాతన కట్టడాల పరిరక్షణ కమిటీ అనుమతి ఉందా?

- **పాతబస్తీ మెట్రోపై హైకోర్టు వ్యాఖ్యలు**

హైదరాబాద్,ఫిబ్రవరి 4(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః పాతబస్తీలో మెట్రో నిర్మాణం వల్ల చారిత్రక కట్టడాలు దెబ్బతింటున్నాయని యాక్ట్ స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సీజే ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పాతబస్తీలో మెట్రో నిర్మాణానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో జరిగిన ఒప్పందాలపై మూడు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని మెట్రో నిర్మాణ సంస్థను హైకోర్టు ఆదేశించింది. వారసత్వ కట్టడాల సంరక్షణ కమిటీ ఏర్పాటుకు సంబంధించిన విషయాన్ని అందులో పొందుపర్చాలని ఆదేశించింది.

మెట్రో నిర్మాణ సంస్థ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్.. నిర్మాణానికి సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మెట్రో నిర్మాణం వల్ల 3 పురాతన కట్టడాలు మాత్రమే కూల్చేయాల్సి ఉంటుందని ఏఏజీ కోర్టుకు తెలిపారు. దీనికి సంబంధించి సంబంధిత శాఖకు దరఖాస్తు చేశామన్నారు. ప్రస్తుతం ఆస్తుల స్వాధీన ప్రక్రియ కొనసాగుతోందని, నిబంధనల మేరకు వారందరినీ ఖాళీ చేయిస్తామన్నారు. ఇప్పటి వరకు వారసత్వ కట్టడాల సంరక్షణ కమిటీనే ఏర్పాటు చేయలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది రామారావు వాదించారు. ఆ ప్రక్రియ కొనసాగుతోందని ఏఏజీ చెప్పారు. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు.. నిర్మాణానికి సంబంధించి అఫిడవిట్ దాఖలు చేయాలని మెట్రో నిర్మాణ సంస్థను ఆదేశిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

## పోమాలపల్లిలో ఫ్లెక్సీల చించి వేత



- **దుండగులపై చర్యలు తీసుకోవాలంటున్న యువకులు,పాలకవర్గం**
- **పోలీసులకు పిర్యాదు చేసినట్లు వెల్లడి**

షాద్ నగర్, ఫిబ్రవరి 4 (మనం న్యూస్)ః పోమాలపల్లి లో ఫ్లెక్సీల చించివేయడం దుర్మార్గపు చర్యలని పాలకవర్గం సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేశంపేట మండలంలోని పోమాల్ పల్లి గ్రామంలోని గుట్టపై నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గ్రామంలో పలుచోట్ల సర్పంచ్ పాలకవర్గం నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మంగళవారం రాత్రి గుర్తు తెలియని దండగులు చించివేయడం దుర్మార్గపు చర్యలని అన్నారు. గ్రామ వార్డు సభ్యులు మంగళగిరి రాఘవేందర్,బీఆర్ఎస్ యువ నాయకులు బండ కృష్ణయ్య యాదవ్,పోలేపోగు శ్రీకాంత్, పోమాల్ పల్లి గ్రామంలో తమ ఇంటివద్ద నూతన సర్పంచ్ పాలకవర్గంతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం ద్వారా ఈ ఫ్లెక్సీ లో ఉప సర్పంచ్ భూపాల్ రెడ్డి ఉన్న ఫోటోను మాత్రమే చించివేశారు.కావాలని,కక్షపూరితంగానే కొంతమంది గుర్తు తెలియని దండగులు ఈ ఘటనకు పాల్పడి ఉంటారని పాలకవర్గం సభ్యులు పోలే పోగు శ్రీకాంత్, బండ్ల కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు అయిపోయాక కూడా గ్రామంలో రాజకీయాలు చేయడం,పాలకవర్గంలో ఉన్న వార్డు సభ్యులను విడదియాలని,దూరం చేయాలనే కొంతమంది అరాచక శక్తులు చూడటం జరుగుతుందని ఇదంతా మంచిది కాదని అభిప్రాయపడ్డారు.ప్రశాంతకు నిలయమైన గ్రామంలో ఇలాంటి సంస్కృతికి తెరతీయడం భావ్యం కాదని,ఇది సిగ్గు చేటన్నారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు ఉపసర్పంచ్ భూపాల్ రెడ్డి తెలిపారు

# ‘పెద్ద’ లంచంతో దొరికిన ‘చిన్నా’రెడ్డి

- **బిల్లుల మంజూరుకు రూ.15 లక్షల డిమాండ్**



హైదరాబాద్,ఫిబ్రవరి 4(మనం,ప్రత్యేక ప్రతినిధి) ః హైదరాబాద్ నగరంలో పెద్ద మొత్తంలో లంచం తీసుకుంటూ ఓ అధికారి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్ఈ చిన్నారెడ్డి ఏసీబీ అధికారుల వలలో చిక్కారు. కాగా రూ.1.40 కోట్ల పనుల బిల్లుల వెరిఫికేషన్ పేరుతో ఓ కంట్రాక్టర్‌ను సదరు ఎస్ఈ చిన్నారెడ్డి రూ. 25 లక్షలు లంచం డిమాండ్ చేశారు. దీంతో రూ. 15 లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్న కాంట్రాక్టర్ వెంటనే ఏసీబీని ఆశ్రయించారు. దీంతో బిల్లుల మంజూరు విషయంలో లంచం డిమాండ్ చేసిన చిన్నారెడ్డి బుధవారం రూ.15 లక్షల లంచం తీసుకుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. అవినీతి తిమింగలం చిన్నారెడ్డిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్న అనంతరం కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఆయన చాంబర్‌తో కీలక ఫైళ్లు, కంప్యూటర్లు, ఇతర అధికారుల గదులను కూడా పరిశీలించారు.

**స్థిరచరాస్థులపై ః**

జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్ఈ చిన్నారెడ్డికి హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో స్థిర, చరాస్తులు ఉన్నాయా? అనే కోణంలో ఏసీబీ విచారణ కొనసాగిస్తోంఇ. ఇందులో భాగంగా ఆయన నివాసాలు, బంధువుల ఇళ్లలో కూడా సోదాలు నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమౌతున్నారు.

ఈ ఘటనపై చిన్నారెడ్డిపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. నిందితుని ఆస్తులపై పూర్తి స్థాయి విచారణ అనంతరం మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అధికారులు తెలిపారు.

# దివాళ కంపెనీకి బినామీ

- **ఆయనే బినామీ చీఫ్ మినిస్టర్**
- **వెలుగులోకి కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా అవినీతి బాగోతం..**
- **ఇది సీఎం బినామీ కంపెనీయే.. కేటీఆర్ ఆరోపణ**

హైదరాబాద్, మనం ప్రతినిధి : కాంగ్రెస్ సర్కార్ ప్రభుత్వ అవినీతిని బయటపెడుతోంది బీఆర్ఎస్‌యేనని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి స్పష్టం చేశారు. ఈ మేరకు తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. గత వారం పదిరోజులుగా వరుసగా మొదట హరీశ్‌రావును తర్వాత తనను, అనంతరం రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ రావు, అటు తర్వాత మా అధినాయకుడు కేసీఆర్‌ను విచారణకు పిలిపిస్తే మాకు అనుమానం వచ్చింది. ఈ డైవర్షన్ గేమ్ సీరియస్‌గానే అడుతున్నరు.. ఇంతకీ ఎందుకు ఆడుతున్నరని , ఇంత హడావిడిగా ఎందుకు చేస్తున్నరని చెప్పి మాకు డౌటు వచ్చింది. ఆ డౌటు వచ్చిన తర్వాత మేం కూడా తవ్వడం మొదలుపెట్టాం. ఎందుకోసం ఈ కవర్ డ్రైవ్‌లు, ఎక్స్‌ట్రా కవర్ డ్రైవ్లు అని జాగ్రత్తగా ఆలోచిస్తే మాకు ముఖ్యమంత్రి పెద్ద బినామీ బాగోతం ఒకటి బయటపడ్డదని కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా కంపెనీ అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చిందన్నారు కేటీఆర్. కేఎల్ఎస్ఆర్ సీఎం రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ అని అన్నారు.

రేవంత్ రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదు.. ఆయన బినామీ చీఫ్ మినిస్టర్ అని అందరికీ తెలుసు. ఇప్పుడాయన బినామీ చీఫ్ మినిస్టరే కాదు బినామీ మాస్టర్ అని చూపించే బాగోతం ఇదని కేటీఆర్ అన్నారు. వాటి నుంచి డైవర్ట్ చేసేందుకే మాకు నోటీసులు ఇచ్చారని అన్నారు. రేవంత్ వాడుతున్న కారు కూడా ఈ కంపెనీ పేరు మీదే ఉంది. టీఎస్‌౦7ఎఫ్ఎఫ్ 0009. ఇది ఆయన ముఖ్యమంత్రి కాకముందు తిరిగిన కారు. ఈ కారు ఎవరిపేరుమీద రిజిస్టర్ అయిందనుకున్నారు. ఆయన తిరిగే సొంతకారు కేఎల్ఎస్ఆర్ అనే ఇన్‌ఫ్రా కంపెనీకి. దాదాపు ఇది రెండున్నర కోట్లు విలువ చేసే కారు. లాండ్ క్రూజర్. ఆ కారును కేఎల్ఎస్ఆర్ కంపెనీ ఈయనకెందుకు కొనిచ్చింది. అంటే ఐటీ వాళ్లు సమాధానం చెప్పారు. ఈయనకు సంబంధించిన భూపాల్ ఇన్‌ఫ్రా కంపెనీలోకి కేఎల్ఎస్ఆర్‌నుంచి డబ్బులు పెద్ద ఎత్తున వస్తున్నాయి. రియల్‌ఎస్టేట్ డీల్ చేస్తున్నరని పేర్కొంది.

**2018లోనే ఐటీ దాడులు..**

రేవంత్ సీఎం కాగానే ఈ కంపెనీకి అనేక ప్రాజెక్టులు వచ్చాయని కేటీఆర్ అన్నారు. 2018లోనే ఈ కంపెనీపై ఐటీ దాడులు జరిగాయి. 2023లోనే ఈ కంపెనీ దివాళా తీసిందన్నారు. వాళ్ల దగ్గర సిబ్బందికి జీతాలు ఇచ్చేందుకు కూడా డబ్బులు లేవు. అలాంటి కంపెనీకి రూ.6 వేల కోట్ల పనులు ఇవ్వడం ఏంటి..? అని ప్రశ్నించారు. ఈ కంపెనీకి కాంట్రాక్టులు ఎందుకు ఇచ్చారని సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు ఇచ్చింది. ఈ కంపెనీ అవకతవకలపై దర్యాప్తు సంస్థలతో విచారణ చేయించాలని జనవరి 23న సుప్రీం కోర్టు ఆదేశించింది. దివాళ తీసిన కంపెనీకి రూ.6 వేల కోట్ల పనులు ఎలా ఇచ్చారో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# జేమ్‌కేర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఖమ్మం ఆధ్వర్యంలో వాకథాన్

## క్యాన్సర్‌కు అవగాహనే ప్రథమ చికిత్స




ఖమ్మం, ఫిబ్రవరి 4(మనం న్యూస్): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా, ఖమ్మంలోని (ఆరోగ్య హాస్పిటల్లోని) జేమ్‌కేర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ప్రజల్లో క్యాన్సర్ పై అవగాహన పెంపొందించేందుకు క్యాన్సర్ అవగాహన వాకథాన్ నిర్వహించారు. క్యాన్సర్ నివారణ, తొలిదశ గుర్తింపు సమయానుకూల చికిత్స గురించి ప్రజలకు అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యం గా ఈ వాకథాన్ నిర్వహించామన్నారు. క్యాన్సర్ చికిత్సలో అవగాహనే మొదటి - అత్యంత ముఖ్యమైన అడుగు అనే బలమైన సందేశం ప్రజలకు చేరాలన్నారు. క్యాన్సర్ కు అవగాహనే ప్రథమ చికిత్స అనే నినాదం తో ఈ వాకథాన్ ఉదయం 7:00 గంటలకు పెవిలియన్ గ్రౌండ్ నుండి ప్రారంభమై, గవర్నమెంట్ హాస్పిటల్, ఇల్లందు క్రాస్ రోడ్ మీదుగా జేమ్‌కేర్ క్యాన్సర్ ఇన్బిట్యూట్ వద్ద ముగిసింది. వివిధ వయస్సుల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, క్యాన్సర్ అవగాహనకు తమ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా జేమ్‌కే క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సీనియర్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సుధాకర్ కొట్లపాటి మాట్లాడుతూ ఈ వాకథాన్ ప్రధాన లక్ష్యం ప్రజలకు క్యాన్సర్కు సంబంధించిన సాధారణ లక్షణాలు, ప్రమాదకర కారణాలు అలాగే తొలిదశలో స్క్రీనింగ్ ఎంత ముఖ్యమో వివరించడమని అన్నారు. ఖమ్మం వంటి టియర్-3 నగరాల్లో అవగాహన లోపం , ఆలస్యంగా ఆసుపత్రికి రావడం వల్ల చాలా సందర్భాల్లో క్యాన్సర్ చివరి దశల్లో గుర్తించబడుతోందన్నారు. ఈ వాకథాన్ ద్వారా తొలిదశ అవగాహన అనేక ప్రాణాలను కాపాడగలదని, కుటుంబాలపై పడే మానసిక , ఆర్థిక భారం తగ్గించవచ్చని స్పష్టం చేశారు. ఒకప్పుడు క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధిగా భావించబడినప్పటికీ, నేటి ఆధునిక వైద్యంతో తొలిదశలో గుర్తిస్తే చాలా క్యాన్సర్లు పూర్తిగా నయం కావచ్చని తెలిపారు. అయినప్పటికీ, అవగాహనే ఇంకా అతిపెద్ద సవాలుగా ఉందన్నారు. చిన్న లక్షణాలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. అనంతరం జేమ్‌కేర్ క్యాన్సర్ ఇన్బిట్యూట్ సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ నుక్కసాని సుబ్బారావు, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్.హరీష్ రావూరి, ఆంకోపాథాలజిస్ట్ డాక్టర్ అమృత జి లు మాట్లాడుతూ జేమ్‌కేర్ క్యాన్సర్ ఇన్బిట్యూట్లో ఒకే చోట సంపూర్ణ క్యాన్సర్ చికిత్స అందుబాటులో ఉందని తెలిపారు. ఇక్కడ 4డి ట్రూ బీమ్ రేడియేషన్ థెరపీ వంటి ప్రపంచస్థాయి ఆధునిక సాంకేతికతతో పాటు, ఖచ్చితమైన నిర్ధారణకు ఉపయోగపడే అత్యాధునిక స్కానర్ సౌకర్యం ఉందన్నారు. అనుభవజ్ఞులైన ఆంకాలజీ వైద్య బృందం ఆధునిక మౌలిక వసతులతో, ఖమ్మం మరియు పరిసర జిల్లాల ప్రజలకు ప్రపంచ స్థాయి క్యాన్సర్ చికిత్సను దగ్గరగా అందించడమే సంస్థ లక్ష్యమని తెలిపారు.మరిన్ని వివరాలకు సాయి, 96765 87770 ఫోన్ నంబర్

## కాలం నీ ముందు తలవంచాలి

నీవే ఆకలితో మండుతున్న
అగ్నిపర్వతానివి
నీవే సమానత్వం కొరకు
బుసలు కొట్టు ఫణివి
నిత్యం అవమానాలతో సెగలు
కక్కుతున్న అగ్నిశిఖవు నువ్వే

తెగించి తిరగబడితే లావాలా
బూడిద చేసేది నువ్వే
నీ మౌనం మత్తు కాదు..
అది విలయానికి ముందున్న
ప్రశాంతత కావాలి
నీ సహనం చేతకానితనం కాదు..
అది ఉప్పెనగా మారే
నిశ్శబ్దత అవ్వాలి ఎన్నాళ్లని భరిస్తావు?

ఈ దోపిడీ దొంగల కపట నాటకాలు?
ఎన్నేళ్లని మోస్తావు ఈ స్వార్థ
రాజకీయాల బానిస సంకెళ్లు?
చదువుల కోవెలలో కుట్రల
విషం చిమ్ముతుంటే
అక్షరాయుధమై అన్యాయం
గుండెల్లో గురిపెట్టు

ఓట్ల చదరంగంలో నిన్ను
పావుగా మారుస్తుంటే
ప్రశ్నించే గొంతుకవై
ప్రజాస్వామ్యానికి ప్రాణం పోయి
నిన్ను వాడుకుని వదిలేసే
వేదికలు నీకు వద్దు
నీ ఉజ్వల భవిష్యత్తును
అమ్ముకునే బేరాలు అసలే వద్దు
నువ్వు రగిలితే ఒక చైతన్యం,
నువ్వు కదిలితే ఒక నవశకం కావాలి
అణచివేత పునాదుల మీద నిర్మించు
నీ అచంచల సామ్రాజ్యం!
తెగించి చూడు..
దిక్కులు దద్దరిల్లేలా
గర్జించి చూడు..
కాలం నీ ముందు తలవంచేలా!

**- దుప్పటి. మొగిలి**
8466827118

# వికసిత్ భారత్... వీబీ&జీ రామ్ జీ

భారతదేశం వికసిత దేశంగా మారాలనే లక్ష్యంతో, 2047 నాటికి 'వికసిత్ భారత్'ను సాకారం చేయడానికి ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతోంది. ఈ సందర్భంలో, 2025 డిసెంబర్ 16న లోక్‌సభలో ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ - గ్రామీణ రోజ్‌గార్ మరియు ఆజీవిక మిషన్ (**VB&G RAM G**) చట్టం, 2025 ఒక ముఖ్యమైన మైలురాయి. ఈ చట్టం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (**MGNREGA**)ను భర్తీ చేస్తూ, గ్రామీణ భారతదేశాన్ని మరింత బలోపేతం చేయడానికి రూపొందించబడింది. ఇది సమయానుగుణమైన పరిణామం దేశ అవసరాలకు తగినట్లు ఎలా మార్పులు తెచ్చింది, మరియు సహకార సమాఖ్య వ్యవస్థ ద్వారా ప్రజా సంక్షేమాన్ని ఎలా పెంచుతుంది అనేవి పరిశీలించాల్సిన అవసరం ఉంది.

ఈ చట్టం ఒక గుణాత్మకమైన మార్పు కోసం తయారు చేయబడింది. ఎందుకంటే **MGNREGA** 2005లో ప్రవేశపెట్టబడినప్పుడు, గ్రామీణ పేదరికాన్ని తగ్గించడం, ఉద్యోగాలు సృష్టించడం ద్వారా సామాజిక భద్రతా జాలాన్ని అందించడం దాని లక్ష్యం. అయితే, 20 సంవత్సరాల తర్వాత, భారత ఆర్థిక వ్యవస్థ మారింది. కోవిడ్-19 మహమ్మారి, వాతావరణ మార్పులు, డిజిటల్ టెక్నాలజీల పెరుగుదల వంటి కొత్త సవాళ్లు ఎదురయ్యాయి.

**VB&G RAM G** చట్టం ఈ మార్పులను ఎదు ర్కొని పీడిత ప్రజలను అభివృద్ధి వైపుగా ప్రయాణించేలా ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం రూపకల్పన చేసిందనే చెప్పాలి. లక్ష్యం ఆధారిత ఉపాధి కల్పన ద్వార ఇది పాత చట్టం యొక్క బలహీనతలను సరిచేస్తూ, మరిం త ఆధునిక, ఫలితాల ఆధారిత విధానాన్ని అవలం బిస్తుంది.

ఉదాహరణకు, **MGNREGA**లో ఏటా 100 రోజుల ఉపాధి హామీ ఉండేది. **VB&G RAM G**లో ఇది 150 రోజులకు పెంచబడింది, ముఖ్యంగా విపత్తు ప్రాంతాల్లో మరియు ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాల్లో ఇది గ్రామీణ కార్మికులకు మరింత ఆదాయ భద్రతను అందిస్తుంది. అంతేకాకుండా, చట్టం నీటి నిర్వహణ, గ్రామీణ కనెక్టివిటీ, వ్యవసాయ సహాయం వంటి కీలక రంగాల్లో స్థిరమైన ఆస్తులను సృష్టించడానికి ప్రాధాన్యత ఇస్తుంది. ఇది కేవలం ఉద్యోగాలు సృష్టించడం మాత్రమే కాకుండా, దీర్ఘకాలిక అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుంది. ఈ మార్పులు భారతదేశం యొక్క ప్రస్తుత అవసరాలకు, ముఖ్యంగా వాతావరణ మార్పులకు తగినట్టుగా ఉన్నాయి.

అయితే, ఒక విమర్శాత్మక అంశం ఏమనగా పాత చట్టం డిమాండ్-ఆధారిత హక్కును అందించేది, కానీ **VB&G RAM G**లో ఇది మరింత కేంద్రీకృతమై, బడ్జెట్-నిర్బంధితమైంది. ఇది కొంతమంది కార్మికులకు ఇబ్బందిగా ఉండవచ్చు కాని దీర్ఘకాలిక ప్రయోజనాలను కలింగిచేలా రూపొందిచబడింది. అయినప్పటికీ, ఇది పాత వ్యవస్థలోని అవినీతి, ఆలస్యాలను తగ్గించడానికి సహాయపడుతుంది. పారదర్శకత మరియు జవాబుదారీతనం కలిగిన పరిపాలన దిశగా దేశం అడుగులు



**VB&G RAM G** చట్టం భారతదేశం యొక్క విభిన్న అవసరాలను పరిగణనలోకి తీసుకుని రూపొందించబడింది. ఇందులో బయోమెట్రిక్ ధృవీకరణ, అఐ-ఆధారిత మోసాల గుర్తింపు, **GPS** ట్రాకింగ్ వంటి టెక్నాలజీలను అనుసంధానం చేయడం ద్వారా పారదర్శకతను పెంచుతుంది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విప్లవాన్ని ప్రోత్సహిస్తుంది, ముఖ్యంగా యువతకు నైపుణ్యాలు అందించడం మరియు జవాబుదారితనం రాష్ట్ర ప్రభుత్వాల పనితీరులో పెంపొందాలని ఈ నూతన చట్టం లక్ష్మణ రేఖలు దిద్దింది.

అంతేకాకుండా, చట్టం వికసిత భారత్ 2047 దృష్టికి అనుగుణంగా వేతనాలను పెంచుతుంది. ఇది మహిళలు, దివ్యాంగులు, షెడ్యూల్ కులాలు/తెగలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుంది, సమ్మిళిత అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుంటుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా, ఇది పట్టణ వలసలను తగ్గించి, స్థానిక అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది.

ఈ చట్టం చిన్న రైతులకు ప్రత్యేకంగా భూమిలేని నిరుపేద రైతు కూలీలకు మరింతగా సహాయపడుతుంది. వ్యవసాయ సంబంధిత ప్రాజెక్టులలో కార్మిక శక్తిని అందుబాటులో ఉంచడం ద్వారా, రైతులు తమ పొలాల్లో పనులు చేయడానికి అవసరమైన మానవ వనరులను సులభంగా పొందవచ్చు. ముఖ్యంగా పంటల కాలాల్లో లేదా ఆఫ్-సీజన్లో కార్మికుల కొరతను తీర్చడం, నీటి సరఫరా, భూమి సంరక్షణ వంటి పనులలో సహాయం అందించడం ద్వారా రైతుల ఉత్పాదకతను పెంచుతుంది. అనతరం భూమిలేని రైతు కూలీలకు సైతం ఉపాధిని కలిగిస్తుంది. అదేవిధంగా చిన్న రైతుల ఆదాయాన్ని మెరుగు పరుస్తుంది మరియు వారి ఆర్థిక స్థిరత్వాని కి తోడ్పుతుంది.

అదనంగా, ఈ చట్టం నిస్సాహాయ స్తితిలో ఉన్న ఇతర వర్గాలకు కూడా ప్రయోజనాలు అందిస్తుంది. మహిళలు, దివ్యాంగులు, షెడ్యూల్ కులాలు/తెగలు, వృద్ధులు వంటి వారికి ప్రత్యేక ఉపాధి అవకాశాలు, నైపుణ్య శిక్షణ, మరియు ఆర్థిక సహాయం అందుబాటులో ఉంచుతుంది. ఉదాహరణకు, మహిళలకు 33% రిజర్వేషన్, దివ్యాంగులకు సులభమైన పని వాతావరణం, మరియు వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యతా ప్రాజెక్టులు ద్వారా వారి సామాజిక-ఆర్థిక స్థితిని మెరుగు పరుస్తుంది. ఇది సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలను అందిస్తూ, సమ్మిళిత అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. అటువంటి అభివృద్ధి ఫలాలు ప్రజలందిరికి చేకూరితే ప్రముఖ భారతీయ తత్వవేత్త దంత్తోపంత్ తెంగిడి గారు ఆశించిన విధంగా సమాజంలో సమజిక సమరసత సాధ్యం అవుతుంది.

చాలామంది విమర్శించిట్టుగా టెక్నాలజీ అనుసంధానం గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ లభ్యత లేని వంటి సవాళ్ళు మనం అధిగమించలేనంతటివి ఏమికాదు. అయితే, ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలు, స్థానిక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చు.

**సహకార సమాఖ్య వ్యవస్థ: ప్రజా సంక్షేమానికి మార్గం**

భారతదేశం ఒక ఫెడరల్ దేశం, మరియు **VB&G RAM G** చట్టం సహకార ఫెడరలిజాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయాన్ని పెంచుతుంది, రాష్ట్రాలకు మరింత స్వేచ్ఛ ఇస్తుంది ప్రాంతీయ అవసరాలకు తగినట్లు కార్యక్రమాలు రూపొందించడానికి. ఉదాహరణకు, రాష్ట్రాలు స్థానిక ప్రాజెక్టులు ఎంచుకోవచ్చు, కానీ కేంద్ర మార్గదర్శకాలు పాటించాలి. ఇది పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తుంది, గ్రామ సభలు ప్రాజెక్టులు ప్రణాళిక చేయడంలో పాలుపంచుకోవడానికి అవకాశం ఇస్తుంది. ఇది స్థానిక స్వపరిపాలనను ప్రోత్సహిస్తుంది, ప్రజా సంక్షేమాన్ని మెరుగుపరుస్తుంది. ఇది ఏకరూపతను నిర్ధారిస్తుంది, అవినీతిని తగ్గిస్తుంది, మరియు జాతీయ లక్ష్యాల తో సమన్వయం చేస్తుంది.

**ముగింపు**

**VB&G RAM G** చట్టం, 2025 భారతదేశ గ్రామీణ అభివృద్ధికి ఒక సమయానుగుణమైన పరిణామం. ఇది మార్పులు తెచ్చి, దేశ అవసరాలకు తగినట్లు రూపొందించబడింది, సహకార ఫెడరలిజం ద్వారా ప్రజా సంక్షేమాన్ని పెంచుతుంది. విమర్శలు ఉన్నప్పటికీ, ఇది ఒక ముందడుగు. సరైన అమలు ద్వారా సమ సమాజ శ్రేయస్సే స్థాపన దిశగా ఇది వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

**- డా.జి. అశోక్, అసిస్టెంట్ ప్రొఫెసర్**
ఇందిరాగాంధి నేషనల్ ఓపెన్ యూనివర్సిటి (ఇగ్నో)
9676896300

# మట్టి మనిషి 'వట్టికోట'

తెలంగాణ ప్రజాసాహిత్య చరిత్రలో వట్టికోట ఆళ్వారుస్వామిది ఒక మహోన్నత స్థానం. ఆయన కేవలం రచయిత మాత్రమే కాకుండా ఉద్యమకర్త, కమ్యూనిస్టు నాయకుడు, ప్రచురణ కర్త, పాత్రికేయుడిగా విభిన్న రంగాలలో సేవలందించారు. భాషా సాహిత్యం నుంచి పౌరహక్కుల ఉద్యమాల వరకు అనేక రంగాలలో ఆయన తన ప్రతిభను ప్రద ర్శించారు. ఆయనకు 'తెలంగాణ ప్రజా సాహిత్య పితామహుడు' అనే బిరుదు అందించారు.

1915 నవంబర్ 1న నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం చెరువు మాదారం అనే గ్రామంలో జన్మించిన ఆళ్వారుస్వామి, చిన్నతనం నుండే సామాజిక అన్యాయాలను గమనించారు. ఈ అన్యాయాలు ఆయనలో చైతన్యాన్ని, మార్పు తపనను రేకెత్తించాయి. ఆయనకు సాహిత్యం పట్ల ఉన్న ఆసక్తిని 'గ్రంథాలయోద్యమం' మరింత పెంచింది. నిజాం పాలనలో ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ దౌర్జన్యాలు ఆయనను రాజకీయాల వైపు నడిపించాయి.

వట్టికోట ఆళ్వారుస్వామి నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. పేద ప్రజల పట్ల అన్యాయం, వివక్షలపై ఆయన గళం ఎత్తారు. ఈ ఉద్యమంలో ఆయన అనేక సార్లు జైలు శిక్ష అనుభవించారు. జైలు జీవితం ఆయన వ్యక్తిత్వం, సాహిత్యంపై విపరీతమైన ప్రభావం చూపింది. జైలులో ఉన్నప్పుడు ఆయన తన అనుభవాలను కథల రూపంలో అభివ్యక్తం చేయడం ప్రారంభించారు. 'జైలు లోపల' అనే కథా సంపుటి ఆయన జైలు అనుభవాలకు ప్రతిబింబంగా నిలిచింది, ఇందులో జైలు లోపల నిర్బంధితుల జీవితం, వారి బాధలు వాస్తవానికి దగ్గరగా ఉంటాయి.

తెలుగులో రాజకీయ నవలలను రచించిన మొట్ట మొదటి వ్యక్తిగా వట్టికోట ఆళ్వారు స్వామి ప్రసిద్ధి చెందారు. ఆయన 'ప్రజల మనిషి' అనే నవల రచించి తెలంగాణ ప్రజల జీవన పరిస్థి



తులను, సామాజిక అన్యాయాలను, ప్రజల మానసిక స్థితిగతులను ప్రతిబింబించారు. ఈ నవల ఆనాటి సామాజిక, రాజకీయ పరిస్థితులపై తీవ్ర విమర్శగా నిలిచింది. వట్టికోట రచనల్లోని కథలు, నాటికలు సమాజాన్ని విమర్శిస్తూ, ప్రజలను చైతన్యవంతం చేసే లక్ష్యంతో ఉన్నవి. సురవరం ప్రతాప రెడ్డి హైదరాబాద్ లో స్థాపించిన 'గోలకొండ' పత్రికలో ప్రూఫ్‌రీడర్ గా పని చేసారు.

వట్టికోట ఎల్లప్పుడూ ప్రజాస్వామ్య విలువలను గౌరవించి, ప్రజా స్వేచ్ఛను కాపాడటానికి కృషి చేశారు. సమాజంలో న్యాయం, సమానత్వం రావాలనే ఆశయంతో ఆయన అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. వట్టికోట ప్రజాసాహిత్య చైతన్యానికి ఒక బలమైన పునాదిగా నిలిచారు. ప్రజల జీవన గాధలను సాహిత్యంలోకి తీసుకురావడం ద్వారా సామాజిక మార్పు తపనను ప్రేరేపించారు.

తెలంగాణాలో స్టేట్ కాంగ్రెస్, ఆర్య సమాజం, ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ, అభ్యుదయ రచయితల సంఘం, తెలంగాణా రచయితల సంఘం వంటి సామాజిక, రాజకీయ సాహిత్య సంస్థలలో కార్యకర్తగా, నాయకుడిగా పనిచేశారు. హైదరాబాద్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, 1944లో గుమాస్తాలు సంఘం, రిక్షాకార్మిక సంఘం, రైల్వే ఉద్యోగులు, కార్మిక ఉద్యోగుల సంఘాలకు నాయకత్వం వహించారు.

వట్టికోట ఆళ్వారుస్వామి కేవలం ఒక రచయిత మాత్రమే కాకుండా సమాజ సేవకుడు, ఉద్యమకర్త, ప్రజల చైతన్య దాత అని చెప్పవచ్చు. ఆయన రచనలు ప్రజల బాధలను, వారి ఆశయాలను ప్రతిబింబిస్తూ, ప్రజాస్వామ్య పునాదుల స్థాపనకు తోడ్పడతాయి. ఆయన సాహిత్యం తెలంగాణ ప్రజా సాహిత్యంలో ఒక అద్భుతమైన అధ్యాయంగా నిలిచిపోతుంది.

దాశరథి వట్టికోట కలసి 1948లో మూడు నెలలు నిజామాబాద్ జైలులో ఉన్నారు. దాశరథి పద్యాలు జైలు గోడల మీద రాసి దెబ్బలు తిన్నారు. 1961 ఫిబ్రవరి 5న మరణించారు.

**ఫిబ్రవరి 5...వట్టికోట ఆళ్వారుస్వామి వర్ధంతి**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# పెరుగుతున్న సామాజిక అసమానతలు..?



సాధారణంగా వాతావరణ మార్పులను ఉష్ణోగ్రతల పెరుగుదల, సముద్ర మట్టం పెరగడం, కార్బన్ ఉద్గారాల గణాంకాల రూపంలో మాత్రమే చర్చిస్తారు. కానీ వాస్తవానికి ఇది జీవన హక్కు, అభివృద్ధి హక్కు, సమానత్వం వంటి మౌలిక మానవ విలువలతో నేరుగా ముడిపడి ఉంది. అంతర్జాతీయ వాతావరణ మార్పు మండలి (**IPCC**) ప్రకారం, మానవ కార్యకలాపాలే వాతావరణ మార్పుకు ప్రధాన కారణం, దాని ప్రభావాలు ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తున్నాయి. అందువల్ల ఇది భవిష్యత్ ప్రమాదం మాత్రమే కాక , ప్రస్తుతం కొనసాగుతున్న సామాజిక సంక్షోభం.



వాతావరణ మార్పును సామాజిక న్యాయ సమస్యగా పరిగణించడానికి ప్రధాన కారణం బాధ్యత మరియు బాధ మధ్య ఉన్న తీవ్రమైన అసమానత. ప్రపంచవ్యాప్తంగా గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలకు ప్రధానంగా కారణమైనవి కొద్ది సంపన్న దేశాలు మరియు అధిక వినియోగ జీవనశైలి కలిగిన వర్గాలు. 2023 నాటికి ప్రపంచ గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు సుమారు 53 గిగాటన్నుల ఇ సమానంగా నమోదయ్యాయి. చారిత్రకంగా పరిశ్రమల విప్లవం నుంచి ఇప్పటివరకు అధిక కార్బన్ ఉద్గారాలకు బాధ్యత వహించినవి ఉత్తర అమెరికా మరియు యూరోప్ దేశాలే. కానీ ఆఫ్రికా, దక్షిణ ఆసియా, చిన్న దీవి దేశాలు అత్యల్ప ఉద్గారాలు చేసినప్పటికీ, తీవ్రమైన కరువులు, వరదలు, తుఫాన్లు వంటి విపత్తులను ఎదుర్కొంటున్నాయి. ఈ అసమానతే క్లైమేట్ జస్టిస్ భావనకు మూలం.

ఇటీవలి ప్రపంచ సంఘటనలు ఈ వాస్తవాన్ని మరింత స్పష్టంగా నిరూపిస్తున్నాయి. 2022లో పాకిస్తాన్‌లో సంభవించిన వరదలు దేశంలోని విస్తృత ప్రాంతాలను ముంచెత్తి లక్షలాది మందిని నిరాశ్రయులను చేశాయి. వ్యవసాయం, ఆహార భద్రత, ఆరోగ్యం అన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి. అదే విధంగా దక్షిణ ఆఫ్రికా ప్రాంతాల్లో సంభవించిన భారీ వరదలు వాతావరణ మార్పు ప్రభావాలు ఎంత ప్రమాదకరంగా మారుతున్నాయో సూచిస్తున్నాయి. ఈ విపత్తుల్లో ప్రధానంగా బాధపడినవారు పేద ప్రజలే. సంపన్న వర్గాలకు విపత్తుల తర్వాత తిరిగి నిలబడే సామర్థ్యం ఉన్నా, పేదల కోసం అదే విపత్తు దీర్ఘకాలిక పేదరికంగా మారుతోంది. వాతావరణ మార్పు ప్రభావాలు పేద ప్రజలపై అనుపాతానికి మించి పడుతున్నాయి. పేదలు సాధారణంగా వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో, అసురక్షిత గృహాల్లో నివసిస్తారు. వారికి బీమా, పొదుపు, ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు ఉండవు. దీనితో పాటు వాతావరణ మార్పు ఆహార భద్రతపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అస్థిర వర్షపాతం, కరువులు వ్యవసాయ ఉత్పత్తిని తగ్గిస్తున్నాయి. చిన్న రైతులు పంటలు కోల్పోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. పిల్లలు, మహిళలు పోషకాహార లోపానికి గురవుతున్నారు. ఈ పరిస్థితులు ఆకలి మరియు ఆరోగ్య అసమానతలను మరింత పెంచుతున్నాయి.

వాతావరణ మార్పు యొక్క మరో కీలక పరిణామం క్లైమేట్ రెఫ్యూజీస్ సమస్య.

సముద్ర మట్టం పెరుగుదల, ఎడారీకరణ, వరదల కారణంగా ప్రజలు తమ నివాసాలను వదిలి వలస వెళ్లాల్సి వస్తోంది. కానీ ఈ వాతావరణ వలసదారులకు అంతర్జాతీయ చట్టాల్లో స్పష్టమైన గుర్తింపు లేకపోవడం వల్ల వారు సామాజిక, ఆర్థిక వివక్షను ఎదుర్కొంటున్నారు. ఇది తీవ్రమైన సవాలుగా మారుతోంది.అందువల్ల వాతావరణ మార్పును సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే వాతావరణ న్యాయాన్ని కేంద్రంగా పెట్టిన విధానాలు అవసరం.

సంపన్న దేశాలు తమ చారిత్రక బాధ్యతను అంగీకరించి పేద దేశాలకు ఆర్థిక సహాయం, సాంకేతిక బదిలీ అందించాలి. న్యాయమైన మార్పు ద్వారా ఫాసిల్ ఇంధన రంగంపై ఆధారపడిన కార్మికులకు రక్షణ కల్పించాలి. మహిళలు, ఆదివాసీలు, పేద వర్గాలను నిర్ణయ ప్రక్రియల్లో భాగస్వాములుగా చేయాలి. వాతావరణ మార్పు మన ముందుంచుతున్న అసలు ప్రశ్న ఏమిటంటే మన అభివృద్ధి ఎవరి కోసం?.

ఎవరి ఖర్చుతో జరుగుతోంది అన్నదే. అందరికీ వాతావరణ సమతుల్య న్యాయాన్ని కేంద్రంగా అనుసరించే విధానాలే పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, మానవ గౌరవాన్ని ఒకేసారి సాధించగలవు. వాతావరణ న్యాయం, ఆర్థిక సహకారాలతోనే వాతావరణ సంక్షోభాల పరిష్కారం సాధ్యం అవుతుంది.

**- గిలకత్తుల వెంకటరమణ గౌడ్**
9866878769

# ప్రజలను భయపెట్టే వ్యూహం వైసీపీది



రాజకీయంగా ఉనికి కోసం ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడాన్ని ఒక వ్యూహంగా వైసీపీ మార్చుకుంది. అధికారంలో ఉంటే పీకలు కోయడం, హింసాత్మక దాడులను ప్రోత్సహించిన జగన్. అధికారం పోయాక కూడా అదే తరహాలో తన పార్టీ మూకలను రెచ్చగొడుతున్నారు. స్వయంగా అధినేతే హింసను, దాడులను ప్రోత్సహిస్తుండడంతో, వైసీపీ మూకలు గంజాయి మత్తులో మారణాయుధాలతో రాష్ట్రంలో స్వైర విహారం చేస్తున్నాయి.

వైసీపీ నేతల హింసోన్మాదం సమాజ ప్రశాంతతను, రాష్ట్ర భవిష్యత్తుకు ఆటంకంగా తయారయింది. వైసీపీ అనుసరిస్తున్న తీరు గమనిస్తే, అది కేవలం రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా, ఒక రకమైన సామాజిక ఉన్మాదాన్ని ప్రేరేపించేలా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సోషల్ మీడియా వేదికల నుండి ప్రత్యక్ష దాడుల వరకు.. రప్పా రప్పా డైలాగుల నుండి కత్తులు,తల్వార్లు చూపిస్తూ చేసే హెచ్చరికల వరకు.. జంతు బలులతో రక్తాభిషేకాల వరకు.. ఇవన్నీ ఒక ప్రకడ్బందీ వ్యూహంగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు బీహార్‌లో ఉండే ఈ అరాచకం నేడు ఆంధ్ర రాష్ట్రానికి వైసీపీ నేతలు తీసుకువస్తున్నారు.

ప్రభుత్వాలు మారినప్పుడు కక్షసాధింపు చర్యలు సహజమని భావించే కాలంలో, ప్రస్తుత ప్రభుత్వం చట్టాన్ని గౌరవిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్లడాన్ని కొందరు అలుసుగా తీసుకుంటున్నారు. చట్టబద్ధమైన పాలన దిశగా అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వ పాలననీ చేతగాని తనం అనుకోవడం వైసీపి అవివేకానికి తార్కాణం. చట్టాన్ని అమలు చేయడం అంటే హింసించడం కాదు, తప్పు చేసిన వారికి చట్టం ద్వారా శిక్ష పడేలా చూడటం. ఈ మౌనాన్ని చేతకానితనంగా భావిస్తే, చట్టం తన పని తాను చేసుకుపోయినప్పుడు వచ్చే ఫలితం తీవ్రంగా ఉంటుంది. అయితే చట్టమన్నా, న్యాయస్థానాలన్నా వైసీపీ నేతలకు గౌరవమనేది ఎప్పుడు లేదు. రాజకీయాల్లో గెలుపు ఓటములు అనేవి సహజం. గెలిస్తే తన ఇష్టారాజ్యంగా పాలిస్తామంటే కుదరదు. ప్రజల్లో ఒక రకమైన భయాందోళన సృష్టించి, ఏవేవో అంశాలను తెరపైకి తెచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించడం అనేది తగదు. అధికారంలో ఉన్నప్పుడు సమర్ధించి.. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నాం కదా అని వ్యతిరేకిస్తాము అంటే కుదరదు. ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు కూడా. ఒక రాజకీయ నాయకుడిగా పాటించాల్సిన కనీస విలువలు, ఒక రాజకీయ పార్టీకి ఉండాల్సిన కనీస విశ్వసనీయత లేకుండా వైసీపీ రాజకీయం నడిపింది. ప్రత్యర్థి పార్టీల నేతలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది.

15 ఏళ్ల వైయస్సార్ కాంగ్రెస్ ప్రస్థానంలో.. ఒక ఐదేళ్లు మాత్రమే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. మిగిలిన కాలంలో ఏపీ ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారు. అయితే దానిపై ఎంత మాత్రం ఆలోచన చేయడం లేదు. బూతు మాటలతో, కవ్వింపు చర్యలతో వైసిపి 2.0 కోసం కలలు కంటున్నారు జగన్మోహన్ రెడ్డి. ఇప్పుడేదో తాను సుపరిపాలన అందించానని.. తన హయాంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ ఐదేళ్ల పాలనలో జరిగిన ఘటనలు గుర్తు



చేసుకుంటే నిద్ర పట్టదు.

రాష్ట్రవ్యాప్తంగా వాలంటీర్లను రాజకీయ అవసరాలకు వాడుకుని రోడ్డున పడేసిన జగన్, ఇప్పుడు తన సొంత పార్టీ నేతలను కూడా అదే బాటలో నడిపిస్తున్నారు. బూతులు మాట్లాడితేనే పదవులు, గుర్తింపు దక్కుతాయనే భ్రమలో ఉన్న నేతలు.. ఆ భాష వల్లే ప్రజల్లో చీదరింపుకు గురవుతున్నారు. వ్యక్తిగత ప్రతిష్టను పణంగా పెట్టి పార్టీ కోసం తిట్లు తింటున్నా, కనీసం నైతిక మద్దతు ఇచ్చే నాథుడు లేకపోవడం వైసీపీ నేతల దుస్థితికి అద్దం పడుతోంది. వాలంటీర్లకైనా కనీసం గుర్తింపు ఉండేదేమో కానీ, ఈ కాలకేయ నేతలకు మాత్రం సొంత పార్టీలోనే గౌరవం లేని పరిస్థితి నెలకొంది.

ఇన్ని అవమానాలు, ఇంతటి నిర్లక్ష్యం ఎదురవుతున్నా ఇంకా ఆ పార్టీలో కొనసాగడం అంటే ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడమే. వాడుకుని వదిలేసే సంస్కృతి ఉన్న చోట విధేయత చూపడం అంటే, తమ రాజకీయ జీవితాన్ని తామే చేజేతులా సమాధి చేసుకోవడమే. సిగ్గులేని ఈ బానిస బతుకుల కంటే, స్వతంత్రంగా ఉండటమే మేలనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. జగన్‌రెడ్డి రాజకీయాన్ని నమ్ముకుని ఆయన వెంట నడిచిన వారు బాగుపడిన చరిత్ర లేదు. ఆ విషయం గుర్తు తెచ్చుకుంటే.. వైసీపీ నేతలకు తమకు ఓ క్లారిటీ వస్తుంది

పల్నాడులో బోండా ఉమామహేశ్వరరావు కారుపై జరిగిన దాడి ఇప్పటికీ సోషల్ మీడియాలో కనిపిస్తూనే ఉంటుంది. ఇనప రాడ్లతో దాడి చేశారు అప్పట్లో. దానిని ప్రోత్సహించింది అప్పటి వైసీపీ పాలకులు కాదా? అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇంటిపై జోగి రమేష్ దండయాత్ర చేశారు. కర్రలతో దాడికి దిగారు. అందులో తప్పేముంది అని ప్రశ్నించి జగన్ సమర్థించుకున్నారు. అప్పటి వైసీపీ నేతలు గంట అరగంట భాగోతాలు, అనంతబాబు డోర్ డెలివరీ అరాచకాలు, గోరంట్ల మాధవ్ విశ్వరూపాలు ఆస్వాదించిన జగన్ ఇప్పుడు అరవ శ్రీధర్ విషయంలో విలువలు అంటూ ఉపన్యాసాలు చేస్తున్నారు. తాను చేస్తే నీతి.. ఎదుటివాడు చేస్తే బూతు అన్నట్టు హంగామా చేస్తున్నారు. నాడు చంద్రబాబు అరెస్టు సక్రమం అన్నారు. ఇప్పుడు మాత్రం అరెస్టులు చేస్తే అక్రమం అంటున్నారు. అయితే జనాలు అన్ని గమనిస్తున్నారన్న విషయాన్ని మరిచిపోతున్నారు.

రాజకీయ విమర్శలు సిద్ధాంతపరంగా ఉండాలి కానీ, వ్యక్తిగత దూషణలుగా మారకూడదు. వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా వాడుతున్న భాష రాష్ట్ర రాజకీయ సంస్కృతిని దిగజార్చుతోంది. దీన్ని ఆదిలోనే అరికట్టకపోతే, భవిష్యత్ తరాలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయి. కాలకేయ ధోరణితో రెచ్చిపోతున్న వారికి చట్టపరమైన కఠిన చర్యలే సరైన మందు. నోటి పారుదలని ప్రజాస్వామ్య హక్కుగా భావించలేము. ప్రజల్లో అలజడి సృష్టించి, ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచాలనేది ఒక వ్యూహాత్మక కుట్రలా కనిపిస్తోంది. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ద్వారా ప్రభుత్వం సహనం కోల్పోయేలా చేసి, ఆపై బాధితుడి కార్డు ప్లే చేయాలనేది పాత పద్ధతి. ఇలాంటి వ్యూహాలను చిత్తు చేయాలంటే, ప్రభుత్వం ఊహించని రీతిలో, పక్కా ఆధారాలతో చట్టపరమైన ట్రీట్‌మెంట్ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

గతంలో డీజీపీ వంటి రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారిని కూడా రాజకీయ అవసరాలకు వాడుకున్న తీరు ఆంధ్రప్రదేశ్ ప్రజల కళ్ల ముందే ఉంది. ఇప్పుడు ఆ వ్యవస్థలను మళ్లీ గాడిలో పెట్టే ప్రయత్నం జరుగుతోంది. చట్టం తన పని తాను చేయనివ్వడం అంటే అధికారులకు స్వేచ్ఛనివ్వడం. దీన్ని ప్రభుత్వం బలహీనతగా భావించడం వైసీపీ నేతల అవివేకం. వ్యవస్థలు ఒక్కసారి యాక్టివేట్ అయితే, అరాచక శక్తులకు పారిపోయే దారి కూడా దొరకదు. ప్రజాస్వామ్యంలో ఓర్పుకు కూడా ఒక హద్దు ఉంటుంది. అడ్డగోలుగా తిడుతూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిని ఉపేక్షించడం అంటే పరోక్షంగా వారిని ప్రోత్సహించడమే అవుతుంది. మిగిలిన వారు ఇలాంటి ధైర్యం చేయకుండా ఉండాలంటే మొదట్లోనే చెలరేగే వారిపై కఠినంగా వ్యవహరించాలి. రౌడీయిజానికి రాజకీయం ముసుగు వేస్తే అది చెల్లదని నిరూపించాల్సిన సమయం ఆసన్నమైంది.

**- వాసంశెట్టి సుభాష్**
కార్మికశాఖ మంత్రి
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

# బుద్ధి మాంద్యం పిల్లల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు

- నెల రోజుల లోపు చిల్డ్రన్ హోమ్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**సుల్తానాబాద్, ఫిబ్రవరి 04 (మనం న్యూస్):** బుద్ధి మాంద్యం పిల్లల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్, పెద్దపల్లి పట్టణాలలో విస్తృతంగా పర్యటించారు. సుల్తానాబాద్ పట్టణంలో బుద్ధి మాంద్యం పిల్లలకు ఏర్పాటు చేసిన పాఠశాల, చిల్డ్రన్ హోమ్, వృద్ధాశ్రమం, ఔషధ గోడౌన్, పెద్దపల్లి పట్టణంలోని చిల్డ్రన్ హోమ్ ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, బుద్ధి మంద్యం పిల్లలకు ఏర్పాటుచేసిన పాఠశాలలో వారి అభివృద్ధి చెందుతున్న తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. పిల్లలకు అవసరమైన ఫిజియోథెరపీ సేవలు పూర్తి స్థాయిలో అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న ఫిజియోథెరపిస్ట్ సేవలను పూర్తి స్థాయిలో వాడుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎదుగుదల సరిగ్గా లేని పిల్లలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డును వినియోగించాలని కలెక్టర్ తెలిపారు. వృద్ధాశ్రమం కు సరఫరా చేసిన వస్తువులను తనిఖీ చేసి త్వరగా వృద్ధాశ్రమం ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. చిల్డ్రన్ హోమ్ నిర్మాణ పనులు ఆలస్యం కావడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. చిల్డ్రన్ హోమ్ నిర్మాణ పనులు నెల రోజులలో పూర్తి కాని పక్షంలో సంబంధిత ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం గట్టేపల్లి లోని ఎం.పీ.పీ.ఎస్.పాఠశాల ను సందర్శించి విద్యార్థుల హాజరు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఔషద గోడౌన్ లో మెడిసిన్ స్టాక్ కట్టుదిట్టంగా మెయింటైన్ చేయాలని అన్నారు. పెద్దపల్లి చిల్డ్రన్ హోమ్ లో కలెక్టర్ పిల్లలతో ముచ్చటించి వారికి అందుతున్న సేవల వివరాలు తెలుసుకున్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ అధికారి వేణు గోపాల్, ఎంపీడీవో దివ్య దర్శన్ రావు ,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న చైన్‌మేన్ ఈ. రఘు సస్పెండ్

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, ఫిబ్రవరి 4 (మనం ప్రతినిధి):** విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న చైన్ మేన్ ఈ. రఘు ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మంథని రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో డిప్యూటేషన్ పై చైన్ మేన్ గా పని చేస్తున్న ఈ. రఘు విధుల నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అనేకసార్లు మెమోలు జారీ చేసినప్పటికీ ఎటువంటి మార్పు లేకుండా జనవరి 13, 2026 నుంచి ఎటువంటి సమాచారం అందించకుండా విధులకు గైర్హాజరు కావడం గమనించామని మంథని ఆర్.డి.ఓ.నివేదిక సమర్పించారని అన్నారు. అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించి కమాన్ పూర్ తహసిల్దార్ కార్యాలయం లో చైన్‌మేన్‌గా పనిచేస్తున్న ఈ. రఘు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా సస్పెండ్ చేస్తున్నట్లు, సస్పెన్షన్ కాలంలో అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్ దాటి వెళ్లడానికి వీలు లేదని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



# వాకర్స్ సమస్యలు పరిష్కరిస్తాం

- కాలేజీ గ్రౌండ్ లో వాకర్స్ కోసం ప్రత్యేక ట్రాక్ నిర్మాణం
- వ్యాయామం కోసం ప్రత్యేక జిమ్
- గ్రౌండ్ లో స్పెషల్ డ్రైనేజీ సిస్టం
- పురాతన భవనం పూర్తి గ్రౌండ్ ను వెడల్పు చేస్తాం
- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 04 (మనం న్యూస్):** సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి మార్నింగ్ వాక్ కు హాజరయ్యారు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ

వాకర్స్ కోసం గ్రౌండ్లో ట్రాక్ నిర్మాణం చేపడతామని తెలిపారు. పాత గదులను కూల్చివేసి గ్రౌండ్ను వెడల్పు చేస్తామని చెప్పారు. అలాగే గ్రౌండ్లో డ్రైనేజీ సిస్టం ఏర్పాటు చేస్తామని వివరించారు. వ్యాయామ కోసం ప్రత్యేక జిమ్ తో పాటు ఇన్స్ట్రుమెంట్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. తాను చదివిన కాలేజీని అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. ఇది తన అదృష్టమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా హైస్కూల్ కు కొత్త భవనం నిర్మిస్తున్నట్లు వివరించారు. సుల్తానాబాద్ పట్టణం నిరంతర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అన్నారు. ఇప్పటికే సుల్తానాబాద్ పట్టణాన్ని 2 సంవత్సరాల కాలంలో రూ.20 కోట్లతో అభివృద్ధి చేశామని, మరిన్ని అభివృద్ధి పనులకు రూ .15 కోట్ల పనులు జరుగుతున్నాయని చెప్పారు. పెద్ద చెరువును 8 కోట్ల 50 లక్షలతో మినీ ట్యాంక్ బండ్ గా ఏర్పాటు చేస్తామని, ఐబి పాత భవనాన్ని కూల్చివేసి రూ.4 కోట్లతో నూతన గెస్ట్ హౌస్ భవనాన్ని నిర్మాణం చేస్తామని, కొత్త మున్సిపల్ ఆఫీస్ భవనాన్ని నిర్మిస్తామని ప్రకటించారు. తెలంగాణ చౌరస్తా నుండి గట్టేపల్లి క్రాసింగ్ వరకు రూ. 7 కోట్ల 50 లక్షలు తో సెంట్రల్ లైటింగ్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.సుల్తానాబాద్ పట్టణంలో దాదాపు 220 కి పైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి నిరుపేదలను ఆదుకున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. ప్రజలు తమ పనితీరును, అభివృద్ధి పనులను చూసి ఓట్లు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి సుజాత

**జగిత్యాల, ఫిబ్రవరి 04(మనం న్యూస్):** ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాల గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో క్యాన్సర్ మహమ్మారిపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ రోజుల్లో క్యాన్సర్ భూతానికి ఎంతో మంది బలవుతున్నారని ప్రజలందరూ క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని, ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ ను నిర్ధారించుకోవచ్చని,. ప్రారంభ దశలో క్యాన్సర్ను గుర్తించడం ద్వారా చికిత్స మెరుగుపడే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పోషకాహారం తీసుకుంటూ జీవనశైలి విధానంలో మార్పులు చేసుకుంటూ ఆరోగ్యపు అలవాట్లను పెంపొందించుకుంటూ ఉంటే క్యాన్సర్ రాకుండా నివారించుకోవచ్చని సూచించారు ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీల్ కుమార్, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణమూర్తి, ఆర్ ఎం ఓ లు,డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ఎన్ శ్రీనివాస్, గైనకాలజిస్ట్ హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ అరుణ,మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రాజేందర్ డాక్టర్ నరేంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం పై ఎంపి వంశీకృష్ణ తీవ్ర విమర్శలు



**పెద్దపల్లి, ఫిబ్రవరి 04 (మనం ప్రతినిధి):** పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని మోదీ దేశాన్ని స్వతంత్రంగా నడిపుతున్నారా లేక విదేశీ ఒత్తిళ్లతో ట్రంప్ చేత నడుపిస్తున్నారా అనే సందేహాలు ప్రజల్లో ఉన్నాయన్నారు. ఇది సాధారణ రాజకీయ అంశం కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన విషయమని అన్నారు. రష్యన్ ఆయిల్ దిగుమతులు తగ్గితే లక్ష కోట్ల నష్టం జరిగే ప్రమాదం ఉందని, మేక్ ఇన్ ఇండియా విధానాన్ని పక్కనపెట్టి అమెరికా ఉత్పత్తులపై టారిఫ్లు తొలగించడం దేశీయ పరిశ్రమలకు హానికరమని పేర్కొన్నారు. దీని వల్ల రెండు లక్షల నుంచి మూడు లక్షల కోట్ల రూపాయల వరకు భారత ఆర్థిక వ్యవస్థకు నష్టం కలగనున్నట్లు అంచనా వేశారు. దేశ ప్రయోజనాలను కాపాడేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే పోరాటం కొనసాగుతుందని ఎంపి గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.

# మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

- రెండవ రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

**జగిత్యాల పిబ్రవరి 04( మనం ప్రతినిధి):** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండవ రాండమైజేషన్ ప్రక్రియనుజిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఇందులో జిల్లా కలెక్టర్ మరియు ఎన్నికల అధికారి బి. సత్యప్రసాద్ బుధవారం జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు సమక్షంలో రెండవ రాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాలనే ఉద్దేశంతో ఈ రాండమైజేషన్ చేపట్టినట్లుగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలను ఎలాంటి లోపాలు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, జిల్లా నోడల్ అధికారి కె. రాము, కలెక్టరేట్ ఏవో హకిమ్, ఈడిఎం మమత మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, ఫిబ్రవరి 04 (మనం ప్రతినిధి):** సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుదటమైన చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సోషల్ జస్టిస్ డే వేడుకలలో అదనపు కలెక్టర్ డి. వేణుతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఫిబ్రవరి 4, 2024 నాడు తెలంగాణ ప్రభుత్వ కేబినెట్ కుల సర్వే నిర్వహణకు, ఎస్సి కుల వర్గికరణ కు అనుకూలంగా నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో శాస్త్రీయంగా కుల సర్వే ప్రభుత్వం నిర్వహించిందని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం క్యాబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ఫిబ్రవరి 4వ తేదీ నాడు సోషల్ జస్టిస్ రోజుగా జరుపుకుంటామని అన్నారు. సోషల్ జస్టిస్ రోజు నాడు సమాజంలో రావాల్సిన సామాజిక మార్పుల పై చర్చిస్తామని, ప్రజల నుంచి అభిప్రాయాలను తీసుకొని భవిష్యత్తులో మరింత మెరుగ్గా సోషల్ జస్టిస్ డే నిర్వహిస్తామని అన్నారు.సోషల్ జస్టిస్ డే సందర్భంగా ప్రభుత్వం వివిధ సామాజిక వర్గాలకు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామని అన్నారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కట్టుదిట్టమైన కృషి చేయడానికి మరోసారి కంకణ బద్ధులై ముందుకు సాగేలా అధికార యంత్రాంగానికి సోషల్ జస్టిస్ వేడుకలు ప్రేరేపితం కావాలని కలెక్టర్ పేర్కొన్నారు, అనంతరం జిల్లా అధికారులు తో కలిసి కలెక్టర్ ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రవీందర్, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, కలెక్టరేట్ ఏవో బి. ప్రకాష్ సంబంధిత పాల్గొన్నారు.

# భూ రికార్డుల పై భరోసా కల్పించేలా లైసెన్స్ సర్వేయర్‌లు పని చేయాలి



- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, ఫిబ్రవరి 04 (మనం ప్రతినిధి):** భూ రికార్డుల పై రైతులకు, యాజమాన్యులకు భరోసా కల్పించేలా లైసెన్స్ సర్వేయర్ లు పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ డి. వేణుతో కలిసి శిక్షణ పూర్తి చేసుకున్న 61 మంది సర్వేయర్లకు ధృవీకరణ లైసెన్స్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేస్తూ పేద ప్రజల కష్టాలను తొలగించేందుకు రైతులకు చుట్టంగా ఉండే విధంగా అద్భుతమైన భూ భారతి చట్టం ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. భూ భారతి చట్టం నియమ నిబంధనలు కూడా 90 రోజుల్లో ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి మనిషికి ఆధార్ కార్డు ఉన్న విధంగా భూములకు భూ దార్ ప్రవేశపెడతామని మాట ఇచ్చామని, దీని కోసం అవసరమైన మేర లైసెన్స్ సర్వేయర్ లు అందుబాటులో ఉండే విధంగా వివిధ రాష్ట్రాలలో అధ్యయనం చేసి ప్రైవేట్ సర్వేయర్ లను ఉత్తీర్ణత సాధించిన 3511 మందికి గతంలో లైసెన్స్ లను ముఖ్యమంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశామని అన్నారు. రెండవ విడత లో మరో 6 వేల మధ్య అభ్యర్థులకు శిక్షణ అందించి పరీక్షలు పెడితే 2 వేల మంది ఉత్తీర్ణత సాధించారని , నేడు మన పెద్దపల్లి జిల్లాలో అర్హత సంపాదించిన 61 మంది అభ్యర్థులకు లైసెన్సులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. లైసెన్స్ సర్వేయర్ లను మండలాల వారీగా ప్రతి అందుబాటులో ఉన్న భూమి ఆధారంగా అలాట్మెంట్ చేస్తామని అన్నారు. భూములు ఉన్న రైతులకు భరోసా కల్పించే భూ భారతి చట్టం అమలు కోసం సర్వేయర్ లకు ఆధునిక సాంకేతిక వినియోగించేందుకు రోవర్స్ సామాగ్రి ప్రభుత్వం పంపిణీ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడి సోమేశ్వర్,ఆర్.డి.ఓ. గంగయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నా ఆరాటం పోరాటం జగిత్యాల అభివృద్ధి కోసమే

- నేను నేటికీ బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేనే
- యావర్ రోడ్డు వెడల్పు కు కట్టుబడి ఉన్నా
- ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు
- కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తున్నకౌన్సిలర్లను గెలిపిస్తే ప్రజలకు అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంట
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**జగిత్యాల, పిబ్రవరి 04 ( మనం న్యూస్ ):** తాను నేటికీ బిఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. యావర్ రోడ్డు వెడల్పు కు నేను కట్టుబడి ఉన్నా...ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తున్న కౌన్సిలర్లను గెలిపిస్తే ప్రజలకు అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంట అని ఎమ్మెల్యే అన్నారు. బుధవారం స్థానిక మోతే రోడ్డు పార్టీ కార్యాలయం లో ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ మున్సిపల్ బరిలో ఉన్న కౌన్సిలర్ లతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం తో కలిసి పనిచేస్తూ జగిత్యాల అభివృద్ధికి కృషి చేస్తున్నాని, నియోజకవర్గం లో గత ప్రభుత్వం లో 2023 డిసెంబర్ 7 కన్నా ముందు మొదలు పెట్టి తర్వాత పూర్తి చేసిన పనులకు పెండింగ్ బకాయిలు ప్రజా ప్రతినిధులు , కాంట్రాక్టర్ లకు చెల్లించడం జరిగింది అని అన్నారు. జగిత్యాల పట్టణం లో ఎక్కడా చూసిన అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.1కోటి తో ఎల్ ఎల్ గార్డెన్ దగ్గర చేపట్టిన పనులకు సీనియర్ నాయకులు అడ్డం పడ్డారు కోర్టు కేసు వేశారు. సొంత లాభం కోసం కాదు పట్టణ అభివృద్ధి కోసం పని చేసి, అందరి పెండింగ్ బకాయిలు అందేలా చొరవ తీసుకున్నాను అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంతు రెడ్డి చొరవతో 62.5 కోట్ల ఉఐ డిఎఫ్ నేషనల్ హౌసింగ్ బ్యాంక్ నిధులు జగిత్యాల పట్టణానికి తీసుకురావడం జరిగింది. హరిని ఎంట్ప్రజెస్ 7 కోట్ల 3 లక్షలు సీసీ రోడ్డు డ్రైనేజీ పనులు టెండర్ వేశారు వారు జీవన్ రెడ్డి అనుచరులు అని అందరికీ తెలుసు..కానీ పట్టణ అభివృద్ధి నాకు ముఖ్యం కాంట్రాక్టర్ ల గురించి ఆలోచన నాకు అవసరం లేదు. కాంగ్రెస్ లో కలిసి పనిచేస్తూ గత ప్రభుత్వాన్ని ఎన్నడు విమర్శించలేదు అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తో కలిసి పనిచేసి 235 కోట్ల ఆసుపత్రి జగిత్యాల కు మంజూరు చేయటం జరిగింది.పక్క జిల్లాలకు నూతన ఆసుపత్రి వచ్చిందా అని అన్నారు. మెడికల్ కాలేజీ కి 41 కోట్ల పెండింగ్ బకాయి నిధులు మంజూరు చేయగా నేడు త్వరిత గతిన పనులు జరుగుతున్నాయి.మెడికల్ కాలేజీ నర్సింగ్ కళాశాల తో పేద మధ్యతరగతి ప్రజలకు ఉపయోగ పడుతుంది అని అన్నారు. ప్రస్తుతం పట్టణ కౌన్సిలర్ ల బరిలో ఉన్న కాంగ్రెస్ నాయకులను గెలిపిస్తే నా వంతుగా జగిత్యాల పట్టణ ప్రజలకు అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంట అని అన్నారు. ప్రజల ప్రేమ తో నా గెలుపు సాధ్యం అయింది. 200 కోట్ల తో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు అయింది.నీటి పారుదల శాఖ మంత్రి వద్ద స్థలం విషయం లో పెండింగ్ లో ఉంది. ముఖ్యమంత్రి 5 కోట్ల ఎస్డిఎఫ్ నిధులు మంజూరు చేయటం జరిగింది.ప్రభుత్వంతో కలిసి పని చేయని నియోజకవర్గాలకు మంజూరు కాలేదు జగిత్యాల అభివృద్ధి నా లక్ష్యం కరాకండిగా చెప్పుతున్నాను అని అన్నారు. యావర్ రోడ్డు విస్తరణ విషయంలో పెట్రోల్ బంక్ విషయంలో నాపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు. యావర్ రోడ్డు ధర్మపురి రోడ్డులో రెసిడెన్షియల్ జోన్ లకు కమర్షియల్ నిర్మాణాలు అనుమతులు ఎవరి హయంలో ఇచ్చారో ప్రజలకు తెలుసు.2021 లో యావర్ రోడ్డును 100 ఫీట్ ల రోడ్డు గా చేసి జోన్ల మార్పు చేయటం జరిగింది.. ప్రజా ప్రతినిధులు భవిష్యత్ తరాల కోసం ఆలోచన చేయాలి. యావర్ రోడ్డు లో ప్రభుత్వ స్థలాలు 100 ఫీట్లు వెడల్పు చేయటం జరిగింది.. యావర్ రోడ్డు వెడల్పు కు కట్టుబడి ఉన్నా...ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.. కాంగ్రెస్ పార్టీ కి అనుకూలంగా ఉన్న అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి సాధ్యం అని ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. నేను బి అర్ ఎస్ పార్టీ ఎమ్మెల్యే అని ప్రభుత్వం తో కలిసి పని చేస్తున్నా అన్నారు. ముఖ్యమంత్రి గారిని నిధుల కోసం కలిస్తే బి అర్ ఎస్ పార్టీ వాళ్ళు నానా హైరానా చేసి నా ఇల్లు హాస్పిటల్ పై దాడి చేశారు కనీసం వివరణ కూడా కోరలేదు.అనర్హత కు స్పీకర్ దగ్గర పిటిషన్ వేశారు అన్నారు.బి అర్ ఎస్ పార్టీ కి మొన్నటి వరకు నెలకు 5వేల పార్టీ ఫండ్ కూడా ఇచ్చాను... నన్ను ఎన్ని విమర్శించినా...రాష్ట్ర బి అర్ ఎస్ అధిష్టానాన్ని ఎన్నడూ విమర్శించలేదు అని అన్నారు.ప్రభుత్వం తో కలిసి పనిచేస్తా...మున్సిపల్ ఎన్నికల్లో ప్రభుత్వం తో కలిసి పని చేసే అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తాన్ అని అన్నారు. ఈ సమావేశం లో మాజీ మున్సిపల్ ఛైర్మెన్ గిరి నాఘభూషణం, మాజీ వైస్ ఛైర్మెన్ గోలి శ్రీనివాస్,, నాయకులు గట్టు సతీష్, మాజీ గ్రంధాలయ ఛైర్మెన్ చంద్రశేఖర్ గౌడ్, ప్రస్తుతం బరిలో ఉన్న కౌన్సిలర్ నాయకులు, పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు..

మనం Manam



# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించండి

- 1 కోటి రూపాయలతో తిప్పాపూర్ జంక్షన్ అభివృద్ధి
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- వేములవాడ పట్టణంలో పలు వార్డుల్లో ప్రచారం నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ విప్
- 7,8,23 వార్డులలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన విప్





**వేములవాడ,ఫిబ్రవరి 4(మనం న్యూస్):** మున్సిపల్ ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటు కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని 01,07,08,09,23,28, వార్డుల్లో గడప గడపకూ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం 07,08,23 వార్డుల్లో పార్టీ కార్యాలయాలను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 11 న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి కి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది, వేములవాడ లో మీ బిడ్డగా నేను ఎమ్మెల్యే గా ఉన్నాను పట్టణంలో, రాజన్న ఆలయం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని,అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. గతంలో బీజేపీ,బీఆర్ ఎస్ పార్టీలకు అవకాశం ఇచ్చారని,గతంలో వారికి అవకాశం ఇస్తే వేములవాడ పట్టణ అభివృద్ధిని విస్మరించరని,ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత చేసిన అభివృద్ధి పనులను బేరీజు వేసుకోవాలన్నారు.. రాజన్న ఆలయాన్ని 4 ఎకరాల విస్తరణలో అభివృద్ధి చేస్తున్నామని,ఒక కన్ను రాజన్న ఆలయం ఇంకో కన్ను పట్టణ అభివృద్ధిగా ముందుకు పోతున్నమని వెయ్యి సంవత్సరాల పాటు ఉండేలా రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నాం అన్నారు. 50 ఏళ్ల రాజన్న భక్తులు,పట్టణ ప్రజలు ఎదురు చూస్తున్న రోడ్డు వెడల్పు పనులు శరవేగంగా సాగుతున్నాయని,ప్రజలు కోరుకొనే విధంగా అభివృద్ధి చేస్తున్నాం అన్నారు..

### తిప్పాపూర్ అభివృద్ధికి ప్రత్యేక కృషి

తిప్పాపూర్ అభివృద్ధికి ప్రత్యేక కృషిచేస్తానని విప్ తెలిపారు..వేములవాడ పట్టణానికి తిప్పాపూర్ ముక్కు లాంటిదని మనిషి కి ముక్కు ఎంత అందమో వేములవాడ కు తిప్పాపూర్ అలాంటిదని అన్నారు.. గతంలో తిప్పాపూర్ బస్ స్టాండ్ తరలిస్తాం అంటే నేను మొదటగా అడ్డుకున్నానని తెలిపారు..బీజేపీ వారు కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయలేదని విమర్శించారు..ఇటీవల తిప్పాపూర్ లో 1 కోటి రూపాయలతో నూతన జంక్షన్ అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు..తిప్పాపూర్ బస్ స్టాండ్ ను త్వరలోనే నూతన శోభ సంతరించుకునెల అభివృద్ధి చేస్తామన్నారు..

### ప్రజా ప్రభుత్వంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట

గత ప్రభుత్వం 10 సంవత్సరాలుగా ఒక్క డబుల్ బెడ్ రూం ఇవ్వలేదు.. మేము నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం అన్నారు.. గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని,మేము రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇస్తున్నాం అన్నారు.దేశంలో ఉన్న ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ లో మాత్రమే సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం అన్నారు.. గతంలో పేద ప్రజలు నెలకు 1000 రూపాయల కరెంట్ బిల్లు కట్టే పరిస్థితి ఉండేదని మేము నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం అన్నారు..మహిళలు రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ఉచితంగా ప్రయాణం చేస్తున్నామని తెలిపారు. పట్టణ ప్రజలు మీకు విజ్ఞప్తి చేస్తున్నాను, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి, మీ వార్డు అభివృద్ధి చేసే బాధ్యత నాదన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటు కాంగ్రెస్ పార్టీ కి వేయాలని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉన్నారు వేములవాడ ఎమ్మెల్యే గా నేను మీకు అండగా ఉన్న ,నాకు చెయ్యి తిరిగే విధానంగా అధికార పార్టీ అభ్యర్థులను గెలిపించలని పిలుపునిచ్చారు.

# గజ్వేల్ పట్టణంలో పోలీసుల భారీ ఫ్లాగ్ మార్చ్



- ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే ధ్యేయం

**గజ్వేల్ ఫిబ్రవరి 4 మనం న్యూస్:** త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గజ్వేల్ పట్టణంలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు మరియు ఓటర్లలో ధైర్యాన్ని నింపేందుకు పోలీసులు భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. బుధవారం నాడు గజ్వేల్ ఏసిపి నర్సింలు నేతృత్వంలో జరిగిన ఈ కవాతు పట్టణంలోని ప్రధాన కూడళ్ల గుండా సాగింది. ఈ ఫ్లాగ్ మార్చ్ స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమై, మెయిన్ రోడ్డు, పల్లెపాడు, వేములగట్టు మరియు ఆర్ అండ్ ఆర్ కాలనీ మీదుగా కొనసాగింది. ఈ కవాతులో సివిల్ పోలీసులు, రిజర్వ్ పోలీస్ బలగాలు మరియు సాయుధ దళాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తామని, ప్రజలు భయం లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏసిపి నర్సింలు ఈ సందర్భంగా సూచించారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించే వారిపై, ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ హెచ్చరించారు. పట్టణంలో ఇప్పటికే నిఘాను పెంచామని, ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఏదైనా అనుమానాస్పదగా ఎవరైనా కనిపిస్తే, సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి అని గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమం లో గజ్వేల్ ఏసిపి నర్సింలు, ట్రైనీ ఐపిఎస్ అయేషా ఫాతిమా , ఇన్స్పెక్టర్లు లతీఫ్ , ముత్యం రాజు , ఎస్ ఐ లు , గజ్వేల్ డివిజన్ పోలీస్ బృందం పాల్గొన్నారు.

## నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులను
# సద్వినియోగం చేసుకోవాలి



- సీతా రంజిత్ రెడ్డి

**చేవెళ్ల, ఫిబ్రవరి 4 (మనం న్యూస్) :** నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సీతా రంజిత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మహిళ సాధికారత నైపుణ్యాభివృద్ధిపై ఇంటరాక్టివ్ కార్యక్రమాన్ని ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీతా రంజిత్ రెడ్డి హాజరై మాట్లాడారు. మే నెల నుండి బాలికల కోసం నైపుణ్య మరియు ఉపాధి కేంద్రిత శిక్షణా కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. వీటిలో కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ స్కిల్స్, మెహందీ, బ్యూటీషియన్ కోర్సు, ఆర్థిక సాక్షరత (ఫైనాన్షియల్ లిటరసీ), ఈవెంట్ మేనేజ్మెంట్ స్కిల్స్ వంటి కోర్సులు ఉండి, విద్యార్థినుల ఆత్మవిశ్వాసం, స్వయం ఉపాధి అవకాశాలు మరియు వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నైపుణ్యవంతమైన, స్వతంత్రమైన, ఆత్మవిశ్వాసంతో కూడిన యువతిని తీర్చిదిద్దే దిశగా కళాశాల మరో ముఖ్యమైన అడుగు వేసినట్లైంది. ఇది విద్యార్థినుల భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తుంది.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలతా, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# వ్యయ పరిశీలకుల తనిఖీకి పూర్తి ఖర్చుల రికార్డులతో హాజరు కావాలి

- జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్



**సంగారెడ్డి, ఫిబ్రవరి 4(మనం ప్రతినిధి):** మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల ప్రచార ఖర్చులకు సంబంధించిన ప్రతి రూపాయిని నిబంధనల మేరకు ఖచ్చితంగా నమోదు చేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అభ్యర్థులు లేదా వారి అధికారిక ప్రతినిధులు ఎన్నికల ఖర్చులపై నిర్వహించే పరిశీలనకు మూడుసార్లు తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గుమ్మడిదల, గడ్డపోతారం, ఇంద్రేశం, ఇస్నాపూర్, సంగారెడ్డి, సదాశివపేట, కోహీర్, ఆందోల్, జహీరాబాద్, నారాయణఖేడ్ మరియు జిన్నారం మున్సిపాలిటీలకు సంబంధించిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల రికార్డులను మొదటి విడత - ఫిబ్రవరి 5న, రెండవ విడత - ఫిబ్రవరి 7న, మూడవ విడత ఫిబ్రవరి 9న పరిశీలించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ పరిశీలన ఆయా తేదీలలో సంబంధిత మున్సిపల్ కార్యాలయాలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల మధ్య నిర్వహించ బడుతుందని తెలిపారు. అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు ఎన్నికల ఖాతా నిర్వహణ రిజిస్టర్లు, బిల్లులు, వోచర్లు, ఇతర సంబంధిత డాక్యుమెంట్లతో పరిశీలకుల ముందు ఆయా తేదీలలో తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికలలో అభ్యర్థికి అనుమతించబడిన గరిష్ట వ్యయ పరిమితి రూ.1,00,000( ఒక లక్ష ) మాత్రమేనని తెలిపారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ప్రతి ఖర్చును ఖచ్చితంగా తమ ఖర్చుల ఖాతాలో నమోదు చేయాలని స్పష్టం చేశారు.




**ములుగు మండలంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ బైలంపూర్ గ్రామంలోని నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి దేవాలయానికి కొమురవెల్లి డైరెక్టర్ పల్లె మహేష్ యాదవ్ బుధవారం రూ. 50 వేల వీరాళం కమిటీ సభ్యులకు అందజేశాడు.**

**- ములుగు, మనంన్యూస్**

# కొనగట్టు శివాలయంలో ఘనంగా బ్రహ్మోత్సవాలు



**చేవెళ్ల, ఫిబ్రవరి 4 (మనం న్యూస్) :** చేవెళ్ళ మున్సిపల్ కేంద్రంలోని కొనగట్టు శివాలయంలో బుధవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగాయి. శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే దంపతులు హోమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పూజలు నిర్వహించారు. అంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. బుధవారం రాత్రి ఆలయంలో భజన భక్తుల చే భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఇరుముడి ధరించి శ్రీశైలంకు బయలుదేరిన ఎమ్మెల్యే



**మంత్రాలయం, ఫిబ్రవరి 2(మనం న్యూస్):** శివమాలలో భాగంగా మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఇరుముడి ధరించి బుధవారం శ్రీశైలం కు బయలుదేరారు. ముందుగా మంత్రాలయం మండలం రాంపురం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం లో ఇరుముడికి ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం ఆయన శిరస్సు పై ఇరుముడి ధరించారు. ఆయనకు కొంతమంది శివస్వాములు పూలమాలలు వేసి శ్రీశైలం కు సాగనంపారు. వారితో బాల స్వాములు, ఇతర స్వాములు తదితరులు ఉన్నారు.

# ఘనంగా తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం

- అడిషనల్ కలెక్టర్ మాధురి



**సంగారెడ్డి, ఫిబ్రవరి 4 (మనంప్రతినిధి):** వివక్ష, అసమానతలకు తావు లేకుండా సమానత్వంతో కూడిన సమాజాన్ని నిర్మించడమే తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం యొక్క ప్రధాన లక్ష్యమని అడిషనల్ కలెక్టర్ మాధురి పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఫిబ్రవరి 4న తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని అధికారికంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాధురి మాట్లాడుతూ, సామాజిక న్యాయం అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందన్నారు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, మహిళలు, దివ్యాంగుల అభ్యున్నతికి అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కులు, సమానత్వం, సోదరభావం వంటి విలువలను ప్రతి పౌరుడు ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుం దన్నారు. ఈ సందర్భంగా అందరితో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవ ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జగదీష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి విశాలాక్ష్మి, ఇతర జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# క్వారీపై నుంచి పడి వ్యక్తి మృతి



**ములుగు, ఫిబ్రవరి 4(మనంన్యూస్):** క్వారీ పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా ములుగు మండలంలో చోటుచేసుకుంది. ములుగు ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం...ములుగు మండలం బస్వాపూర్ గ్రామం శివారులో గల జీఎంఆర్ రాక్ సాండ్ కంపెనీలో లేబర్ గా పని చేస్తున్న బింగు సంత గత ఐదు సంవత్సరాల క్రితం ఒరిస్సా నుండి బతుకుదెరువు కోసం తెలంగాణకు వచ్చి సిద్దిపేట జిల్లా ములుగు మండలం బస్వాపూర్ గ్రామ శివారులో గల జిఎంఆర్ రాక్ సాండ్, కంపెనీలో లేబర్లుగా పని చేస్తున్నాము రోజు మాదిరిగా ఈరోజు ఉదయం 8:30కు నేను మా ఇద్దరం కలిసి క్వారీలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు క్వారీపై నుండి కింద పడి బండరాళ్లపై పడగ తలకు మరియు ఇతర శరీర భాగాలకు రక్త గాయాలు అయినవి వెంటనే ఈ విషయాన్ని సూపర్వైజర్కు తెలపడంతో అక్కడున్న అందరితో కలిసి గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ డాక్టర్లు పరీక్షించి అప్పటికే చనిపోయారు. క్వారీలో పనిచేస్తూ ప్రమాద వశాత్తు కాలుజారి కారి పైనుండి కిందపడి రాళ్లపై పడి తలకు శరీర భాగాలకు గాయాలు అయి చనిపోయాడని మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్సై రఘుపతి తెలిపారు.

# ఫెర్టిలైజర్స్ యాప్ వలన రైతులకు మేలా? డీలర్లకు మేలా?

- డీలర్ యూరియా బ్యాగులను అప్లోడ్ చేసిన పది నిమిషాలలో నో స్టాకు చూపెడుతుంది
- చిన్న సన్నకారు రైతులకు దొరకని యూరియా
- యాప్ వలన డబ్బులు దండుకుంటున్న డీలర్లు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

**కోదాడ, ఫిబ్రవరి 04(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు సాగు చేస్తున్న వ్యవసాయ భూమిలో యూరియా వేయడానికి గతంలో పిఎసిఎస్ ద్వారా డీలర్ల ద్వారా యూరియాని కొనుగోలు చేసేవారు. ఆ సమయంలో చిన్న సన్నకారు రైతుల నుంచి పెద్ద రైతుల వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియాని తెచ్చుకొని పంట పొలాలలో వేసుకునేవాళ్లు. ఈమధ్య కాలంలో ఫెర్టిలైజర్స్ యాప్ ను గవర్నమెంట్ అమల్లోనికి తీసుకువచ్చింది. ఈ యాప్ వలన చిన్నా సన్నకారు రైతులే కాకుండా చదువుకొని రైతులు యాప్ ద్వారా యూరియా కట్టలు తీసుకోవాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ యాప్ ను ఎలా వాడాలో రైతులకు అవగాహన కల్పించడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలం చెందారని పలువురు రైతులు వాపోతున్నారు.

### ఫెర్టిలైజర్స్ యాప్ వలన రైతులకు మేలా? డీలర్లకు మేలా?

ఫెస్టిలైజర్స్ యాప్ వలన రైతులకు ఎలాంటి మేలు జరగటంలేదని డీలర్లకే ఈ యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉందని పలువురు రైతులు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిని దృష్టిలో పెట్టుకొని వీలైనంత త్వరలో ఈ యాప్ బాధనుండి చిన్న సన్న కారు రైతులను కాపాడాలని వాపోతున్నారు. డీలర్ యూరియా బ్యాగులను అప్లోడ్ చేసిన పది నిమిషాలలో నో స్టాకు చూపెడుతుంది. డీలరు తనకు వచ్చిన యూరియా బ్యాగులను యాప్ లో అప్లోడ్ చేసిన పది నిమిషాలలో నో స్టాక్ అని చూయించుతుందని పలువురు రైతులు వాపోతున్నారు. ఇక్కడ డీలర్లు ఏమైనా అవకతవకలు చేస్తున్నారా లేకపోతే ఇంకేమైనా కొత్త రకంగా ఆలోచిస్తున్నారా మాకైతే తెలియటం లేదు కానీ ఎప్పుడు చూసినా యాప్ లో నో స్టాక్ అనే చూయించుతున్నాయి అని రైతులు వాపోతున్నారు.





### చిన్న సన్నకారు రైతులకు దొరకని యూరియా

ఎప్పుడు డీలర్ల వద్దకెళ్లిన ట్రాక్టర్లకు ట్రాక్టర్లు యూరియా బయటకు పోతుంది కానీ మాకు మాత్రం యూరియా దొరకటం లేదు ఏమిటి అని డీలర్ ని అడిగితే వాళ్ళు యాప్ లో బుక్ చేసుకున్నారు తీసుకెళ్తున్నారు అంతేకానీ మాకు ఎలాంటి సంబంధం లేదు అని సమాధానం చెప్పి దాటవేస్తున్నారు. కళ్ళముందే యూరియా లోడ్ దిగుతుంది కానీ వాటిని తీసుకోవాలంటే చిన్న సన్న కారు రైతుజూం నానా ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. యూరియా తీసుకపోయే వారికి యాప్ ఎలా బుక్ అవుతుంది మాకు ఎందుకు బుక్ కావట్లేదు అనే సందేహం రైతులలో బలంగా నాటుకుపోయింది.

### యాప్ వలన డబ్బులు దండుకుంటున్న డీలర్లు

డీలర్లే ఎక్కువ పొలం ఉన్న పెద్ద రైతుల వద్ద నుండి డేటాను సేకరించి వారితో యూరియా బ్యాగ్ కి 300 నుండి 350 రూపాయల వరకు రేటు మాట్లాడుకుని డీలర్లే యాప్ లో బుక్ చేసి రైతుల వద్ద నుండి డబ్బులు దండుకుంటున్నారని పలువురు రైతులు వాపోతున్నారు.

### పట్టించుకోని సంబంధిత అధికారులు

చిన్న సన్నకారు రైతులు ఇప్పటికే పంటపై వేల రూపాయలు పెట్టుబడి పెట్టి ఈ యాప్ ద్వారా యూరియా తీసుకోలేక నానా ఇబ్బందులు పడుతున్న, డీలర్లు యాప్ లలో వారే బుక్ చేస్తున్న అధిక రేట్లకు యూరియాను సరఫరా చేస్తున్న సంబంధిత అధికారులు మాకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని పలువురు రైతులు వాపోతున్నారు.

### వ్యవసాయ అధికారిని చర్వాణి ద్వారా వివరణ అడగగా

జిల్లాలో ఏ డీలర్ కాడైనా స్టాక్ అప్లోడ్ చేసిన ఏడు నిమిషాల నుండి పది నిమిషాలలో స్టాక్ అయిపోతున్నది ఎలాంటి అవకతవకలకు తావు లేదు. రైతు వేదికల వద్దకు వచ్చిన రైతులకు పిఎసిఎస్ వద్దకు వచ్చిన రైతులకు యాప్ గురించి అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. డీలర్లు వద్ద నుండి తీసుకెళ్తున్న యూరియాకు రైతులు ఎంఆర్పి రేటే చెల్లించాలని తెలిపారు.

# శక్తి ఇచ్చారు.. అభివృద్ధి చేసి చూపిస్తా..



## ఏదులాపురం మున్సిపాలిటీని రోల్ మోడల్గా తీర్చిదిద్దుతాం
## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం, ఫిబ్రవరి 4(మనం బ్యూరో): 'రాష్ట్రంలో మన ప్రభుత్వం ఉంది.. మీ శ్రీనన్న మంత్రిగా కీలక స్థానంలో ఉన్నాడు. మీ దీవెనలతో ఏదంటే అది చేయగలిగే శక్తి నాకు వచ్చింది.. ఇక అభివృద్ధి చేసి చూపిస్తా' అని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 10, 11, 28, 29, 30 వార్డుల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత పాలకుల తీరుపై నిప్పులు చెరిగారు.

### రావణ కాష్టాన్నిపారద్రోలారు..

రాష్ట్ర ప్రజలు పదేళ్ల 'రావణాసుర' పాలనను అంతం చేసి, ప్రజా పరిపాలనను తెచ్చుకున్నారని మంత్రి వ్యాఖ్యానించారు. 'మంచి ఉన్నంత కాలమే మర్యాద ఉంటుంది.. అది లేనప్పుడు యుద్ధం చేయాల్సిందే' అని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వం కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిందని, పేదల ఇళ్ల కంటే దొరల ఇళ్లకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. కనీసం హాస్టల్ విద్యార్థులకు సరిగ్గా అన్నం పెట్టలేని వారు నేడు కబుర్లు చెబుతున్నారని, అలాంటి వారిని నమ్మవద్దని కోరారు.

### పార్టీ రంగులు చూడబోం..

పేదరికమే ప్రామాణికం. సొంతింటి కల నెరవేర్చే విషయంలో రాజకీయాలకు తావులేదని మంత్రి స్పష్టం చేశారు. 'మీరు ఏ పార్టీకి ఓటు వేశారనేది నాకు అనవసరం. మీరు అర్హులైన పేదవాళ్లయితే చాలు.. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి తీరుతాం' అని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామని, వచ్చే ఏప్రిల్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేస్తామని వెల్లడించారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీఖునే జీతాలు వంటి వాటితో నేడు ప్రతి ఇల్లూ సంతోషంగా ఉందన్నారు.

### పెద్ద కొడుకుగా బాధ్యత నాది..

ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఒక మేటి (రోల్ మోడల్) మున్సిపాలిటీగా తీర్చిదిద్దే బాధ్యతను తాను తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. 'మీ ఇంటి పెద్ద కొడుకుగా మీ సమస్యలన్నీ తీరుస్తాను. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాను' అని భరోసా ఇచ్చారు. మాటలు చెప్పే వారిని కాకుండా, పని చేసే వారిని గుర్తించాలని ప్రజలను కోరారు.

### డిపాజిట్లు రాకుండా బుద్ధి చెప్పండి

ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో ప్రత్యర్థులకు డిపాజిట్లు రాకుండా బుద్ధి చెప్పాలని మంత్రి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థులు తుమ్మల బిక్షం (10వ వార్డు), పేరం వెంకటలక్ష్మి (11వ వార్డు), నూకల రామ్మోహన్ రెడ్డి (28వ వార్డు), వెంపటి ఉమ (29వ వార్డు), కొట్టం శిరీష (30వ వార్డు)లను హస్తం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

# డిజిటల్ దిశగా తెలంగాణ..

- రాష్ట్రంలో 12 లక్షల మందికి డిజిటల్ శిక్షణ
- పిఎంజిడిఐఎస్ హెచ్ఏ పథకంపై ఎంపీ రఘురాంరెడ్డికి ప్రశ్నకు కేంద్ర సహాయ మంత్రి లిఖితపూర్వక సమాధానం



ఖమ్మం, ఫిబ్రవరి 4(మనం న్యూస్): ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ (పిఎంజిడిఐఎస్ హెచ్ఏ) కింద తెలంగాణలో ఎంతమందికి డిజిటల్ శిక్షణ అందించారు. మహిళలు-పురుషుల వారీగా నమోదులు, శిక్షణ పూర్తిచేసిన వారి వివరాలేమిటని ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి పార్లమెంట్లో ప్రశ్నించారు. దీనికి కేంద్ర ఐటీ, వాణిజ్య, పరిశ్రమల శాఖల సహాయ మంత్రి జితిన్ ప్రసాద లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

### తెలంగాణలో గణనీయ పెరుగుదల..

తెలంగాణలో డిజిటల్ అక్షరాస్యత గణనీయంగా పెరిగిందని, రాష్ట్రంలో మొత్తం 14,56,226 మంది నమోదు కాగా, అందులో 12,10,448 మంది విజయవంతంగా డిజిటల్ శిక్షణ పూర్తి చేసినట్లు కేంద్ర సహాయ మంత్రి వెల్లడించారు. 8,90,182 మంది మహిళలు నమోదు కాగా, వారిలో 7,63,651 మంది శిక్షణ పూర్తిచేశారని పేర్కొన్నారు. అదే విధంగా 5,60,022 మంది పురుషులు నమోదు కాగా, 4,46,777 మంది కోర్సు పూర్తి చేశారని చెప్పారు.

### దేశవ్యాప్తంగా 6.39 కోట్ల మందికి ప్రత్యేక శిక్షణ..

ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కంప్యూటర్ అవగాహన, ఆన్లైన్ సేవల వినియోగం పెరిగిందని డిజిటల్ లావాదేవీలు, ప్రభుత్వ ఈ-సేవలను స్వయంగా వినియోగించుకునే స్థాయికి లబ్ధిదారులు చేరుకున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళల భాగస్వామ్యం బావుందని, దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 6.39 కోట్ల మందికి డిజిటల్ శిక్షణ అందించామని, గ్రామీణ-పట్టణ డిజిటల్ అంతరాన్ని తగ్గించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందని ఎంపీ ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో వివరించారు.

# వికసిత్ భారత్ జాతీయ స్థాయి పోటీలలో మెరిసిన యస్.బి.ఐ.టి. విద్యార్థి



ఖమ్మం, ఫిబ్రవరి 4(మనం న్యూస్): భారత ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వశాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2026 పోటీలలో తమ కళాశాలకు చెందిన సి.యస్.ఈ.. విద్యార్థి కె. శివ కౌశిక్ పాల్గొన్నట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. జాతీయ స్థాయిలో తమ విద్యార్థి పాల్గొనడం కేవలం తమ కళాశాలకు, ఖమ్మం జిల్లాకు మాత్రమే కాక తెలంగాణా రాష్ట్రానికి గర్వకారణం అని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా విద్యార్థి శివ కౌశిక్ ను కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం అభినందించారు. 2047వ సంవత్సరానికి యువతను శక్తివంతులుగా చేసే ఆశయంతో నిర్వహించే 'వికసిత్ భారత్ 2047' అనే కార్యక్రమంలో భాగంగా తమ కళాశాల భాగస్వామ్యం కావడం హర్షించదగ్గ విషయమని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి తెలిపారు. జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి పోటీలలో విజేతలుగా నిలిచిన 3000 మందిని జాతీయ స్థాయిలో ఐడియా ప్రదర్శించేందుకు ఆహ్వానించారని, ఇందులో తమ విద్యార్థి నిలవడం తమకు గర్వకారణమని కళాశాల వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య అభిప్రాయపడ్డారు. వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వి.బి.వై.ఎల్.డి) పోటీలకు దేశ వ్యాప్తంగా 50 లక్షల ఐడియాలు సమర్పించారని వీరిలో 3000 మందిని మాత్రమే దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆహ్వానం అందిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రాజ్ కుమార్ తెలిపారు. 'భారత్ సాఫ్ట్ పవర్ : కల్చరల్ డిప్లమసి అండ్ గ్లోబల్ ఇన్ఫ్లూయన్స్' అనే అంశానికి గాను తమ విద్యార్థి కొల్లూరి శివకౌషిక్ ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థిని ప్రోత్సహించిన తల్లిదండ్రులకు, కళాశాల ఇన్నోవేషన్ సెల్ భాద్యులు డాక్టర్ మురళీమోహన్, పి. అశ్వినిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్, సి.యస్.ఈ. విభాగ అధిపతి డా సుప్రియమీనన్ తదితరులు పాల్గొన్నారు.

# సేవా పథంలో తుమ్మల అభిమానులు



దమ్మపేట, ఫిబ్రవరి 04(మనం న్యూస్): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తనయుడు తుమ్మల యుగంధర్, జన్మదినాన్ని పురస్క రించుకుని ఆయన అభిమానులు సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. మంత్రి స్వగ్రామమైన గండుగులపల్లి,లో బుధవారం అభిమానుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహార వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఎదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో, గండుగులపల్లి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పౌష్టికరమైన అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ.తుమ్మల యుగంధర్ ప్రజాసేవలో తన తండ్రి అడుగుజాడల్లో నడవాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కేవలం ఒక్క రోజుతో ముగించకుండా, వరుసగా 22 రోజుల పాటు ఈ అల్పాహార వితరణ కొనసాగిస్తామని వారు సంకల్పించారు. ఈ సందర్భంగా అభిమానులు పాఠశాల ఆవరణలో కేక్ కట్ చేసి యుగంధర్,కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ,పైడి వెంకటేశ్వరరావు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు, యర్రా వసంతరావు, కేవీ సత్యనారాయణ, కాసాని నాగప్రసాద్, పైడి సాయి, గండుగులపల్లి గ్రామ పెద్దలు,తుమ్మల యువసేన సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తమ నాయకుడిపై ఉన్న ప్రేమాభిమా నాలను ఇలా సేవా కార్యక్రమాల రూపంలో చాటుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# చిన్నతనం నుంచే పిల్లలకు మంచి విలువలు అందించాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ
- గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై పిల్లలకు చిన్నతనం నుంచే అవగాహన
- జాతీయ బాలికల దినోత్సవ వేడుకలలో పాల్గొన్న అదనపు కలెక్టర్



ఖమ్మం, ఫిబ్రవరి 04(మనం న్యూస్): చిన్నతనం నుంచే పిల్లలకు మంచి విలువలు అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మహిళా సాధికారిక కేంద్రం, మహిళా-శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని, జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాలిక దినోత్సవ వేడుకల సందర్భంగా బాలల సదనం పిల్లలు స్వాగతం స్వాగతం అంటూ చేసిన నృత్య ప్రదర్శన, ఖమ్మం అర్బన్, రూరల్ ప్రాజెక్ట్ అంగన్వాడీ పిల్లలు వెల్ బేబీషో ప్రదర్శన ఆకట్టుకొనగా, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై కేజీబీవీ విద్యార్థినులు నాటక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో చిన్నారి అనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి మహిళా-శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దాదాపు 1000 విద్యా సంస్థలలో పర్యటించి పిల్లలకు చిన్నతనంలోనే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై అవగాహన కల్పించామని అన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై ప్రతి ఇంట్లో పిల్లలకు మనం అవగాహన కల్పించాలని, పిల్లలు ప్రతి విషయం మనతో పంచుకునేలా వారికి స్వేచ్ఛ కల్పించాలని అన్నారు. ఇంట్లో ఉన్న మగ, ఆడపిల్లలకు సమానంగా ఇతరులను ఎలా గౌరవించాలో నేర్పాలని అన్నారు. చిన్నతనం నుంచే సెల్ ఫోన్ పిల్లలకు అలవాటు చేయవద్దని అన్నారు. పిల్లల పెంపకం లోని ప్రతి దశలో తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలని అదనపు కలెక్టర్ అన్నారు. చిన్నతనం లోనే పిల్లలను క్రమశిక్షణలో పెట్టాలని అన్నారు. పిల్లలకు మంచి చదువుతో పాటు సంస్కారం కూడా ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉంటుందని అన్నారు. పిల్లలకు చిన్నతనం నుంచే ఇతరులను గౌరవిస్తూ సమానత్వంతో ఎలా జీవించాలో నేర్పాలన్నారు. పిల్లలు మన ప్రవర్తన నుంచి చాలా నేర్చుకుంటారని, ఇంట్లో మనం సమానత్వం పాటిస్తే పిల్లలు అది చూసి వారు అలాగే జీవిస్తారని అదనపు కలెక్టర్ తెలిపారు. మన ఇంట్లో పిల్లల మధ్య ఎటువంటి బేధ భావం చూపించకుండా పెంచాలని అదనపు కలెక్టర్ సూచించారు.

అనంతరం గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై సమావేశంలో అదనపు కలెక్టర్ చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత, సిడబ్ల్యుసి చైర్మన్, ప్రతినిధులు, సిడిపిఓ., డి.హెచ్.ఈ.డబ్ల్యూ సమీన్, సంబంధిత అధికారులు, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల ఆశయాలే సామాజిక న్యాయానికి మార్గదర్శకాలు

- జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్



భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 04 (మనంప్రతినిధి): మహనీయులు ప్రతిపాదించిన ఆశయాలు, సిద్ధాంతాలే సామాజిక న్యాయం సాధించేందుకు మార్గదర్శకాలని జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అన్నారు. తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మ గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటాలకు జిల్లా అదనపు కలెక్టర్ పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ రంగాలలో సమానత్వం సాధించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంతో కీలకమని అన్నారు. కుల సర్వే నిర్వహణతో పాటు షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సమాజంలోని వెనుకబడిన చివరి వ్యక్తికీ తగిన వనరులు, ప్రాతినిధ్యం మరియు ఆత్మగౌరవం కల్పించేందుకు దోహదపడతాయని తెలిపారు. సామాజిక న్యాయం సాధించాలంటే మహనీయులు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

అనంతరం తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు, సిబ్బందితో కలిసి సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి విజయలక్ష్మి, కలెక్టరేట్ పరిపాలనాధికారి అనంత రామకృష్ణ, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సంజీవరావు, జిల్లా సహకార శాఖ అధికారి ఎ. శ్రీనివాస్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, పౌరసరఫరాల శాఖ మేనేజర్ ఎస్. త్రినాథ్ బాబు, అన్ని శాఖల జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# టెన్త్ ఫలితాల్లో ఆశ్రమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటాలి

- ఐటీడీఏ పిఓ రాహుల్
- విద్యార్థులతో ముఖాముఖి చర్చించి సందేహాలను నివృత్తి చేసిన పిఓ గౌతమ్



కారేపల్లి, ఫిబ్రవరి 04(మనం న్యూస్): పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటి పాఠశాలలకు, గిరిజన సంక్షేమ శాఖకు మంచి పేరు తీసుకురావాలని, దీనికోసం విద్యార్థులు తమ సబ్జెక్ట్ పరమైన సందేహాలను సంబంధిత ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ పిఓ రాహుల్ సూచించారు. సింగరేణి మండల పరిధిలోని ఆశ్రమ పాఠశాలలను ఐటీడీఏ పీవో రాహుల్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఉసిరికాయలపల్లి బాలుర ఆశ్రమ పాఠశాల, రేలకాయలపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలల వసతి గృహాలను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి చర్చించి,వివిధ అంశాల పట్ల సలహాలు,సూచనలు అందజేశారు. రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే పదవతరగతి పరీక్షల కోసం విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థుల సందేహాలను ఉపాధ్యాయులు అర్థవంతంగా నివృత్తి చెయ్యాలని సూచించారు.పదవ తరగతి పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.అనంతరం ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ నాయకుడు జమ్మి అశోక్ ఐటిడిఏ పీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు డిడి విజయలక్ష్మి, ఏటిడివో రమేష్, ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు డిఈ ,ఏఈ మహేందర్, హాస్టల్ హెడ్ మాస్టర్లు ధర్మా, బిచ్చ, వార్డెన్లు వీరన్న, గోపి ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 22వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థిగా లింగం పుష్పవతి



సుజాతనగర్ ఫిబ్రవరి 4 (మనం న్యూస్) : రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సుజాతనగర్ 22వ డివిజన్ నుండి కాంగ్రెస్ పార్టీ తరఫున లింగం పుష్పవతి పోటీ చేస్తున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకురాలిగా, సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేసే వ్యక్తిగా ఆమెకు మంచి గుర్తింపు ఉంది. స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన లింగం పుష్పవతి, తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం, మహిళా-యువత సంక్షేమం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. 22వ డివిజన్ను అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా ప్రజలతో కలిసి పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆలోచనలకు అనుగుణంగా సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమమే తన రాజకీయ ఆశయమని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా వినిపించుకుని, కార్పొరేషన్ స్థాయిలో బలంగా పోరాడే నాయకురాలిగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలు ఆమెకు మద్దతుగా నిలిచి ఆశీర్వదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# టెన్త్, ఇంటర్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఉన్నత స్థాయికి చేరుకోవడమే తల్లిదండ్రులకు ఇచ్చే అతి పెద్ద బహుమతి
- నాణ్యమైన విద్యతో ప్రభుత్వ గురుకులాలకు పెరుగుతున్న ప్రజాదరణ
- సోషల్ జస్టిస్ డే వేడుకలలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



ఎర్రుపాలెం, ఫిబ్రవరి 04(మనం న్యూస్): పిల్లలు ఉన్నత స్థాయికి చేరుకోవడమే తల్లిదండ్రులకు ఇచ్చే అతిపెద్ద బహుమతి అని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం ఎర్రుపాలెం మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఎర్రుపాలెం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, విద్యార్థినిలతో కలిసి కలెక్టర్ సామాజిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూకుల వివక్ష లేని సమాజంగా తెలంగాణలో నిర్మించే దిశగా ప్రభుత్వం సామాజిక ఆర్థిక సర్వేను విజయవంతంగా నిర్వహించి, రిపోర్టును ఫిబ్రవరి 4, 2025న అసెంబ్లీలో ప్రవేశ పెట్టిందని అన్నారు. కుల, మత విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని అన్నారు. గురుకులాల్లో చదివే పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు డైట్ చార్జీలను 40 శాతం పెంచడం జరిగిందని, పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందించడం కోసం సమీకృత గురుకులాల నిర్మాణం చేపట్టిందని అన్నారు. సామాజిక న్యాయం ఉన్న సమాజాన్ని తయారు చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందని అన్నారు. ప్రభుత్వం కల్పించే సదుపాయాలను వినియోగించుకుంటూ పిల్లలు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకుంటే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ అన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం లక్షలు, కోట్ల రూపాయలు ఖర్చు చేసి మంచి విద్యాసంస్థలు ఏర్పాటు చేయడమే కాకుండా విద్యార్థులకు అవసరమైన డైట్, కాస్మొటిక్ ఛార్జీలు, ఇతర మౌళిక వసతులు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టిందని అన్నారు. ప్రభుత్వ గురుకులాలకు ప్రజల నుంచి మంచి డిమాండ్ ఉందని అన్నారు. మంచి విద్యాసంస్థల్లో నేడు పిల్లలు చదువుతున్నా రని, అనేక ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన ల్యాబ్, క్రీడలు ఆడేందుకు వసతులు మన గురుకులాల వద్ద ఉన్నాయని తెలిపారు. పిల్లలు ఉన్నత స్థాయికి చేరుకోవడమే తల్లిదండ్రులకు మనం ఇచ్చే అతి పెద్ద బహుమతి అవుతుందని, భవిష్యత్తులో ఎట్టి పరిస్థితుల్లో రిగ్రెట్ ఫీల్ కాకుండా ఉండాలని అన్నారు.చదువు, క్రీడలు, మనం చేసే పనిలో పిల్లలు తమ ఎనర్జీని 100 శాతం అందించాలని అన్నారు. విజయం వెంటనే రాదని, అనేక ఓటములు, అడ్డంకులను అధిగమిస్తేనే మంచి విజయం సాధ్యం అవుతుందని అన్నారు. రాబోయే 10, ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటి చైర్మెన్ బండారు నరసింహారావు, ఎర్రుపాలెం మండల తహసీల్దారు ఉషా శారద , ఎంపిడివో బి. సురేందర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వీరమ్మ దంపతులకు ఘనంగా సన్మానం

- 34 ఏళ్ల వైద్య సేవా ప్రస్థానానికి గౌరవ వందనం కమ్యూనిటీ హెల్త్ అధికారి హోదాలో పదవీ విరమణ
- లోటుపాట్లకు తావులేకుండా కార్యక్రమాన్ని ఆదర్శంగా నిర్వహించిన సిహెచ్ఓ రమేష్ రెడ్డి, ఎం.పి.హెచ్.ఓ సత్యనారాయణ.



**పోడూరు ఫిబ్రవరి 4 మనం న్యూస్ :** వైద్య వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా దైవసేవగా భావించి, ప్రజల ఆరోగ్య పరిరక్షణే తన జీవిత లక్ష్యంగా 34 సంవత్సరాల పాటు వైద్య ఆరోగ్య శాఖలో వివిధ హోదాలలో నిర్విరామంగా సేవలందించిన కమ్యూనిటీ హెల్త్ అధికారి యిజ్జన వీరమ్మ బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆమె సేవలకు గౌరవ వందనం చేస్తూ పోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అభినందన కార్యక్రమం భావోద్వేగాల నడుమ ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమం సిహెచ్ఓ రమేష్ రెడ్డి, ఎం.పి.హెచ్.ఓ సత్యనారాయణల సమర్థ నాయకత్వంలో, ముందస్తు ప్రణాళికతో, ఎక్కడా లోటుపాట్లు లేకుండా అత్యంత క్రమబద్ధంగా సాగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ప్రతి అంశాన్ని సవ్యంగా అమలు చేస్తూ, కార్యక్రమాన్ని ఆదర్శవంతంగా నిర్వహించిన తీరుకు హాజరైన వారందరూ ప్రశంసలు కురిపించారు.డాక్టర్లు డి. సుప్రజా, శ్రీ వాసవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీరమ్మ - జిల్లెల్ల శ్యామసుందర రావు దంపతులను వైద్య ఆరోగ్య సిబ్బంది పూలమాలలు, బొకేలు, దుస్సాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. సేవామూర్తిగా నిలిచిన వీరమ్మకు పలువురు కృతజ్ఞతలు తెలుపుతూ భావోద్వేగంగా మాట్లాడారు.కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ, యిజ్జన వీరమ్మ తన 34 సంవత్సరాల సేవా జీవితంలో నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆమె అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని, ప్రజాప్రతినిధులు మరియు ఉన్నతాధికారుల మన్ననలు పొందిన ఆమె ప్రయాణం ప్రతి ఉద్యోగికి ఆదర్శమని పేర్కొన్నారు.డాక్టర్లు డి. సుప్రజా, శ్రీ వాసవి మాట్లాడుతూ, వీరమ్మ సేవలు వైద్య ఆరోగ్య శాఖ చరిత్రలో ఒక గౌరవప్రదమైన అధ్యాయమని, ఆమె పని తీరు నేటి తరం వైద్య సిబ్బందికి మార్గదర్శకమని అన్నారు. సేవాభావంతో పని చేసే ఉద్యోగులు సమాజానికి ఎంతటి మార్పు తీసుకురాగలరో వీరమ్మ జీవితం చాటిచెప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని యిజ్జన వీరమ్మకు హృదయపూర్వక శుభాకాంక్షలుతెలియజేశారు. ఈ కార్యక్రమంలోఎంపీపీ సుమంగళి సాగర్, సర్పంచ్ చెట్టు బత్తుల సువర్ణరాజు మాజీ సర్పంచ్ రుద్రరాజు సుజాత, రిటైర్డ్ సిహెచ్ఓ సత్యనారాయణ,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొని వీరమ్మకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# గ్రూప్ 2 ఫలితాలలో శ్రీ సూర్య విద్యార్థుల ప్రతిభ



**నరసాపురం, ఫిబ్రవరి 4 (మనం న్యూస్):** తాజాగా ప్రకటించిన ఏపీపీఎస్సీ గ్రూప్ 2 ఫలితాలలో స్థానిక శ్రీ సూర్య జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు శేరు తాతయ్య డిప్యూటీ తహశీల్దారుగా, గెద్దాడ చంద్రకళ ఏ.ఎస్.వో గా ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మొగల్తూరు మండలం పేరుపాలెం ఏటిమొండి గ్రామానికి చెందిన శేరు తాతయ్య, పాలకొల్లు మండలం చిట్టివాని గరువు గ్రామానికి చెందిన గెద్దాడ చంద్రకళ 2012-14 విద్యా సంవత్సరంలో నరసాపురం పట్టణంలోని శ్రీ సూర్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. డిగ్రీ అనంతరం గ్రూప్స్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యి విజయం సాధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల స్థాయిలో శ్రీ సూర్య విద్యా సంస్థల్లో అందించిన అత్యుత్తమ శిక్షణ తీసుకోవడంతోనే తమ లక్ష్యాలను సాధించడానికి మార్గం ఏర్పడిందని ఆ తర్వాత ప్రిపరేషన్ కు శ్రీ సూర్య కళాశాల శిక్షణ ఎంతగానో ఉపయోగ పడిందని తెలిపారు. తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రూపు పరీక్షలలో విజయం సాధించిన తమ కళాశాల పూర్వ విద్యార్థులు తాతయ్య, చంద్రకళలను శ్రీ సూర్య విద్యా సంస్థల చైర్మన్ ఘంటసాల సూర్యనారాయణ, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ, అకడమిక్ అడ్వైజర్ బి. రామచంద్ర రెడ్డి, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఏఆర్ ఎస్ కుమార్, డాక్టర్ ఫాజిల్, డాక్టర్ కె. జానకిరామ్, ఎస్.వేణు, టి. కృష్ణగుప్తా, జె. సుబ్బారావు, యు. లక్ష్మీ కాంత్, పి. పుల్లారావు, అధ్యాపక బృందం, సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానంకు పార్కింగ్ సమస్య

- పరిష్కరించడంలో విఫలమైన అధికారులు



**పాలకొల్లు, ఫిబ్రవరి 4,మనం ప్రతినిధి :** పశ్చిమగోదావరి జిల్లా లో పంచరామ క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానం కు పార్కింగ్ సమస్య పట్టుకుంది. ఎంతమంది అధికారులు వచ్చిన ఈ సమస్యను పరిష్కరించడంలో విఫలమవుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేవస్థానం కు వెళ్లి ద్విచక్ర వాహనం కాని, కనీసం సైకిల్ కూడా పెట్టుకునే పరిస్థితి లేక భక్తులు గగ్గోలు పెడుతున్నారు. సైకిల్ పెట్టుకుందాం అన్న, మోటర్ సైకిల్ పెట్టుకుందాం అన్న గుడి వద్ద చిల్లర వ్యాపారులు బండ్లు అడ్డంగా పెట్టుకుని వెళ్ళనీయలేని దుస్థితి నెలకొంది.

**దేవస్థానం వద్ద చిల్లర వ్యాపారులను తరలించడంలో అధికారుల వైఫల్యం:**

శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద భక్తులు వాహనాలు పెట్టుకునేందుకు వీలు లేకుండా చిల్లర వర్తకుల సరుకుతో కూడిన తినుబండార బండ్లు అడ్డుగా పెట్టడంతో ఆ బండ్లను తీయమనలేక భక్తులు లోలోపల మదనపడుతూ అధికారులు వైఫల్యం వేలెత్తి చూపుతూ విమర్శిస్తున్నట్లు తెలిసింది. ఈ గుడికి వచ్చిన ఈ తిప్పలు తప్పవు ఏమో అనుకుని ఎక్కడో ఉత్తరం వైపున చివర్న వాహనాలు పెట్టుకుని మళ్ళీ ఎదరకు వచ్చి గుడికి రావాల్సి వస్తుందని భక్తులు విమర్శిస్తున్నారు. అధికారులకు, చిల్లర వ్యాపారులంటే మోహమోటం దేనికని ప్రశ్నిస్తున్నారు. మోహమోటం ఉండడం వల్లే ఇలా వారిని నియంత్రణ చేయలేకపోతున్నారు ఏమో అని మరి కొందరు ఆరోపిస్తున్నారు. గుడికి వచ్చి విరాళాల రూపంలో ఆదాయం కల్పించే భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలా లేక చిల్లర వర్తకుల కు ప్రాధాన్యత ఇవ్వాలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. భక్తులకు ప్రాధాన్యత ఇచ్చే వారైతే భక్తుల వాహనాలు చివరకు పంపరని ఈ వర్తకుల్ని ఆ చివరకు పంపేలా చేసేవారిని అందరూ భక్తులు వ్యాఖ్యానిస్తున్నారు. దేవస్థానం కు ఉత్తరం వైపున మెయిన్ రోడ్ లో ఈ పరిస్థితి అయితే దేవస్థానం తూర్పు వైపున ఇరుకు సందులో కూడా ఇదే పరిస్థితి. సైకిళ్లు, ద్విచక్ర వాహనాలు పెట్టుకునేందుకు వీల్లేకుండా చిన్నచిన్న దుకాణాలను పెట్టుకోవడానికి వీలు కల్పించడం వల్ల వాహందారులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇది చాలదన్నట్లు బిక్ష గాళ్ళు అడ్డు ఒకటి.

**చిల్లర వర్తకులు,దుకాణాలు మెయిన్ రోడ్డు బిగ్సీ ఎదురు గా దాటి రాకూడదు:**

శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద ప్రస్తుతం ఉన్న పార్కింగ్ సమస్యను పరిష్కరించాలంటే తూర్పు వైపున చిన్న సందులో దేవస్థానం గోడ పక్కన చిన్న దుకాణాలను, అలాగే ఉత్తర వైపు మెయిన్ రోడ్ లో దేవస్థానం పక్కనే ఉన్న బండ్లు, పెట్టెలు, తట్టల వ్యాపారులు అందర్నీ కూడా బిగ్ సి షాపు ఎదురుగా తరలించాలని, తూర్పు వైపున దేవస్థానం ప్రహరీ గోడ పక్కన ఏమీ లేకుండా ఖాళీ చేయించాలని పలువురు భక్తులు సూచిస్తున్నారు. అధికారులు ఈ విధంగా చేసి భక్తులు పట్ల తమ శతశుద్ధిని నిరూపించుకోవాలని కోరుతున్నారు.

# గ్రంథాలయాలకు పూర్వవైభవం తెస్తాం



- పీరుకట్ల విఠల్ రావు
- రూ. 6 కోట్లతో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 4:** జిల్లాలోని గ్రంథాలయాలను విజ్ఞాన నిలయాలుగా తీర్చిదిద్ది, వాటికి పూర్వవైభవం తీసుకువస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు పీరుకట్ల విఠల్ రావు ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో 2026-27 సంవత్సరానికి గాను రూ. 6 కోట్ల బడ్జెట్కు ఆమోదించి, తదుపరి పౌర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ వారికి తదుపరి ఆమోదం కోసం పంపుతున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా విఠల్ రావు మాట్లాడుతూ, గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కార్పొరేట్ తరహాలో వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పదేళ్లుగా పెండింగ్లో ఉన్న భవన మరమ్మతులు చేపట్టి, ఆకర్షణీయమైన రంగులతో గ్రంథాలయ రూపురేఖలు మారుస్తామన్నారు. చెదలు పట్టిన తలుపులు, పాత ఫర్నీచర్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంతో పాటు, పాఠకుల సౌకర్యార్థం ఆధునిక టాయిలెట్లు, స్వచ్ఛమైన తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ముఖ్యంగా నిధుల కొరత వల్ల పెండింగ్లో ఉన్న జీతభత్యాలు, పెన్షన్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని, సిబ్బంది నైతిక స్థైర్యాన్ని పెంచుతామని భరోసా ఇచ్చారు. జిల్లాలోని 44 శాఖా గ్రంథాలయాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో సహకరిస్తోందని ఆయన కొనియాడారు. ఈ సమావేశంలో జిల్లా సమాచార పౌర సంబంధాల కె.చెన్నకేశవ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వివిజిఎస్ శంకర్ రావు, డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణ్ రావు, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

# ఎలుకల నివారణకు విషపు ఎరువు రైతులు వినియోగించాలి



- వ్యవసాయ అధికారులు

**ఆచంట, ఫిబ్రవరి 4 మనం న్యూస్:** ఆచంట మండల పరిధిలోని అన్ని గ్రామాలలో రైతులందరూ ఎలుకలను సమూలంగా నాశనం చేసేందుకు ఉచితంగా ప్రభుత్వం పంపిణీ చేసే విషపు ఎరువు వినియోగించు కోవాలనిబుధవారం వ్యవసాయ అధికారులు పి మురళీకృష్ణ స్థానిక వ్యవసాయ అధికారి బి నాగరాజు అన్నారు ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులు సాగుచేసిన పంట పొలాలు అధిక దిగుబడి పొందాలంటే రైతులు పలు సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు ఎలుకలను సమూలంగా నివారించేందుకు ప్రభుత్వం పంపిణీ చేసే విషపు ఎరువు ప్రథమంగా 96% నూకలు రెండు శాతం నూనె మరియు రెండు శాతం గ్రోమోడయోలిన్ మందు కలిపి విషపు ఎరువును10 గ్రాములు చొప్పున పొట్లాలుగా చేసి ఎలుకల బొరియల్లో కి తరలిస్తే ఎలుకలు సమూలంగా నాశనం అవుతాయని వ్యవసాయా అధికారులు రైతన్నలకు పలు సూచనలు చేశారు ఈ ఫ్ట్ కార్యక్రమంలో ఆచంట వేమవరం సొసైటీ అధ్యక్షులు నెక్కంటి సత్యనారాయణ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దొంగ నాగర్జున టిడిపి జనసేన బిజెపి కూటమి నాయకులు కార్యకర్తలు రైతన్నలు తదితరులు పాల్గొన్నారు.



# పరసా విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో సిసి రోడ్లు ప్రారంభించిన కామినేని

**ముదినేపల్లి, ఫిబ్రవరి 4 మనం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్, కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్ ముదినేపల్లి మండలం శ్రీహరిపురం గ్రామములో 36 లక్షల రూపాయిలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరస విశ్వేశ్వరరావు నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు , నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారి మారినా ఇంకా పాత పేర్లు తో బోర్డులు దర్శనం

**కాట్రేనికోన, ఫిబ్రవరి 4, మనం ప్రతినిధి:** కాట్రేనికోన ఎంపీడీఓ గా వెంకట చలం పదవి విరమణ జరిగి నూతనఎంపీడీఓ గా బి రాజేశ్వరరావు భాధ్యతలు చేపట్టి నెల రోజులు దాటి పోయింది. కానీ మండలం లోని పంచాయతీ కార్యాలయాలు, సచివాలయం ల వద్ద సమాచారం బోర్డు లలో ఇంకా పేర్లు మార్చలేదు. ఇప్పటికి పాత ఎంపీడీఓ పేరు తో బోర్డు లు దర్శనం ఇస్తున్నాయి. కొన్ని చోట్ల అసలు అధికారులు ఎవరో కూడా తెలియడం లేదని, సమాచార బోర్డు లు ఏర్పాటు చేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. నూతన అధికారి పేరు, హోదా, సెల్ నెంబర్ తో సమాచారం బోర్డు లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. డిప్యూటీ ఎంపీడీఓ, సచివాలయం వ్యవస్థ పర్యవేక్షణ కు ప్రత్యేక అధికారి ని నియమించిన వారి వివరాలు సచివాలయం లలో ఎక్కడా కనిపించడం లేదు. సచివాలయం సిబ్బంది బదిలీ జరగడం తో కొత్త సిబ్బంది వచ్చినా మండలం లో సిబ్బంది కొరత గా ఉంది. ఆ సిబ్బంది వివరాలు కూడా ప్రజలకు అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. కొందరు మండల స్థాయి అధికారులు జీతాలు తీసుకుంటున్నారు కానీ మండలం లో పని చేసిన దాఖలాలు కనిపించడం లేదని,కేవలం సర్వ సభ్య సమావేశంలో మాత్రమే మొక్కి బడిగా కనిపిస్తూ ఉంటారని, అటువంటి అధికారులు పై నూతన ఎంపీడీఓ దృష్టి సారించాలని ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సమయ పాలన పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

# అడవిలో బందీల విముక్తి ఆపరేషన్ విన్యాసం నిర్వహణ



**విశాఖపట్నం, ఫిబ్రవరి4:** నేషనల్ సెక్యూరిటీ గార్డ్ ఆంధ్రప్రదేశ్లోని విశాఖపట్నంలో 02-05 ఫిబ్రవరి 2026 మధ్య విన్యాసాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ విన్యాసంలో వాస్తవ యుద్ధ పరిస్థితులను అనుకరించి, నక్సల్స్ ప్రస్తుత కార్యకలాప విధానానికి అనుగుణంగా వివిధ నైపుణ్యాలు, ఆపరేషనల్ వ్యూహాలు మరియు తంత్రాలను సమన్వయం చేస్తూ, యథార్థమైన మరియు తీవ్ర శిక్షణ వాతావరణాన్ని సృష్టించారు. ఈ విన్యాసం లక్ష్యం సంభవించే ముప్పులను ముందుగా అంచనా వేయడం, ప్రాంతంలో దృఢమైన భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయడానికి సమన్వయ ప్రక్రియలను సాధన చేయడం. ఈ విన్యాసంలో ఆంధ్రప్రదేశ్ పోలీస్, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాలు ప్రథమ స్పందన దళాలుగా పాల్గొనగా, ఇఖ్కడూ, ఐఖీఆ్క, ఖ్రిఖఊ, అటవీ శాఖ, అగ్నిమాపక, వైద్య మరియు గూఢచారి సంస్థల నుండి గణనీయమైన మద్దతు లభించింది. అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన మరియు ప్రభావవంతమైన స్పందనకు అంతర ఏజెన్సీ సమన్వయం మరియు పరస్పర అనుసంధాన సామర్థ్యాన్ని ఈ విన్యాసం స్పష్టంగా చాటింది. అడవి యుద్ధ తంత్రాలు విన్యాసం పూర్తయిన అనంతరం, ఏఖ్గు పరిస్థితుల్లో ఉపయోగించిన ఆయుధాలు మరియు పరికరాల ప్రదర్శనను ఏర్పాటు చేసి, ఆధునిక ఆపరేషనల్ సాధనాలు మరియు వ్యూహాల వినియోగ సామర్థ్యంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ (ఆపరేషన్స్) డా. సుమిత్ గరుడ్, ఐపీఎస్ మాట్లాడుతూ, ౖాఖిఎ బృందం చేపట్టిన సమన్వయపూర్వక ప్రయత్నాలను ప్రశంసిస్తూ, ఈ విన్యాసం ద్వారా ౖాఖిఎ మరియు రాష్ట్ర పోలీస్ బలగాల మధ్య సమన్వయం మరింత బలోపేతం అయి, వాస్తవ కాల ముప్పులను ఎదుర్కొనే ఏకీకృత మరియు సమర్థమైన స్పందన వ్యవస్థ ఏర్పడిందని తెలిపారు. ఇలాంటి విన్యాసాలు ఆపరేషనల్ సిద్ధతను మెరుగుపరచడమే కాకుండా, కీలక దశల్లో వేగవంతమైన మరియు సమగ్ర నిర్ణయాలు తీసుకునేలా స్పందన దళాలను శక్తివంతం చేస్తాయనిౖాఖిఎ పునరుద్ఘాటించింది. ఈ విన్యాసం ద్వారాౖాఖిఎ, గ్రేహౌండ్స్ మరియు ఆక్టోపస్ మధ్య సహకార సామర్థ్యం గణనీయంగా బలపడుతుందని, నక్సల్స్ లేదా ఉగ్రవాద సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో మరింత దృఢమైన మరియు ప్రభావవంతమైన స్పందనకు ఇది దోహదపడుతుందని, సంక్షోభ సమయాల్లో ప్రజల భద్రతను నిర్ధారించడంలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు

# ఐఎఫ్ఆర్-2026 నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి



**విశాఖపట్నం, ఫిబ్రవరి 04 :** అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష (ఐఊఖ-2026), మిలాన్, అంతర్జాతీయ సిటీ పరేడ్ కార్యక్రమాల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఇండియన్ నేవీ, పోలీసు, ఇతర విభాగాల అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాలులో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కోస్ట్ గార్డు డీఐజీ రాజేష్ మిత్తల్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు, ఆర్డీవోలు, ఇతర అధికారులు భాగస్వామ్యమై వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాష్ట్రపతి, రక్షణ శాఖ మంత్రి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు, రెండు నుంచి మూడు లక్షల వరకు ప్రజలు కూడా రానున్న నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, మౌలిక వసతుల కల్పన, వైద్య సేవలు అత్యంత సమర్థవంతంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 17న రాష్ట్రపతి రాకతో కార్యక్రమాలు మొదలవుతాయని, 18న నౌకాదళ ఫ్లీట్ రివ్యూ, 19న ఉదయం మిలాన్ ప్రారంభోత్సవం, సాయంత్రం ఆర్కే బీచ్ రోడ్డులో అంతర్జాతీయ సిటీ పరేడ్ ఉంటుందని, కార్యక్రమాలను వీక్షించేందుకు రెండు నుంచి మూడు లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉన్నందున సమన్వయంతో పని చేయాలని సూచించారు. సిటీ పరేడ్ మార్గంలో ఎల్ఈడి స్క్రీన్లు, పీఏ సిస్టమ్, గ్యాలరీలు, బారికేడింగ్, పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదనంగా వీఎంఆర్డీఏ పార్క్, వైఎంసీఏ, ఏయూ ఫుట్బాల్ గ్రౌండ్లను హోల్డింగ్ ఏరియాలుగా వినియోగించకోవాలని సూచించారు. వైద్య, అగ్నిమాపక, తాగునీరు, మొబైల్ టాయిలెట్లు, పరిశుభ్రత చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బీచ్ రోడ్ సుందరీకరణ, డెకరేటివ్ లైటింగ్, పరిశుభ్రత పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఫిబ్రవరి 17 నుంచి కంట్రోల్ రూమ్ పూర్తి స్థాయిలో పనిచేస్తుందని, అవసరమైతే వేదికల వద్ద ప్రత్యేక కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. నో-డ్రోన్, నో కైట్ జోన్ అమలు చేస్తామని స్పష్టం చేశారు. పార్కింగు ప్రాంతాల్లో, ప్రముఖులు రాకపోకలు సాగించే ప్రధాన రహదారుల్లో లైటింగ్ సదుపాయం కల్పించాలన్నారు. సమావేశంలో ఇండియన్ నేవీ, వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాట్రేనికోనను వెంటాడుతున్న కరెంటు కష్టాలు



**కాట్రేనికోన, ఫిబ్రవరి 4, మనం ప్రతినిధి:** కాట్రేనికోన మండలానికి కరెంటు కష్టాలు తప్పడం లేదు. పల్లంకుర్రు లో సబ్ స్టేషన్ నిర్మాణ నిమిత్తం గడచిన మూడు నెలలుగా వారానికి రెండు రోజులు చొప్పున విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఆ సబ్ స్టేషన్ నిర్మాణ కష్టాలు పూర్తి అయ్యాయి అనుకునే లోపు కవర్ కండక్టర్స్ వర్క్ పేరుతో సరఫరా నిలిచిపోతుంది. 33 కే వి చెయ్యేరు నుండి కాట్రేనికోన లైన్ కవర్ కండక్టర్ వరక్స్ జరగటం వలన సరఫరాలో అంతరాయం కలుగుతుందని సంబంధిత శాఖ సిబ్బంది చెబుతున్నారు. మరో వా.రం రోజులు పాటు ఇదే పరిస్థితి కొనసాగు వచ్చునన్న మాటలు వీరి నుండి వినపడుతున్నాయి. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పై ఆధారపడి నడిచే పరిశ్రమలు, వ్యాపారాలు చతికలు పడుతున్నాయి.

# బడ్జెట్‌లో లోపాలు చెప్పగలరా?

## రాహుల్‌గాంధీకి నిర్మలా సీతారామన్ సవాల్





**ఢిల్లీ,ఫిబ్రవరి 4:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సవాల్ విసిరారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సమగ్రంగా లేదని రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సీతారామన్ మాట్లాడుతూ.. ఆయన చేసిన వ్యాఖ్యలకు ఎటువంటి ఆధారం లేదని అన్నారు. బడ్జెట్లో లోపాలు ఉన్నాయని చేస్తున్న ఆరోపణలను నిరూపించే అంశాలను కాంగ్రెస్ నేత తన ముందు నిలబడి చెప్పగలరా?అని సవాల్ చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలకు తగిన ఆధారాలు చూపించాలన్నారు. తమ ప్రభుత్వం యువత నైపుణ్యం, వ్యవస్థాపకత, కృత్రిమ మేధస్సు వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై బడ్జెట్‌లో ప్రధానంగా దృష్టి సారించిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. దేశంలో అభివృద్ధి చెందుతున్న కార్మిక మార్కెట్ అవసరాలను తీర్చడానికి వ్యవసాయం, గ్రామీణ ఉపాధి, యువతకు ఉపాధి శిక్షణ కేంద్రాలు వంటి వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై రాహుల్ గాంధీ ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సమగ్రంగా లేదని.. దేశం ఎదుర్కొంటున్న నిజమైన సంక్షోభాలపై దృష్టి సారించలేకపోయిందని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాలు లేవని, తయారీ రంగం పతనమవుతోందని ఆరోపించారు. పెట్టుబడిదారులు పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారన్నారు. రైతుల ఇబ్బందులు, ప్రపంచ దేశాల నుంచి తగులుతున్న ఎదురు దెబ్బలు వంటి అంశాలను ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.

# ఎప్‌స్టీన్ ఫైల్స్ వల్లే బిల్‌గేట్స్‌తో బంధం ముగిసింది

## మాజీ భార్య మిలిందా





**వాషింగ్టన్, ఫిబ్రవరి 4:** ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం దర్యాప్తులో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌కు సంబంధించిన పలు విషయాలు వెల్లడవడంపై ఆయన మాజీ భార్య మిలిందా స్పందించారు. బిల్‌గేట్స్ ఇతర మహిళలతో సన్నిహితంగా ఉన్నట్లు తెలియడంతో తీవ్రమైన మానసిక క్షోభను అనుభవించానని అన్నారు. ఆ కారణంగానే తమ వైవాహిక జీవితానికి ముగింపు పలికినట్లు తెలిపారు. తన జీవితంలో ఆ సమయం చాలా బాధాకరమైనదని మిలిందా పేర్కొన్నారు. తమ బంధాన్ని కాపాడుకోవడానికి కావాల్సిన విలువలను బిల్‌గేట్స్ నిలబెట్టుకోకపోవడం వల్లే ఆయనతో విడాకులు తీసుకున్నట్లు తెలిపారు. తాజాగా ఎప్‌స్టీన్ ఫైల్స్‌లోబిల్‌గేట్స్ గురించి బయటకు వచ్చిన విషయాలపై ఆయనే సమాధానం చెప్పుకోవాలని, తాను కాదని వ్యాఖ్యానించారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బాధితులుగా ఉన్న మహిళలకు న్యాయం లభిస్తుందని ఆశిస్తున్నానన్నారు.

మూడు దశాబ్దాల వివాహ బంధానికి స్వస్తి పలుకుతూ బిల్‌గేట్స్ - మిలిందా దంపతులు 2021లో విడాకులు తీసుకున్నారు. వీరికి 20 ఏళ్లకు పైబడిన ముగ్గురు పిల్లలున్నారు. అయితే, ఎప్‌స్టీన్‌తోగేట్స్‌కు సంబంధాలు ఉండడం నచ్చని మిలిందా ఆయన నుంచి విడాకులు తీసుకుందని ప్రముఖ పత్రిక వాల్ స్ట్రీట్ జర్నల్ అప్పట్లో ఓ కథనంలో పేర్కొంది. అమెరికా న్యాయశాఖ ఇటీవల విడుదల చేసిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లోననూ గేట్స్ రష్యన్ మహిళలతో లైంగిక సంబంధాలు నెరిపాడని.. అందువల్లే ఆయన సుఖవ్యాధుల బారిన పడ్డారని ఎప్‌స్టీన్ ఆరోపణలు చేశాడు. ఈ విషయం బయటపడకుండా ఉండేందుకు ఆయన తన భార్య మిలిందాకు రహస్యంగా ఇచ్చేందుకు యాంటీబయాటిక్స్ తనను అడిగారని తెలిపాడు. కాగా ఈ ఆరోపణలను గేట్స్ బృందం తీవ్రంగా ఖండించింది. ఇవి పూర్తిగా అసంబద్ధమైనవని పేర్కొంది.

### తెలంగాణలో మున్సిపోల్స్‌కి

# పవన్ ప్రచారం

**హైదరాబాద్, ఫిబ్రవరి 4 :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రచారం చేయనున్నారు. ఈ నెల 7, 8వ తేదీల్లో ప్రచారం చేసేందుకు రానున్నారు. ఈ మేరకు జనసేన కేంద్ర కార్యాలయం వెల్లడించింది. భాజపా, జనసేన అభ్యర్థుల తరఫున మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని పార్టీ తెలిపింది. పవన్ ఎన్నికల ప్రచార షెడ్యూల్, రూట్ మ్యాప్ను త్వరలో ప్రకటిస్తామని పేర్కొంది.

# సుప్రీంలో 'సర్' విచారణ..

## స్వయంగా వాదనలు వినిపించిన మమతా బెనర్జీ



**ఢిల్లీ,ఫిబ్రవరి 4:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై విచారణలో భాగంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ సుప్రీంకోర్టులో స్వయంగా వాదనలు వినిపించారు. 'సర్' ప్రక్రియకు సంబంధించి తాను ఈసీకి ఆరుసార్లు లేఖలు రాసినట్లు ఆమె అత్యున్నత న్యాయస్థానానికి వెల్లడించారు. అయినప్పటికీ తనకు న్యాయం జరగలేదని తెలిపారు. తన రాజకీయ పార్టీ కోసం పోరాటం చేయడం లేదని, ఓ పెద్ద కారణంతోనే న్యాయం కోసం ఇక్కడికి వచ్చినట్లు పేర్కొన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో సర్‌ను వ్యతిరేకిస్తూ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) చేస్తున్న పోరాటం కొన్నిరోజుల క్రితమే ఢిల్లీకి చేరింది. సర్ సమస్యలపై మాట్లాడేందుకు ఇప్పటికే ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)తోనూ భేటీ అయ్యారు. అయితే ఆ భేటీ నుంచి ఆమె మధ్యలోనే వాకౌట్ చేశారు. మరోవైపు, సర్ ప్రక్రియ ఏకపక్షంగా నిర్వహిస్తున్నారని, అవకతవకలు జరుగుతున్నాయని తృణమూల్ ఎంపీలు ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో తాజాగా జరిగిన విచారణకు మమత హాజరయ్యారు. స్వయంగా వాదనలు వినిపించేందుకు 5 నిమిషాలు సమయం ఇవ్వాలంటూ ఆమె సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ను అభ్యర్థించారు. 15 నిమిషాలు తీసుకోండంటూ గడువు ఇచ్చారు.

''ఎన్నికల సంఘం మా అభ్యర్థనలను పట్టించుకోవడం లేదు. సమస్య ఏంటంటే.. చివరకు ఎక్కడా న్యాయం దొరకడం లేదు. ఈసీకి ఆరుసార్లు లేఖ రాసినా.. సమాధానం రాలేదు'' అని ఈసీపై విమర్శలు చేశారు. ఆమె వాదనలో వాస్తవం ఉందని పేర్కొన్న కోర్టు.. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని హామీ ఇచ్చింది. అలాగే మమత వేసిన పిటిషన్‌లో భాగంగా ఈసీకి కోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

# యూఎస్‌తో ఒప్పందం ప్రయోజనకరమే



- కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్

**ఢిల్లీ,ఫిబ్రవరి 4:** అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకున్నప్పటికీ వ్యవసాయం, పాడి రంగాల్లో భారత్ తన ప్రయోజనాలను వీడలేదని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. దేశంలోని ముఖ్యమైన రంగాల్లో దేనినీ విస్మరించలేదన్నారు. ఇరుదేశాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని దౌత్య సంబంధాలపై ఒప్పందాలు చేసుకున్నామన్నారు. ఇందులోభాగంగా 140 కోట్ల మంది దేశ ప్రజల ఇంధన భద్రతకు ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఏడాది పాటు అమెరికాతో పలుమార్లు చర్చలు జరిపిన అనంతరం దీనిపై ట్రంప్ ప్రకటన వెలువరించారని తెలిపారు.

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై లోక్‌సభలో మాట్లాడుతూ పీయూష్ గోయల్ ఈ వ్యాఖ్యలు చేశారు. అగ్రరాజ్యంతో ఒప్పందం వల్ల భారత్‌లోని తయారీదారులు, ఎగుమతిదారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు బలపడతారని గోయల్ పేర్కొన్నారు. తోలు ఉత్పత్తులు, సేంద్రియ రసాయనాలు, రబ్బరు ఉత్పత్తులు, యంత్రాలు, విమాన తయారీ రంగంలోని కార్మికులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. చైనా, బంగ్లాదేశ్, మలేసియా, కంబోడియా, వియత్నాంల కన్నా తక్కువ సుంకాలే మనకు అమలు కానున్నాయని పేర్కొన్నారు. దీనిపై త్వరలో రెండు దేశాలు సంయుక్త ప్రకటన చేయనున్నాయని, అందులో మరిన్ని వివరాలు వెల్లడవుతాయన్నారు.

# మాకంటే వారి వద్దే శక్తిమంతమైన ఆయుధాలు: పాక్ రక్షణమంత్రి ఖవాజా



**ఇస్లామాబాద్,ఫిబ్రవరి 4:** పాకిస్థాన్ ప్రభుత్వానికి కొన్నేళ్లుగా బలోచ్ రెబెల్స్ పంటికింద రాయిలా మారారు. వారివద్ద అమెరికా ఆయుధాలు ఉన్నాయని పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలు చేశారు. వాటిలో నైట్ విజన్ డివైజ్‌లు, రైఫిళ్ల వంటి అధునాతన ఆయుధాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాంటివి తమ సైన్యం వద్ద కూడా లేవన్నారు. ఈ మేరకు ఆయన నేషనల్ అసెంబ్లీలో మాట్లాడారు.

పాక్ ప్రావిన్స్ బలోచిస్థాన్ వైశాల్యం, రెబెల్స్ వద్ద ఉన్న అధునాతన ఆయుధాల కారణంగా వారితో పోరాడేందుకు పాక్ సైన్యం ఇబ్బందిపడుతోందని మంత్రి అంగీకరించారు. ''వారివద్ద 2 మిలియన్ల విలువైన రైఫిల్ ఉంది. అది మనవద్ద లేదు. 4000 డాలర్ల నుంచి 5000 డాలర్ల విలువైన థర్మల్ వెపన్ సైట్స్ ఉన్నాయి. ఇలాంటి ఆయుధాలన్నీ వారికి ఎక్కడినుంచి వస్తున్నాయి..? వీటిల్లో కొన్ని అమెరికా ఆయుధాలు కూడా ఉన్నాయి. ఈ ఉగ్రవాదుల నాయకులు అఫ్గానిస్థాన్‌లో ఉన్నారు. అక్కడి నుంచే వారికి మద్దతు లభిస్తోంది. ప్రభుత్వవ్యతిరేక కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నవారితో చర్చలు జరపలేం. దాడులు ఆపకపోతే.. పరిణామాలు తీవ్రంగా ఉంటాయి'' అని బలోచ్ రెబెల్స్ను మంత్రి హెచ్చరించారు.

ఇరాన్, అఫ్గానిస్థాన్ సరిహద్దుకు సమీపంలోని బలోచిస్థాన్ కేంద్రంగా వేర్పాటువాద సంస్థ బలోచ్ లిబరేషన్ ఆర్మీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. దీనిని అమెరికా ఉగ్రసంస్థగా గుర్తించింది. ఈ సంస్థ సైన్యానికి చెందిన మౌలికసదుపాయాలు, పోలీసులు, స్థానిక అధికారులపై కొన్నేళ్లుగా దాడులు చేస్తోంది. ఇటీవల బలోచిస్థాన్ ప్రావిన్సులోని వేర్వేరు ప్రాంతాల్లో రెబెల్స్ దాడులు చేశారు. దాంతో పాకిస్థాన్ కౌంటర్ ఆపరేషన్ నిర్వహించింది. ఈ ఘటనల్లో 200 మంది వరకు రెబెల్స్తో పాటు పౌరులు, భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు.

# ఆన్‌లైన్ గేమ్‌లో చివరి టాస్క్...సూసైడ్

## ముగ్గురు అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య



**ఘజియాబాద్,ఫిబ్రవరి 4:** : ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలైన ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఘజియాబాద్‌లో ఆత్మహత్య చేసుకోవడం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది.ఈ ఘటనకు కొరియన్ గేమింగ్ యాప్‌నకు సంబంధం ఉందని తెలుస్తోంది. ఆ ఆన్‌లైన్ ఆటలో ఆత్మహత్యే చివరి టాస్క్ అని బాలికల తండ్రి మీడియాకు వెల్లడించారు. ''రెండున్నరేళ్లుగా మా ముగ్గురు పిల్లలు ఈ గేమ్ ఆడుతున్నారు. దీంతో వీరు క్రమక్రమంగా కుటుంబానికి దూరమవుతూ వచ్చారు. ఎప్పుడూ ఫోన్లు పట్టుకొని వారి గదుల్లోనే ఉండేవారు. వారిలో ఒకరు ఇన్‌స్ట్రక్టర్‌గా ఉంటే.. మిగతా ఇద్దరు ఆదేశాలు పాటించేవారు. వారి ఫోన్లలో చివరి టాస్క్ సూసైడ్ అని ఉందని దర్యాప్తు అధికారులు మాకు చెప్పారు'' అని మీడియాకు వెల్లడించారు.

ఆ బాలికలు కింద పడిపోవడాన్ని తాను ప్రత్యక్షంగా చూసినట్లు పక్క ఫ్లాట్ వ్యక్తి వెల్లడించారు. '' రెండు గంటల సమయంలో నేను నిద్రపోవడానికి ముందు బాల్కనీలోకి వచ్చాను. అప్పుడు ఆ అక్కాచెల్లెళ్లు బాల్కనీలోనే ఉన్నారు. కానీ అక్కడ కూర్చున్నది ఎవరో నాకు అర్థం కాలేదు. వారు దూకేందుకు ప్రయత్నిస్తున్నట్టు అనిపించింది. తొలుత ఒక అమ్మాయి రెయిలింగ్‌పై కూర్చున్న మరో అమ్మాయిని తోసింది. భార్యాభర్తలేమో అనుకున్నాను. నేను ఆ ఇంటి సభ్యులను అప్రమత్తం చేసేలోపే ఒకరి తర్వాత ఇంకొకరు దూకారు. వెంటనే నేను పోలీసులు, అంబులెన్స్‌కు ఫోన్ చేశాను. కానీ అంబులెన్స్ గంట తర్వాత వచ్చింది'' అని ఆ వ్యక్తి వెల్లడించారు. ఈ ఆత్మహత్యకు ముందు ముగ్గురు బాలికలు తమ గదిలోకి వెళ్లి బోల్ట్ పెట్టుకున్నారు. తర్వాత గది నుంచి బాల్కనీకి వచ్చి ఒకరి తర్వాత ఒకరు కిందకు దూకేశారు. వారి కేకలు, వారు నేలపై పడిన శబ్దాలతో అపార్ట్‌మెంట్‌లోని వారు, సెక్యూరిటీ పరిగెత్తుకు వచ్చారు. శబ్దం వచ్చిన వైపు వెళ్లగా ముగ్గురు నేలపై రక్తపుమడుగులో కనిపించారు.

### రాహుల్ వ్యాఖ్యలు..

# భగ్గుమన్న బీజేపీ!

**ఢిల్లీ,ఫిబ్రవరి 4:** కేంద్రమంత్రి రవ్నీత్ సింగ్ బిట్టును ఉద్దేశించి 'ద్రోహి' అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఆయన వ్యాఖ్యలు ఓ వర్గాన్ని బాధించాయని పేర్కొంది. ప్రతిపక్ష నేతపై లోక్‌సభ స్పీకర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. రాహుల్ గాంధీ అన్ని హద్దులు దాటారని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురీ విమర్శించారు. ''ద్రోహి అనే పదాన్ని తేలికగా తీసుకోకూడదు. దేశానికి ద్రోహం చేసిన వ్యక్తిని ఉద్దేశించి ఈ పదాన్ని ఉపయోగిస్తారు. కేంద్ర మంత్రి రవ్నీత్ సింగ్ బిట్టు కేవలం ఓ ఎంపీ మాత్రమే కాదు. దేశానికి సేవలందించిన ఓ కుటుంబానికి చెందిన వ్యక్తి కూడా. పంజాబ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన తాత సర్దార్ బియాంత్ సింగ్ ఓ అమరవీరుడు. అలాంటి వ్యక్తిని దేశద్రోహి అని పిలిచారు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు'' అని హర్దీప్ సింగ్ పురీ మండిపడ్డారు.

మరోవైపు.. రాహుల్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం సమీపంలో బీజేపీ శ్రేణులు ఆందోళన నిర్వహించాయి. ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. దేశానికి గర్వకారణమైన ఓ వర్గాన్ని ఆయన కించపర్చారని బీజేపీ ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్దేవ ఆరోపించారు. గాంధీ కుటుంబమే అసలైన ద్రోహి అని ఢిల్లీ మంత్రి మన్జిందర్ సింగ్ సిర్సా ఆరోపించారు.



పార్లమెంటు ద్వారం వద్ద విపక్ష ఎంపీలు నిరసన తెలుపుతున్న సమయంలో కేంద్ర మంత్రి రవ్నీత్ సింగ్ బిట్టు అటుగా వచ్చారు. 'ఇదిగో ఇక్కడ ఓ ద్రోహి నడుచుకుంటూ వెళ్తున్నాడు' అంటూ రాహుల్ విమర్శలు చేశారు. తిరిగి వస్తావంటూ ఎద్దేవా చేశారు. దీనికి కేంద్ర మంత్రి గట్టి కౌంటర్ ఇచ్చారు. రాహుల్తో కరచాలనం చేసేందుకు నిరాకరిస్తూనే.. 'మీరు దేశానికి ద్రోహం చేశారు' అని వ్యాఖ్యానించారు. గతంలో కాంగ్రెస్ నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచిన బిట్టు.. 2024 ఎన్నికల ముందు బీజేపీలో చేరారు.

# సర్ను అలా మార్చొద్దు

## రాజ్యసభలో కమల్ హాసన్



**ఢిల్లీ,ఫిబ్రవరి 4:** తమిళనాడులో కొనసాగుతోన్న ఎన్నికల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు, ప్రముఖ నటుడు కమల్ హాసన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా రాజ్యసభలో మాట్లాడిన ఆయన ఎన్నికల సంఘం రాష్ట్ర ఓటర్ల హక్కులను తనిఖీ చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు.

''రాష్ట్రంలో త్వరలో జరిగే ఎన్నికల గురించే నా ఆందోళన. దాన్ని అక్షరదోషాలు తనిఖీ చేసే ప్రక్రియగా భావిస్తున్నా. ఓటు ప్రాథమిక హక్కు. ఎన్నికల కమిషన్ మాత్రం మా హక్కును తనిఖీ చేస్తోంది. జాబితా పరిశీలనల్లో అనేక తప్పిదాలు జరుగుతున్నాయి. దీనివల్ల రాష్ట్రంలో దాదాపు కోటి మంది అర్హులైన ఓటర్లు చనిపోయినవారి జాబితాలో ఉండవచ్చని ఆందోళన చెందుతున్నాం. బిహార్లో బతికున్న వారిని చనిపోయిన వారి ఓటర్ల జాబితాలో చేర్చారు. అటువంటి పరిస్థితి దేశమంతటా వ్యాప్తి చేయొద్దని కోరుకుంటున్నాం'' అని అన్నారు.

భాష గురించి మాట్లాడిన కమల్.. తనకు తమిళ ఉపాధ్యాయులు భాషను పరిచయం చేశారని చెప్పారు. తమ భాష, సంస్కృతిపై జరిగే ఎటువంటి దాడినైనా ఎదుర్కోవాలని సీఎన్ అన్నాదురై..తదితర నేతల నుంచి నేర్చుకున్నానని అన్నారు. హైస్కూల్ మధ్యలో చదువు మానేసిన తాను ఆర్థికశాస్త్రంపై మాట్లాడేందుకు అర్హుడని కాదని ఎవరు అనుకున్నా అభ్యంతరం లేదని, తాను మాత్రం మాట్లాడుతానని స్పష్టంచేశారు. తమిళుడిగా తనకు ఓ స్పష్టమైన అభిప్రాయం ఉందన్నారు. ప్రస్తుత రాజకీయాలను నేటి యువత నిశితంగా గమనిస్తోందన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని నింపుతూ భవిష్యత్తు తమదేనన్న వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

### విమానం ఇంజిన్‌లో మంటలు..

# కోల్‌కతా ఎయిర్‌పోర్టులో ఎమర్జెన్సీ ల్యాండింగ్



**కోల్‌కతా, ఫిబ్రవరి 4:** టర్కియేకు చెందిన ఓ విమానానికి తీవ్ర సమస్య తలెత్తింది. కాఠ్మాండు నుంచి టర్కియే బయలుదేరిన కొద్ది సేపటికే ఇంజిన్లో మంటలు వచ్చాయి. దీన్ని గమనించిన పైలట్ కోల్కతా ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఘటన సమయంలో విమానంలో 236 మంది ప్రయాణికులు ఉన్నారని, వారంతా సురక్షితమేనని అధికారులు వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం కాఠ్మాండు నుంచి ఇస్తాంబుల్ బయలుదేరిన తుర్కియే ఎయిర్‌లైన్స్ విమానం.. గాల్లోకి ఎగిరిన నాలుగు నిమిషాలకే కుడి వైపు ఇంజిన్‌లో మంటలు వచ్చాయి. దీన్ని గమనించిన పైలట్.. వెంటనే ఆ ఇంజిన్‌ను నిలిపివేశారు. ఈ విషయాన్ని కాఠ్మాండు టవర్‌కు చేరవేసి, పరిస్థితి అంచనా వేస్తూ సింగిల్ ఇంజిన్తోనే కొద్దిసేపు గాల్లోనే చక్కర్లు కొట్టించారు. అనంతరం సుదీర్ఘ ప్రయాణం సురక్షితం కాదని భావించి.. కోల్‌కతాలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. పైలట్ నుంచి 'ప్యాన్ ప్యాన్' సిగ్నల్ రాగానే.. నిబంధనల ప్రకారం అన్ని చర్యలు తీసుకున్నట్లు పౌర విమానయానశాఖ వెల్లడించింది.

# మణిపుర్ సీఎంగా ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణ స్వీకారం



**ఇంఫాల్, ఫిబ్రవరి 4:** మణిపుర్‌లో రాష్ట్రపతి పాలనకు తెరపడింది. నూతన సీఎంగా బీజేపీ నేత వై.ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ అజయ్‌కుమార్ భల్లా ఆయనతో ప్రమాణం చేయించారు. భాజపా ఎమ్మెల్యే నెమ్చా కిప్జెన్, నాగా పీపుల్స్ ఫ్రంట్ శాసనసభ్యుడు ఎల్.డిఖో ఉపముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

మణిపుర్‌లో 2023 మేలో మొదలైన జాతుల మధ్య ఘర్షణలు హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. 260 మందికిపైగా మృతి చెందగా.. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఈ ఘటనల నేపథ్యంలో గతేడాది ఫిబ్రవరిలో అప్పటి సీఎం బీరెన్‌సింగ్ రాజీనామా చేశారు. అనంతరం రాష్ట్రపతి పాలన విధించారు.

దాదాపు ఏడాది తర్వాత బుధవారం ఎత్తివేశారు. ఖేమ్‌చంద్ సింగ్ ఇప్పటికే రాష్ట్ర ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా ఎన్నికయ్యారు. 2017 నుంచి 2022 వరకు మణిపుర్ అసెంబ్లీ స్పీకర్గా పనిచేశారు. 2022లో బీరెన్‌సింగ్ సర్కారులో మంత్రిగా నియమితులయ్యారు. మణిపుర్లోని మూడు కీలక సామాజిక వర్గాలతోనూ (మైతేయ్లు, కుకీలు, నాగాలు) సత్సంబంధాలు కలిగి ఉండటం ఆయనకు కలిసొచ్చినట్లు తెలుస్తోంది.

# మద్యానికి నోటుకు ఓటు అమ్ముకోవద్దు

సూర్యాపేట, ఫిబ్రవరి 04 (మనం ప్రతినిధి): మద్యానికి,నోటుకు,ఓటు అమ్ముకోవద్దు ఎన్నికలను రిటైల్ కాల్ కొనుగోలు హోల్సేల్ అమ్మకాలుగా మార్చిన రాజకీయ పార్టీలను నిలదీయయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక పిలుపు నిచ్చింది బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద జైభారత్, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నోట్లకి మద్యానికి ఓటు అమ్ముకోవద్దని ప్రచార కరపత్రాలు గోడపత్రికలు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ మాట్లాడుతూ.... ఎన్నికలలో మద్యం, ధన ప్రభావం వల్ల ఎన్నికల వ్యవస్థ కలుషితమైందని అన్నారు. మద్యం,నోట్లు పలు రకాల ప్రలోభాల వల్ల సామాన్య, నిజాయితీ, నిబద్ధత, నీతి, అర్హత కలిగిన వారు ఎన్నికలలో పాల్గొనే పరిస్థితి లేదని ఈ పరిస్థితిని రూపుమాపాలని కోరారు. నానాటికి ఎన్నికలు వ్యాపారంగా మారా యని ప్రజాస్వామ్యం అపహస్యం అవుతుందని, విమర్శించారు. కొన్ని రాజకీయ పార్టీలు తమ రాజకీయాల కొరకు




జీవితాన్ని బలంగా పెట్టిన కార్యకర్తలను నాయకులను కాదని తమ స్వార్థం కొరకు టికెట్లకు వేలం పాట లేచి అనుకుంటున్నారని విమర్శించారు ఈ విధంగా టికెట్లు పొందిన వాళ్ళు రిటైల్ గా ఓటర్లను కొనుక్కొని హోల్సేల్ గా చైర్మన్ అభ్యర్థులకు ముఖ్యమంత్రిలకు అమ్ముడుపోతున్న పరిస్థితి ఉన్నదని ఆయన అన్నారు . అయ్యేటట్టు ప్రజలు దన స్వామ్యాన్ని బద్దలు కొట్టి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలని, ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా నీతి అర్హత కలిగిన వారిని ఎన్నికల్లో ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. జైభారత్ జాతీయ ఉపాధ్యక్షులు ఖదిజ్ఞాసి గుండు వెంకన్న మాట్లాడుతూ తల్లిదండ్రులని అమ్ముకోట్లేదు. తోడబుట్టిన వాళ్లను అమ్ముకోట్లేదు. భార్య,బిడ్డల్ని అమ్ముకోట్లేదు. మరి వాడు పడేస్తున్న మద్యానికి,నోట్లకి ఓటుని (5 సంవత్సరాల జీవితాన్ని)ఎందుకు అమ్ముకు ంటున్నావు, ఎన్నికల్లో నిజాయితీగా నిబద్ధత కలిగిన ప్రజా సేవ చేసే వారిని ఎన్నుకోవాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. జైభారత్ అనేక సామాజిక రుగ్మతల నిర్మూలన కోసం పనిచేస్తుందని. ఈ ఉద్యమంలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు అనంతరం వెంపటి ఆనందరాము (ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక) మాట్లాడుతూఆత్మగౌరవాన్ని అమ్ముకోవద్దు. బిచ్చగాడి కంటే హీన స్థితికి దిగజారవద్దు. ఓటు కి 1000 రూపాయల విలువ కడితే 5 సంవత్సరాల లో దాని విలువ రోజుకు 55 పైసలు , 5,000 రూపాయలకు ఐతే రోజుకి 2 రూపాయల 74 పైసలు. ఇప్పుడు ఆలోచించండి.ఒక భిక్షగాడు కూడా ఇంత తక్కువ ధరకు అమ్ముడు పోడు. మరి నాయకుడు ఇచ్చిన ఆ డబ్బు తో మన జీవితం మారుతుందా? మరి మన ఆత్మ గౌరవాన్ని ఎందుకు ముష్టి చిల్లర కొరకు అమ్ముకోవాలి? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ₹తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు₹, మాట్లాడుతూ యువత ఎంతో చైతన్యవంతంగా ఉండాలని ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా ఓటువేయాలని కోరాడు. ఈ కార్యక్రమంలో జైభారత్ ఎస్సి పోరాట వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఖదిజ్ఞాసి నోసిన కోటయ్య, సామాజిక ఉద్యమకారులు చామకూరి నరసయ్య, సిపిఐ ఎంఎల్ నాయకులు బుద్ధ సత్యనారాయణ, యాతాకుల సునీల్ , కక్కిరేణి మోహన్, కందగట్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్దే ధ్యేయంగా సర్పంచ్ బల్గూరి స్నేహ దుర్గయ్య



కోదాడ, ఫిబ్రవరి 4(మనం న్యూస్): గ్రామ అభివృద్ధి ధ్యేయంగా గ్రామ రెవెన్యూలో గల నీటి సమస్యలపై నీటిపారుదల శాఖ అధికారులతో బుధవారం రివ్యూ ఏర్పాటు చేశామని గ్రామ సర్పంచ్ బల్గూరి స్నేహ దుర్గయ్య అన్నారు. మండల పరిధిలోని గణపవరం గ్రామంలో గ్రామ గ్రామపంచాయతీ ఆఫీసులో నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరింగ్ నాగభూషణరావు, నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ సత్యనారాయణ, నీటిపారుదల శాఖ డిప్యూటీ ఇంజనీరింగ్ సువర్ణ రేఖ, ఏఈ అధికారులతో రివ్యూ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ చెరువు శివారు హద్దులు, చెరువు అలుగు బ్రిడ్జి, ఎన్ఎస్పి కాలువ, ఈటి మరమ్మతుల అభివృద్ధి కోసం రివ్యూ నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం చెరువు శివారు, ఎన్ఎస్పి కాలువను ఇరిగేషన్ అధికారులు, గ్రామ పెద్దలతో కలిసి సర్పంచ్



పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎస్ జీవిత, వార్డు మెంబర్లు బండి చినకోటయ్య, మాడూరి కృష్ణారావు, పి సూర్యనారాయణ, ఇర్ల శ్రీనివాసరెడ్డి, జి గోపి, బి సైదులు, కుర్రి వెంకన్న, కాసాని శ్రీను, కాసాని సత్యం, అంచూరి చైన్నారెడ్డి, ఇర్ల వరాల్ రెడ్డి, గాయం కరుణాకర్ రెడ్డి, శ్యామకూరి గురవయ్య, కొండ ధనమూర్తి, పోశం శ్రీను, ముసిని శ్రీను శెట్టి అప్పారావు, మహేష్, రాములు, బి శ్రీను, ఇర్ల సీతారామరెడ్డి, జె నాగప్రసాద్, బుచ్చాలు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## దొండపాడులో డ్రైనేజీ పనులు ప్రారంభం



చింతలపాలెం, ఫిబ్రవరి 4 (మనం న్యూస్): మండల పరిధిలోని దొండపాడు గ్రామంలో నీ 13వ వార్డులో కొత్తగా ఎన్నికైన సర్పంచ్ ఆధ్వర్యంలో సైడ్ కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెన్నకేశవ వెంకయ్య ఉపసర్పంచ్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరాల కొండారెడ్డి, వార్డ్ మెంబర్లు మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొండ శ్రీనివాస్ రెడ్డి, అన్నపరెడ్డి గోవిందరెడ్డి, డిడి రామయ్య, పంట చినకోటిరెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శి సైదులు మరియు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మహనీయుల ఆశయాలు సామాజిక మార్గదర్శకాలు

సూర్యపేట, ఫిబ్రవరి 4 (మనం ప్రతినిధి): మహనీయులు ప్రతిపాదించిన ఆశయాలు, సిద్ధాంతాలే సామాజిక న్యాయం సాధించేందుకు మార్గదర్శకాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ రంగాలలో సమానత్వం సాధించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంతో కీలకమని అన్నారు. కుల సర్వే నిర్వహణతో పాటు షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సమాజంలోని వెనుకబడిన చివరి వ్యక్తికీ తగిన వనరులు, ప్రాతినిధ్యం మరియు ఆత్మగౌరవం కల్పించేందుకు దోహదపడతాయని తెలిపారు. సామాజిక న్యాయం సాధించాలంటే మహనీయులు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాల్సిన అవసరం



ఉందని కలెక్టర్ అన్నారు. అందరి అభ్యున్నతే లక్ష్యంగ విద్య, సామాజిక ప్రజాస్వామ్య విలువలు ప్రతి పౌరునికీ నిరంతర ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు. ఈ విలువలను ఆచరణలోకి తీసుకువచ్చినప్పుడే సమానత్వం, న్యాయం సాకారమవుతాయని స్పష్టం చేశారు. అనంతరం తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు, సిబ్బందితో కలిసి సామూహిక ప్రతిజ్ఞ చేశారు. వివక్ష లేకుండా ప్రతి వ్యక్తిని గౌరవిస్తామని, సమానత్వం, న్యాయం మరియు గౌరవం కోసం నిలబడతామని, ఏ రూపంలోనైనా అన్యాయాన్ని సమర్థించబోమని ప్రతిజ్ఞ చేశారు. దయ, సానుభూతితో సమాజంలోని ప్రతి ఒక్కరినీ చూడడంతో పాటు వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం తమ గళాన్ని వినిపిస్తామని తెలిపారు. రాజ్యాంగ సూత్రాలను పరిరక్షిస్తూ, న్యాయమైన, సామరస్యపూర్వకమైన మరియు సాధికారత కలిగిన తెలంగాణ రాష్ట్రం, భారతదేశ నిర్మాణానికి కృషి చేస్తామని వారు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, పిడి డిఆర్డి ఓ శిరీష, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి నరసింహ, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద రాణి, డి టి డి ఓ శంకర్, ఏవో. సుదర్శన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పనులు వెంటనే పూర్తి చేయాలి

సూర్యాపేట, అక్టోబర్ 04 (మనం ప్రతినిధి): జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టు పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాల యాల సముదాయంలోని వి సి హాల్ నందు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టే వివిధ పనుల పురోగతి పై ఏపీడీలు, ఈసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బోర్వెల్ రీచార్జ్, డెఫంక్ట్ బోర్వెల్, ఇంజెక్షన్ వెల్ , రూఫ్టాప్ వాటర్, హార్వెస్టింగ్ స్ట్రక్చర్, రీచార్జ్ షాఫ్ట్, రీచార్జ్ గుంత, సోక్ పిట్, తెరిచి ఉన్న బావి రీచార్జ్, డగ్ వెల్ కాంటూర్ ట్రెంచ్, గల్లి ప్లగ్, నాలా బండ్, గేబియన్ (వైర్ మెష్తో రాళ్ల కట్టడం), చెక్ డ్యామ్ , భూగర్భ అడ్డుకట్ట (సబ్ సర్ఫేస్ డైక్ - ఖిఖ్రి) గ్రామ చెరువు, పర్కొలేషన్ చెరువు, ట్యాంక్ చెరువు, బెంచ్ టెర్రేసింగ్, ఏదైనా వినూత్నమైన తక్కువ ఖర్చుతో కూడిన నమూనా, ఇతరులు. గుర్తించబడిన



పనులు ప్రధానంగా వర్షపు నీటి సేకరణ, భూగర్భ జలాల రీచార్జ్, సంప్రదాయ నీటి వనరుల పునరు ద్ధరణ, వాటర్షెడ్ అభివృద్ధి పనులు ఈ పనుల ద్వారా నీటి లభ్యతను పెంపొందించడం మరియు భూగర్భ జల మట్టాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకోవాలని మరియు మహిళా శక్తి ఉపాది భరోసా (6) రకాల పనులు) గుర్తించాలి అని మరియు గ్రామ పంచాయతీ వనమహోత్సవం నర్సరీ 2025-26 లో బ్యాగ్స్ లలో మట్టి నింపి విత్తన ములు నాటడం త్వరతిగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో ఇన్చార్జ్ డిఆర్డిఏ పి డి శిరీష, తుంగతుర్తి ఎంపీడీవో శేష్ కుమార్, డిఆర్డిఏ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా అధికారులతో రాష్ట్ర సీఈవో వీడియో కాన్ఫరెన్స్




జగిత్యాల, ఫిబ్రవరి 4(మనంప్రతినిధి): శనివారం హైదరాబాద్ నుండి తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఐఏఎస్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహణపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫెరెన్సు నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, రివిజన్ శాతం పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి ఇంటి నుండి ఖచ్చితమైన వివరాలు సేకరించాలని అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ శాతాన్ని పెంచేందుకు బూత్ లెవల్ ఆఫీసర్లు తప్పనిసరిగా ఫీల్ విజిట్ చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాలను నిర్ధారించి, శాతం పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ బూత్ లెవల్ ఏజెంట్లు ను వెంటనే నియమించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మ్యాపింగ్ సమయంలో తప్పు ఎంట్రీలు, తప్పు లింకింగ్లు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్ల సౌలభ్యం కొరకు బుక్ ఎ కాల్ సదుపాయంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు.ప్రతి ఓటరు పేరు సరైన పోలింగ్ స్టేషన్కు మ్యాప్ కావడం ప్రజాస్వామ్యానికి కీలకమని, అధికారులు, సిబ్బంది పూర్తి బాధ్యతతో పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 69. 94 శాతం జరిగిందని తెలిపారు. 100 శాతం పూర్తయ్యేలా అధికారులందరు సమన్వయం తో పని చేసి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియ ను మరింత వేగవంతం చేస్తూ అలాగే మ్యాపింగ్ లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా, తప్పు ఎంట్రీ లు జరగకుండా ప్రతి ఓటరు మ్యాప్ అయ్యేవిధంగా ప్రతి ఇంటినుండి ఖచ్చితమైన మరియు నిర్దిష్టమైన వివరాలు సేకరించేలా అన్ని స్థాయి ల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి. ఎస్. లత, జగిత్యాల, మెట్ పెల్లి ఆర్డీవోలు మధు సూదన్, శ్రీనివాస్,ఎన్నికల విభాగం పర్యవేక్షకులు హకీమ్, తహసీల్దార్ లు మరియు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే లైన్ పనులు గడువులోగా పూర్తి చేయాలి



- హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి, 4(మనం ప్రతినిధి): కొత్తపల్లి - మనోహరాబాద్ రైల్వే లైన్ పనులను గడువులోగా పూర్తి చేయాలని క్యాబినెట్ సెక్రటరీ (కోఆర్డినేషన్) సెంట్రల్ సెక్రటేరియట్ ఆదేశిం చారు. కొత్తపల్లి - మనోహరాబాద్ రైల్వే లైన్ పనులు, భూ సేకరణ, రైల్వే లైన్ పనులు, ఇతర అంశాలపై క్యాబినెట్ సెక్రటరీ (కోఆర్డినేషన్) సెంట్రల్ సెక్రటేరియట్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ వివిధ శాఖల అధికారులతో కలిసి బుధవారం హాజరయ్యారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేస్తామని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్సులో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, ఇండస్ట్రీస్ జీఎం హనుమంతు, రైల్వే, ఫారెస్ట్ శాఖ అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్

రాజన్నసిరిసిల్ల, ఫిబ్రవరి 4(మనం ప్రతినిధి): ఈ నెల 11 వ తేదీన నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో చేస్తున్న ఏర్పాట్లను ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి బుధవారం పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కౌంటింగ్ హాల్లో భద్రతా ఏర్పాట్లు, సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు, విద్యుత్ సరఫరా, తాగునీరు, తదితర సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కౌంటింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వాహనాల పార్కింగ్ కోసం చదును చేస్తున్న స్థలాన్ని సందర్శించారు. కళా మందిరం లోపల స్ట్రాంగ్ రూం, ఓట్ల లెక్కింపు



కోసం ఎన్ని టేబుల్స్, అధికారులు, పోటీలో ఉన్న అభ్యర్థులకు కోసం చేస్తున్న ఏర్పాట్లను సందర్శించారు. వాహనాల పార్కింగ్, క్రమబద్ధమైన రాకపోకలు ఉండేలా ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. మీడియా సెంటర్ ఏర్పాటుపై సూచనలు చేశారు. పరిశీలనలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయి, సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, నోడల్ అధికారులు శ్రీనివాసాచారి, ప్రవీణ్, తహసీల్దార్లు మహేష్ కుమార్, జయంత్ కుమార్ తదితరులు ఉన్నారు.

# రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో సిరిసిల్లకు నయాపైసా ఇయ్యలే

- సిరిసిల్ల ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్, కాంగ్రెస్లపై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్

రాజన్నసిరిసిల్ల, పిబ్రవరి 4(మనం ప్రతినిధి): ఫిరాయింపుల విషయంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యభిచారం చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధ్వజమెత్తారు. ఆయా ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినట్లు ఆధారాల్లేవంటూ శాసనసభ స్పీకర్ తీర్పు ఇవ్వడం దుర్మార్గమని అన్నారు. ‘‘స్పీకర్ సార్...మీరు నిజాయితీ పరులు. మీపై కాంగ్రెస్ ఒత్తిడి తెస్తోంది. ఎందుకంటే ఫిరాయింపు ఎమ్మెల్యేలు గాంధీభవన్ లోనే సంసారం చేస్తున్నరు. జిల్లా కాంగ్రెస్ ఆఫీసుల్లో మీటింగ్ లు పెడతారు. వాళ్ల చేతికే బి.ఫాంలు ఇస్తరు. కళ్ల ముందే ఇవన్నీ కన్పిస్తున్నా పార్టీ మారినట్లు ఆధారాల్లేవని కేసు కొట్టివేయడం దారుణం.’’అని విమర్శించారు. ఇలాంటి తీర్పులతో ప్రజాస్వామ్యం అపహస్యమ వుతోందన్నారు. రాజ్యాంగబద్దమైన స్పీకర్ పదవిపై మచ్చ పడి చరిత్ర హీనులు కావొద్దని కోరారు. ఈ సందర్భంగా ఫిరాయింపు ఎమ్మెల్యేలున్న నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి ‘‘మీ నియోజకవర్గంలో ఓట్ల కోసం వస్తున్న మీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో అడగండి. ఈ ఎన్నికల్లో ఏ పార్టీకి ఓటేయాలి? ఏ అభ్యర్థిని గెలిపించాలని నిలదీయండి. ఒక పార్టీ నుండి గెలిచి ఇంకో పార్టీ కండువా కప్పుకుని గెలుపు కోసం ఎందుకు పనిచేస్తున్నారో అడుగడుగునా నిలదీయండి’’’అని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిరిసిల్ల కు విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అంబేద్కర్ సర్కిల్ వద్ద నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లో పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్పతోపాటు పార్టీ జిల్లా నేతలు, బీజేపీ పక్షాన పోటీ చేస్తున్న అభ్యర్థులంతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడికి తరలి వచ్చిన వేలాది మంది ప్రజలను ఉద్దేశించి బండి సంజయ్ ప్రసంగించారు. ఏమన్నారంటే. మాకు భయపడి కేసీఆర్ కొడుకు సిరిసిల్లలోనే అడ్డాపెట్టి ఓటుకు రూ.10 వేలు ఇస్తున్నడట. ఆ డబ్బులు మనవే. తీసుకోండి. ఓట్లు మాత్రం పువ్వు గుర్తుకు వేసి బీజేపీకి మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని అప్పగించండి. మొన్నటిదాకా సిరిసిల్ల మున్సిపల్ పీఠాన్ని బీఆర్ఎస్ కు అప్పగిస్తే... ఏం జరిగింది? వానొస్తే గల్లీలన్నీ మునిగిపోతున్నయ్. ఆఖరికి జిల్లా కలెక్టరేట్ కూడా మునిగిపాయే. పడవల్లో, ట్రాక్టర్లలో పోవాల్సిన దుస్థితి. మురికి నీటి శుద్ధి ప్లాంట్ పేరిట పద్మనగర్లో ఎస్ టి పి ప్లాంట్ నిర్మిస్తే ఏమైంది?



మురికి కాలువ నీళ్లన్నీ ఊళ్లకు వస్తున్నయ్. తలకాయ ఉన్నోడు ఎవడైనా అట్ల చేస్తరా? వస్త్ర పరిశ్రమ మొత్తం సిరిసిల్లలో ఉంటే... నూలు (యారన్) డిపోను వేములవాడలో పెడతారా ఎవరైనా? డిపో ఈడ పెడితే వాళ్ల కమీషన్లన్నీ తెలుస్తదని ఆడ పెట్టిర్రు. ప్రతి కిలో పై కాంగ్రెస్ నేతలు కమిషన్లు దొబ్బుతున్నారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో సిరిసిల్లలో ఒక్కటంటే అభివృద్ధి కార్యక్రమం కూడా చేయలేదు పదేళ్లలో విలీన గ్రామాల్లో మురికినీటి సమస్య రోడ్ల సమస్య ఎప్పటిలాగే ఉంది. పైపెచ్చు ఇంటి పన్నులు ఇతర ట్యాక్స్ లు పెంచారు. జిల్లా కేంద్రమైన సిరిసిల్ల పాత బస్టాండ్లో పార్కింగ్ స్థలం లేదు. సిరిసిల్లలో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి.నేను కేసీఆర్ కొడుకు లెక్క అయ్యా పేరు చెప్పుకుని రాజకీయాల్లోకి రాలేదు. కార్యకర్తగా కష్టపడి మీకోసం లాఠీదెబ్బలు తిన్న. జైలుకు పోయిన. మరి నువ్వేం(కేటీఆర్) చేసినవ్. మా కార్యకర్తలను కొట్టి జైలుకు పంపుతవా? బిడ్డా.. నీ సంగతి చూస్తా.. మళ్లీ నువ్వు ఇక్కడికి వచ్చి ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే నీ బండారం అంతా బయటపెడతా. ప్రజలు నీ కంటే నాకు ఎక్కువ ఓట్లేసి గెలిపించారు. 2.26 లక్షల ఓట్ల మెజారిటీతో గెలిపించారు. మొన్న వానలొచ్చి పేదలు మునిగిపోతే వాళ్లను కాపాడే సోయి కేటీఆర్కు ఉందా? నేను హెలికాప్టర్ తీసుకొచ్చి ముంపు బాధితులను కాపాడిన. నేను కేంద్రం నుండి నిధులు తెచ్చి ప్రజల కోసం కష్టపడుతుంటే. కేటీఆర్ మాత్రం ఆ నిధులను దారి మళ్లించి కమీషన్లు దొబ్బితిన్నవ్. బీఆర్ఎస్ కార్యకర్తలారా... మీ కష్టాలను బీఆర్ఎస్ పట్టించుకోదు. ఎన్నికల్లో మిమ్ములను ఆదుకునే పరిస్థితి లేదు. కష్టమొస్తే ఆదుకునేది బీజేపీయే. మీరు సిరిసిల్ల మున్సిపాలిటీని బీజేపీకి అప్పగిస్తే... పెద్ద ఎత్తున నిధులిస్తానని మోదీ భరోసా ఇచ్చారు. ఆయన మాటగా చెబుతున్నా... మేయర్ పీఠాన్ని మాకు అప్పగించండి. లేనిపక్షంలో కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లిస్తరు. పైసలు మావి...ప్రగతి మాది... సోకులు వాళ్లవి...కమీషన్లు వాళ్లవి... మళ్లీ అట్లాంటోళ్లకు మళ్లీ ఓట్లేస్తారా? ఆలోచిస్తారా? కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో రాజకీయ వ్యభిచారం చేస్తోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గాంధీభవన్ లో సంసారం చేస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ ఆఫీసుల్లో సంసారం చేస్తున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలతో మీటింగ్ లు పెడుతున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలకే కాంగ్రెస్ బి.ఫాంలు ఇస్తున్నారు. వాళ్లే టిక్కెట్లు ఇస్తున్నారు.. ఇయాళ ఫిరాయింపులు స్పీకర్ గారు ఫిరాయింపు కేసును కొట్టివేయడం దుర్మార్గం. స్పీకర్ సార్... మీరు నిజాయితీపరులు. మీరున్నది రాజ్యాంగ పదవిలో. ప్రజాస్వామ్యాన్ని కాపాడే పదవిలో.. కానీ మీపై కాంగ్రెస్ ఒత్తిడి తెస్తోంది. ఫిరాయింపు ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు ఆధారాల్లేవని ఫిరాయింపుల కేసును కొట్టివేయడం తగదు. మీపై మచ్చ పడుతుంది.
చరిత్రలో మసక బారి పోతారు. మీ తీర్పును చూసి జనం నవ్వుకుంటున్నారు. ప్రజాలారా.... ఫిరాయింపు ఎమ్మెల్యేలు మీ వద్దకొస్తే నిలదీయండి. మీరు ఏ పార్టీ తరపున వచ్చారు? ఏ పార్టీని గెలిపించాలి? ఏ పార్టీ అభ్యర్థికి ఓటేయాలి? అనే నిలదీయండి. బీజేపీ మీ మాదిరిగా రాజకీయ వ్యభిచారం చేయదు. ప్రజాస్వామ్య స్ఫూర్తితో పనిచేస్తోంది. ఇతర పార్టీల ఎమ్మెల్యేలు మా వద్దకు రావాలంటే రాజీనామా చేయాల్సిందే. ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేశాకే బీజేపీలోకి తీసుకున్నామనే విషయాన్ని గుర్తుంచుకోండి. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నీచ రాజకీయాలకు బుద్ధి చెప్పండి. వాళ్ల అవినీతి, అక్రమాలకు చెంపపెట్టుగా తీర్పు ఇవ్వండి. బీజేపీ అభ్యర్థుల దగ్గర పైసల్లేకపోవచ్చు. కానీ మీ కోసం కొట్లాడే దమ్ముంది? పైసలు రప్పించే తెగువ ఉంది? మేం మీ ప్రగతి గురించి, మీ బాగోగుల గురించి ఆలోచిస్తున్నారు. వాళ్లు అవినీతి, కమీషన్ల కోసం ఆలోచిస్తున్నారు. అందుకే ఆలోచించి ఓటేయండి. కమలం పువ్వు గుర్తుకు ఓటేసి సిరిసిల్ల మున్సిపాలిటీని బీజేపీకి అప్పగించాలని కోరుతున్నారు.

# పాలమూరు బీజేపీ విజయ సంకల్ప సమ్మేళన కార్యక్రమం

- అఖండ మెజార్టీతో మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి
- ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగుతోంది
- దేశ, రాష్ట్ర ప్రజలందరూ బిజెపి వైపే చూస్తున్నారు
- ఎంపీ డీకే అరుణ



ఉమ్మడి మహబూబ్ నగర్, ఫిబ్రవరి 4 (మనం బ్యూరో): మహబూబ్‌నగర్ (పాలమూరు) జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కాలేజ్ గ్రౌండ్లో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా విజయ సంకల్ప సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీజేపీ జాతీయ అధ్యక్షులుగా నితిన్ నబీన్ నియామకం తర్వాత ఆయన తొలిసారిగా తెలంగాణ రాష్ట్రం పాలమూరు జిల్లాకు రావడం జరిగింది. ఆయన రాకతో బిజెపి పార్టీ ముఖ్య నేతలు ఘన స్వాగతం పలికారు. అదేవిధంగా డీకే అరుణ హృదయపూర్వక పూల బొక్కెన అందించి, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ... మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అభ్యర్థుల్లో ఉత్సాహం నింపేందుకే జాతీయ అధ్యక్షుల పర్యటన జరిగిందన్నారు. ప్రస్తుతం పరిస్థితుల్లో ప్రజలందరూ బీజేపీ వైపే ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలు, గ్రామాలు సమానంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందితేనే వికసిత్ భారత్ సాధ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. ఉపాధితో పాటు అభివృద్ధి లక్ష్యంగా కేంద్రం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఈ సందర్భంగా తెలిపారు. మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సాధ్యమవుతోందని ఆమె పేర్కొన్నారు. ఎయిర్పోర్టులకు దీటుగా రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్న ఘనత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. అమృత్ స్కీమ్ కింద మహబూబ్‌నగర్ పట్టణానికి కేంద్రం నిధులు మంజూరు చేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పాలమూరు చుట్టూ జాతీయ రహదారులు వేల కోట్ల రూపాయలతో నిర్మాణం అవుతున్నాయని, దీనికి అంతటి కారణం ఒక బీజేపీ పార్టీ తోనే సాధ్యం అవుతుందన్నారు. అదేవిధంగా బైపాస్ రోడ్లు, పట్టణంలో ఆర్వోబీలు నిర్మాణానికి కేంద్రం నిధులు ఇచ్చిందన్నారు. బోయపల్లి, తిమ్మసానిపల్లి, వీరన్నపేట, మోతీనగర్ ప్రాంతాల్లో ఆర్వోబీలు, లిమిటెడ్ హైట్ సబ్వేలు నిర్మించనున్నట్లు వెల్లడించారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయుల అంత్యోదయ సిద్ధాంతాన్ని అనుసరిస్తూ పేదలకు సంక్షేమం అందిస్తూ, పేదరిక నిర్మూలనతో పాటు ఆర్థికాభివృద్ధి దిశగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఏడుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ మోదీని మళ్లీ ప్రధాని చేయాలనే ఉద్దేశంతో తనను ఎంపీగా ప్రజలు గెలిపించారని డీకే అరుణ గుర్తుచేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని వేదిక ద్వారా పిలుపునిచ్చారు. ప్రతి మున్సిపాలిటీపై కాషాయ జెండా ఎగురవేయాలన్నారు. ఎంపీగా పాలమూరు జిల్లాకు మరిన్ని కేంద్ర నిధులు తీసుకొచ్చి అభివృద్ధికి అండగా ఉంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. పాలమూరు జిల్లా అభివృద్ధి పథంలో ముందు ఉండాలంటే ఈ ఎన్నికల్లో బిజెపి పార్టీకి పట్టం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



# మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని విజయం అందించాలి

- మిర్యాలగూడ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి

మిర్యాలగూడ ఫిబ్రవరి 04 (మనం న్యూస్): గడచిన రెండేళ్లలో గిరిజన బడుగు బలహీన వర్గాలు, రైతులు, మహిళల కోసం ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లతో పాటు... ఆర్టీసీ ఫ్రీ బస్, రైతు రుణమాఫీ, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టిందని ప్రజా పాలనకు, అభివృద్ధి కొనసాగింపుకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీకి మున్సిపాలిటీ ఎన్నికల్లో తిరుగులేని విజయం అందించాలని సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం గూడూరులో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి బాట బహిరంగ సభలో జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తో కలిసి ఆయన మాట్లాడారు. రెండేళ్ల అభివృద్ధికి మద్దతుగా ప్రజల తీర్పు ఉండాలని కోరారు. మిర్యాలగూడ ప్రాంతంలో రూ. 200 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు ముందుగా శంకుస్థాపన చేశారు. పదేళ్లు సీఎం ఉన్న కేసీఆర్ ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టించలేదని, రేషన్ కార్డులకు పదేళ్ల పాటు పేద వర్గాలు నిరీక్షించాల్సిన పరిస్థితిని చూశామన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టగానే రేషన్ కార్డుల పంపిణీ తో పాటు 3.17 కోట్ల మందికి 6 కేజీల చొప్పున సన్న బియ్యం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లకు 22,500 కోట్లు ఖర్చు చేసి రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇండ్లు ఇచ్చామని చెప్పారు. ఎమ్మెల్యేల ప్రతిపాదనల మేరకు ఏప్రిల్ బడ్జెట్ అనంతరం నియోజకవర్గాలకు మరిన్ని అదనపు ఇండ్లను కేటాయిస్తామని చెప్పారు. రూ. 20 వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం దళిత, గిరిజన, పేద వర్గాలకు క్వాలిటీ ఎడ్యుకేషన్ అందించాలన్న లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రూ. 20 వేల కోట్లతో అత్యాధునిక సాంకేతిక విద్యకు కేంద్ర బిందువుగా మారనున్న ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అన్నదాతల కోసం 1.10 లక్షల కోట్లను ఖర్చు చేసిన ఏకైక రాష్ట్రం గత ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ వరి వేస్తే ఉరి అన్న తెలంగాణ రాష్ట్రంలోనే రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే మరోసారి రైతు భరోసా నిధులను అన్నదాతల ఖాతాలో వేస్తామని చెప్పారు. దేశంలోనే రైతుల కోసం 1.10 లక్షల కోట్లను ఖర్చు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. రైస్ బౌల్ ఆఫ్ తెలంగాణగా గుర్తింపు పొందిన మిర్యాలగూడ ప్రాంత రైతులు ప్రజా ప్రభుత్వంలో లబ్ధి పొందారని తెలిపారు.

# ఘనంగా వన దేవతల తిరుగువారం పండుగ



- అమ్మవార్లను దర్శించుకున్న 5లక్షల మంది భక్తులు
- 5 వేల మంది కార్మికులతో నిరంతరం పారిశుధ్య పనులు
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క



ములుగు, ఫిబ్రవరి 4,మనం ప్రతినిధి: బుధవారం ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర తిరుగువారం పండగ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ ఎస్పీ లతో కలిసి జాతర చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశీలించి నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని స్వచ్ఛమైన మేడారం గ్రామాన్ని గ్రామస్తులకు అందించే విధంగా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ బుధవారం మేడారం జాతర తిరువారం పండుగ ఘన నిర్వహించుకోవడం జరిగిందని సుమారు 5 లక్షల మంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నారని తెలిపారు. ప్రధాన జాతర ముగిసిన అనంతరం కూడా భక్తుల రద్దీ కొనసాగుతున్న నేపథ్యం లో వారందరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా తాగునీరు,శానిటేషన్ గానీ రవాణా సౌకర్యం ఎటువంటి లోపం లేకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు. 2026 మేడారం మహా జాతరకు సుమారు రెండు కోట్ల మందికి పైగా భక్తులు వచ్చారని ఇంకా వారం రోజులపాటు భక్తుల రద్దీ కొనసాగుతుందని పేర్కొన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి,డీఎస్పీ,ఇతర అధికారులు, పాల్గొన్నారు.




## ఐఎఫ్ఆర్, మిలాన్ దృష్ట్యా 14 నుంచి 21 వరకు బోట్ల నిలుపుదల

మూలపాలెం, ఫిబ్రవరి 04 : ఇండియన్ నేవీ నిర్వహించనున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఊఖ)-మిలాన్ కార్యక్రమాల నేపథ్యంలో, మూలపాలెం గ్రామంలో మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో మత్స్యకారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అధికారులు పలు అంశాలపై మాట్లాడారు. ఫిబ్రవరి 14 నుంచి 21 వరకు నేవీ బోట్లు నిలుపుదల చేసే సముద్ర ప్రాంతాల్లో చేపల వేట చేపట్టకుండా, అలాగే బోట్లు సంచరించకుండా సహకరించాలని మత్స్యకారులకు విజ్ఞప్తి చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా నేవీ సూచనలను కచ్చితంగా పాటించాలన్నారు. బీచ్లు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సూచించారు. మత్స్యశాఖ జేడీ పి. లక్ష్మణ రావు, ఎఫ్.డి.ఓ. మురళీ, మెరైన్ పోలీసు బి.కె.వి. ప్రసాద్, శ్రీనివాస్, నేవీ అధికారులు మధుసూదన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# సమానత్వంతో కూడిన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యం




- వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్, ఫిబ్రవరి 4(మనంప్రతినిధి): వివక్ష, అసమానతలకు తావు లేకుండా సమానత్వంతో కూడిన సమాజాన్ని నిర్మించడమే తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం ప్రధాన లక్ష్యమని వరంగల్ కలెక్టర్ సత్యశారద పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఫిబ్రవరి 4న తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని అధికారికంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సామాజిక న్యాయం అనేది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందన్నారు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, మహిళలు, దివ్యాంగుల అభ్యున్నతికి అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కులు, సమానత్వం, సోదరభావం వంటి విలువలను ప్రతి పౌరుడు ఆచరణలో పెట్టినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా అందరితో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవ ప్రతిజ్ఞను చేయించారు.



# వన దేవతల సన్నిధిలో భక్త జనసందోహం

- తిరుగువారం రోజున కొనసాగిన భక్తుల రద్దీ

ములుగు, ఫిబ్రవరి 4(మనంప్రతినిధి): శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర బుధవారం తిరుగువారం సందర్భంగా వన దేవతల సన్నిధిలో భక్త జనసందోహం తో కోలాహలంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొదట గా జంపన్న వాగు లో పుణ్య స్నానాలు ఆచరించి వన దేవతలకు బంగారం,ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ కొనసాగుతున్నా తరుణం లో అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర పరిసర ప్రాంతాలలోని వ్యర్థాలను పారిశుధ్య కార్మికుల ద్వారా తొలగిస్తూ వ్యాధులు ప్రబలకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తిరుగువారం సందర్భంగా వన దేవతల పూజారులు కన్నెపల్లి ఆలయం లో శుద్ధి కార్యక్రమం నిర్వహించి వన దేవతలకు దీప దూప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అమ్మవార్ల పూజ సామాగ్రి,పట్టు వస్త్రాలను పూజారులు భద్రపరుస్తారు.

# అక్రిడేషన్ల మంజూరులో స్థానిక పత్రికలకు ప్రాధాన్యత

- జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ కన్వీనర్, కె.సదారావు

విశాఖపట్నం, ఫిబ్రవరి4: 5 వేలు సర్కులేషన్ దాటిన పత్రికలకు అక్రెడిటేషన్ నిలుపుదల చేయలేదని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ కన్వీనర్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, కె.సదారావు ఒక ప్రకటనలో తెలిపారు. పెద్ద,మధ్య తరహా పత్రికలు, ఎలెక్ట్రానిక్ మీడియా తో పాటు స్తానిక పత్రికలకు కూడా అక్రెడిటేషన్ లు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన మొదటి సమావేశంలో మంజూరు చేయడం జరిగింది. ఈ సమావేశంలో 2 వేలు పైన సర్కులేషన్ చూపిన పత్రికలకు ఎ ప్రకారం 1+1 అక్రెడిటేషన్లు, 5 వేలు సర్కులేషన్ దాటిన వాటికి 4, అలాగే 10 వేలకు పైన సర్కులేషన్ చూపిన వారికి కూడా 4 అక్రెడిటేషన్లు మొదటి సమావేశంలో ఆమోదం తెలపడం జరిగిందని తెలిపారు. కొన్ని స్థానిక పత్రికలు ఎక్కువ అక్రెడిటేషన్లు పొందాలనే ఉద్దేశంతో ముద్రిస్తున్న వాటికంటే చాలా ఎక్కువగా సర్కులేషన్ చూపిస్తున్నట్లుగా అధికారులకు, కమిటీ సభ్యులకు ఫిర్యాదులు అందాయి. గత సంవత్సరం మాదిరిగానే ఒకసారి సర్కులేషన్ వెరిఫికేషన్ చేయాలని కమిటీ అభిప్రాయ పడిందని తెలిపారు. నిబంధనలను అనుసరించి అర్హత ప్రకారం ముద్రిస్తున్నట్లయితే తరువాత జరిగే కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుని మిగిలిన అక్రిడేషన్ల మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. దీనిని వివక్షగా భావించ వలసిన అవసరం లేదని తెలిపారు. నిజంగా నిబంధనల ప్రకారం ముద్రించే వారు భయ పడవలసిన అవసరం లేదని, అర్హత మేరకు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఏది ఏమైనా అధికారులు జీవో ఎంఎస్ నెంబర్ 84, లో ఉన్న నిబంధనల మేరకు పని చేయ వలసి ఉంటుందని గుర్తించవలసినదిగా తెలియజేయడమైనది.

# ఐ వి ఎఫ్ ఏపీ సలహాదారుగా ప్రమాణ స్వీకారం చేసిన కేకే రత్నమాల

- అభినందించిన జాతీయ ప్రముఖులు

ఆచంట ఫిబ్రవరి 4 మనం న్యూస్ : ఆచంట మండలం భీమలాపురం గ్రామానికి చెందిన డా. కొత్త కనక రత్న మాల వెంకటేశ్వర్లు కు తాడేపల్లిగూడెం కమ్మ కళ్యాణ మండపంలో అంతర్జాతీయ వైశ్య సమ్మేళన ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది ఈ సందర్భంగా అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ నాయకులు ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు కోన శ్రీనివాసరావు మరియు మహిళా అధ్యక్షురాలు గుండా నాగ సుప్రజ ఢిల్లీ నుండి హాజరైన జాతీయ అధ్యక్షులు అశోక్ అగర్వాల్ విక్రమ్ కుమార్ మహారాష్ట్ర నుండి హాజరైన రమేష్ అగర్వాల్ జాతీయ నాయకులు ఉప్పల శ్రీనివాస్ గుప్త మాజీ మంత్రి టీజీ వెంకటేష్ మరియు వైశ్య కార్పొరేషన్ అధ్యక్షులు దండి రాకేష్ తణుకు మాజీ శాసనసభ్యులు అంబికా కృష్ణ తదితర నాయకులు తో పాటు సుమారు 5000 మంది సమక్షంలో ఆంధ్రప్రదేశ్ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మాట్లాడుతూకొత్త కనకరత్న మాల వెంకటేశ్వర్లు గత 2011 నుండి 2026 సంవత్సరం వరకు అనేక పదవులు స్వీకరించి కుల మతాలకు ప్రాంతాలకు అతీతంగా అనేక సేవలు అందించార నీఆమెను ప్రశంసించి అభినందనలు తెలిపారు.



# పీఎం శ్రీ విద్యాలయాలపై ఇంచార్జి కలెక్టర్ సమీక్ష



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి -04(ప్రతినిధి): పీఎం శ్రీ కింద ఎంపికైన విద్యాలయాలపై ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పీఎం శ్రీ కింద జిల్లాలో మొత్తం 16 విద్యాలయాలు ఎంపిక కాగా, విజ్ఞాన విహార యాత్రలు, యోగా శిక్షణ తరగతులు, సైన్స్ ఫెయిర్ తదితర అంశాలపై ఆయా విద్యాలయాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం వాటిపై జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, ఆయా పాఠశాలల హెచ్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వాటిపై అధికారులకు పలు సూచనలు చేశారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే



- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య

ములుగు, ఫిబ్రవరి 4మనం ప్రతినిధి: కమలాపురం గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షులు బేవార సత్యనారాయణ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయగా ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య హాజరై మాట్లాడుతూ మంగళవారం పేపర్లలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ చేసిన వాక్యాలను ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు ములుగు జిల్లా లో పదేండ్లలో టీఆర్ఎస్ పార్టీ అధికారంలో వున్నప్పుడు ఎం అభివృద్ధి చేశారో బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసురుతున్నాం అని తెలియజేస్తున్నాము ములుగు అభివృద్ధి ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో మా ఆడబిడ్డ మంత్రి సీతక్క చొరవతో అభివృద్ధి లో పరుగులు పెడుతున్న మాట వాస్తవం కాదా ములుగు గ్రామ పంచాయతీ ను మున్సిపాలిటీ చేసింది, ములుగు బస్టాండ్ ను అత్యాధునికత టెక్నాలజీ తో నిర్మాణం ను,ములుగు లో నర్సింగ్ కాలేజ్ ను,నూతన మల్లంపల్లి మండలంను దివంగత నాయకులు ప్రతిపక్ష నాయకులు జేడీ అనే నామకరణం చేసింది. ఏటూరునాగారంలో బస్ డిపో ను, ఫైర్ స్టేషన్ ను ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఎన్నో ఘనంకలు చేసిన ఘనత సీతక్క అదేవిధంగా మేడారం మహా జాతర విజయవంతం అవ్వడం పట్ల జీర్ణించుకోలేని బిఆర్ఎస్ నాయకులు మీ ఆధ్వర్యంలో తిన్న ప్లేట్ కు ఒక్కొదానికి 10,000 రూపాయలు ఖర్చులు రాసింది మీరు కాదా ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతిదంట్లో అవినీతి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం ఎక్కడ వేసిన గొంగళి అక్కడ నే వున్నది సీతక్క ఆధ్వర్యంలో శాశ్వతంగా నిలిచిపోయేలా అభివృద్ధి పనులు చేసి మేడారం ను ప్రపంచ స్థాయి తీసుకెళ్లిన ఘనత సీతక్క అన్ని తానై అధికారుల సమన్వయము తో సక్సస్ చేసింది చూసి సోషల్ మీడియా వేదికలలో బీఆర్ఎస్ పెయిడ్ ఆర్టిస్ట్ లతో బురద జల్లాలి అని చూస్తే లీగల్ గా ముందుకు వెళ్తామని తెలిపారు ఈ కార్యక్రమంలోజిల్లా, నియోజకవర్గ, బ్లాక్ కాంగ్రెస్, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు...



# ఉస్తాద్ భగత్ సింగ్ రిలీజ్ డేట్ : రికార్డులు తిరగ రాసేందుకు డేట్ ఫిక్స్..!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు. దర్శకుడు హరీష్ శంకర్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తుండటంతో అంచనాలు భారీగా క్రియేట్ అయ్యాయి. ఈ కాంబినేషన్ లో వచ్చిన 'గబ్బర్సింగ్' ఇండస్ట్రీ హిట్ గా నిలవడంతో ఇప్పుడు మరోసారి ఆ మ్యాజిక్ 'ఉస్తాద్ భగత్ సింగ్'తో రిపీట్ చేస్తారని అభిమానులు ఆశిస్తున్నారు. అయితే, ఈ సినిమా రిలీజ్ డేట్ కు సంబంధించి మేకర్స్ తాజాగా ఓ క్లారిటీ ఇచ్చారు.

'ఉస్తాద్ భగత్సింగ్' చిత్రాన్ని గతంలో వాయిదా వేశారు. దీంతో ఇప్పుడు ఈ చిత్రాన్ని మార్చి 26, 2026లో రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ తాజాగా వెల్లడించారు. దీనికి సంబంధించిన రిలీజ్ డేట్ పోస్టర్ ను వారు రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో పవన్ తనదైన వింటేజ్ పోజ్ లో కనిపిస్తున్నారు. ఇక పవన్ లుక్స్ ఆకట్టుకునేలా ఉండటంతో ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అని అభిమానులు ఆతృతగా చూస్తున్నారు. ఈ సినిమాలో పవన్ ఓ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. ఆయన సరసన అందాల భామలు శ్రీలీల, రాశి ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఇక మార్చి 26న రిలీజ్ కానున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తాడో చూడాలి.

## వరల్డ్‌కప్ ఫైనల్‌కు

# దూసుకెళ్లిన భారత్



ఐసీసీ అండర్-19 వరల్డ్ కప్ టోర్నీ-2026లో భారత యువ జట్టు ఫైనల్ కు దూసుకువెళ్లింది. హరారే వేదికగా సెమీ ఫైనల్లో అఫ్గనిస్తాన్ ను ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. జింబాబ్వే వేదికగా జనవరి 15న ప్రపంచకప్ టోర్నీ మొదలైన విషయం తెలిసిందే.

ఆది నుంచి అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకున్న భారత జట్టు.. సూపర్ సిక్స్ దశలో నాలుగింటికి నాలుగు మ్యాచ్ లు గెలిచి సత్తా చాటింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్ ను ఓడించి సెమీస్ లో అడుగుపెట్టింది. ఈ క్రమంలో రెండో సెమీ ఫైనల్లో బుధవారం అఫ్గన్ జట్టుతో తలపడింది.ఇద్దరు శతకాలు బాది

హరారేలో టాస్ ఓడిన భారత్ తొలుత బౌలింగ్ చేసింది. అయితే, వికెట్లు తీయలేక భారత బౌలర్లు ఆపసోపాలు పడ్డారు. అఫ్గన్ బ్యాటర్లలో ఫైజల్ షినోజాదా (110), ఉజైరుల్లా నియాజాయ్ (101 నాటౌట్) శతకాలతో చెలరేగి.. అఫ్గన్ ను పటిష్ట స్థితిలో నిలిపారు.

వీరిద్దరి అద్భుత ప్రదర్శన కారణంగా నిర్ణీత 50 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి అఫ్గనిస్తాన్ 310 పరుగుల భారీ స్కోరు సాధించింది. వరల్డ్ కప్ తాజా ఎడిషన్ లో ఇదే అత్యధిక స్కోరు. ఈ క్రమంలో 311 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆయుశ్ మాత్రే సేన ఆది నుంచే దూకుడుగా ఆడింది.

### శతక్కొట్టిన హైదరాబాదీ బ్యాటర్

ఓపెనర్లలో వైభవ్ సూర్యవంశీ (33 బంతుల్లో 68) ధనాధన్ దంచికొట్టగా... హైదరాబాదీ బ్యాటర్ ఆరోన్ జార్జ్ శతకం (104 బంతుల్లో 115; 15 ఫోర్లు, 2 సిక్సు)తో సత్తా చాటాడు. వన్ డౌన్ లో వచ్చిన కెప్టెన్ ఆయుశ్ మాత్రే 59 బంతుల్లో ఐదు ఫోర్లు, నాలుగు సిక్సర్లు బాది 62 పరుగులు సాధించాడు.

మిగతా వారిలో విహాన్ మల్హోత్రా (47 బంతుల్లో 38), వేదాంత్ త్రివేది (6 బంతుల్లో 5) అజేయంగా నిలిచి భారత్ గెలుపును ఖరారు చేశారు. టాపార్డర్ దంచికొట్టడంతో అఫ్గన్ విధించిన లక్ష్యాన్ని భారత్ 41.1 ఓవర్లలోనే ఊదేసింది.

కేవలం మూడు వికెట్లు నష్టపోయి 311 పరుగులు సాధించి.. ఏడు వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. తద్వారా వరల్డ్ కప్ ఫైనల్ కు దూసుకువెళ్లింది. కాగా తొలి సెమీ ఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించి ఇంగ్లండ్ ఫైనల్లో అడుగుపెట్టింది. భారత్- ఇంగ్లండ్ మధ్య శుక్రవారం ఫైనల్ జరుగనుంది. 3

## నేను కామెంటేటర్‌గా ఎందుకు చేయను

టీమ్ఇండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని ఓ కార్యక్రమంలో క్రికెట్ కామెంట్రీ గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. కామెంటేటర్ గా చేయొచ్చు కదా అన్న



ప్రశ్నకు ధోని సమాధానం ఇచ్చాడు. గణాంకాలు పెద్దగా గుర్తుండవని, అందుకే ఆ పని చేయలేనన్నాడు. 'గణాంకాలు గుర్తుంచుకోవడం నాకు చాలా కష్టం. ఆటను వర్ణించడం, ఆటగాళ్లను విమర్శించడం మధ్య సన్నటి గీత మాత్రమే ఉంటుంది. ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా మ్యాచ్ సమయంలో వ్యాఖ్యానం చేయడం కళ' అని ధోని అన్నాడు.

'మ్యాచ్ సందర్భంగా.. ఓ టీమ్ ఓడిపోవడానికి గల కారణాలను విశ్లేషించేటప్పుడు ఎవరూ నొచ్చుకోకుండా చెప్పగలగాలి. అలాగే నా కన్నా చాలా మందికి గణాంకాలపై మంచి పట్టు ఉంది. మీరు నా గణాంకాల గురించి అడిగినా కూడా చెప్పలేను' అని ధోని పేర్కొన్నాడు.

# నేను ఎక్కువగా వాడే పదం అది

''నేను రోజూ ఎక్కువగా వాడే పదం ఐ లవ్ యు. అది కూడా నా కూతురి కోసమే'' అని అంటోంది హిందీ తార దీపికా పదుకొణె. కథల ఎంపికలో ఆచితూచి అడుగులేసే కథానాయికీమె. ప్రస్తుతం ఓవైపు తల్లిగా తన బాధ్యతల్ని నిర్వర్తిస్తూనే.. రాబోయే ప్రాజెక్టుల కోసం సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దీపిక తన కుమార్తె గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. ''ఇప్పుడు నా ప్రపంచమంతా నా కూతురు దువా చుట్టూనే తిరుగుతుంది. ఆమె నాకు అన్నింటికన్నా ఎక్కువ'' అంది. అలానే నేర్చుకోవడం అనేది రోజువారీ జీవితంలో భాగం కావాలని చెబుతోంది దీపిక. ''కెరీర్ మొదట్లో పరిశ్రమను, కళను, మాధ్యమాన్ని అర్థం చేసుకోవడంపైనే ఉండేది. ఇప్పుడు పరిశ్రమలో మరింత మెరుగ్గా ఎలా రాణించాలో ఆలోచిస్తున్నా. అందుకే నేర్చుకోవడం ఎప్పుడూ ఆగకూడదు'' అని చెప్పుకొచ్చింది దీపిక.



# రాముడిగా కనిపిస్తాను..

## 'వారణాసి'లో తన పాత్ర గురించి చెప్పిన మహేశ్

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'వారణాసి' ఒకటి. ఈ సినిమా అప్ డేట్స్ ఎప్పుడెప్పుడు వస్తాయా అని అభిమానులతో పాటు సెలబ్రిటీలు కూడా ఆసక్తిగా ఉన్నారు. తాజాగా ఈ చిత్ర బృందం ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఎన్నో విశేషాలు పంచుకుంది. ఈ సినిమాలో వారి పాత్రల దగ్గర నుంచి కథ ఎలా మొదలైంది వరకూ మహేశ్ బాబు చెప్పిన విశేషాలు మీకోసం..



**మొదట భయపడ్డాను..**

15 ఏళ్ల క్రితమే రాజమౌళి దర్శకత్వంలో చేయాల్సిఉంది. ఇప్పటికి అది కుదిరింది. 'ఆర్ఆర్ఆర్' పూర్తయిన తర్వాత ఏడాది పాటు దీని స్క్రిప్ట్ గురించి ఆలోచించారు. నన్ను ఆఫీసుకు పిలిచి 'వారణాసి' స్క్రిప్ట్ గురించి చెప్పారు. కథ విని ఆశ్చర్యపోయాను. ఇప్పటివరకూ రాజమౌళి చేసిన అన్ని చిత్రాల కంటే ఇది భిన్నంగా ఉంటుంది. ఇందులో ఎన్నో అంశాలు ఉన్నాయి. యాక్షన్, అడ్వెంచర్, పురాణాలు, టైమ్ ట్రావెల్.. ఇలా ఎన్నో ఉన్నాయి. రాజమౌళి అభిమానిగా ఈ సినిమా కోసం నేనూ ఆసక్తిగా ఉన్నాను. ఇందులో హీరోగా చేయడానికి మొదట్లో భయపడ్డాను. రాజమౌళి కథను వివరించిన విధానం నా భయాన్ని పోగొట్టింది.

**రెండు షాట్ల కోసం ఆరు నెలలు..**

'వారణాసి'లో లుక్స్ కోసం ఎన్నో రిహార్సల్స్ చేశాం. 2024 నుంచి ఈ పనిలోనే ఉన్నాం. గతేడాది జర్మనీ కూడా వెళ్లాం. రాజమౌళి ప్రతి చిన్న విషయాన్ని క్షుణంగా పరిశీలిస్తారు. ఎన్నిసార్లు అయినా రిహార్సల్స్ చేస్తారు. నేను ఇందులో రాముడి పాత్ర పోషించాను. రాముడు అంటేనే హుందాతనం.. ఆయనకు ప్రత్యేకమైన భంగిమ ఉంటుంది. నిలబడే విధానం దగ్గర నుంచి పాత్రలో నటించడం వరకూ ఎన్నో రిహార్సల్స్ చేశాం. 2,3 నెలలు దానికోసమే కష్టపడ్డాం. రాజమౌళి నేను పరిగెత్తే విధానాన్ని కూడా మార్చారు. దానికోసం 6 నెలలు శిక్షణ తీసుకున్నాను. సినిమాలో రెండు షాట్ల కోసం ఇదంతా చేశాం. ఆయనకు సినిమాపై ఉన్న శ్రద్ధ ఎలాంటిదో చెప్పడానికి ఈ ఒక్క విషయం చాలు. ఎన్నో వర్క్ షాప్ లు నిర్వహించారు. యూరోపియన్ శిల్పాలు పరిశీలించారు.

**విలన్ ల పాత్రలు ఇష్టమన్నారు**

రాజమౌళి నాకు స్క్రిప్ట్ వివరించిన తర్వాత ఆయనకు నేను ఒక మెసేజ్ పెట్టా. 'మీ దర్శకత్వంలో చేయడం చాలా ఆనందంగా ఉంది. మీరు కథ వివరించిన విధానానికి ఆశ్చర్యపోయాను' అని పంపా. ఆ మెసేజ్ కు రాజమౌళి ఇచ్చిన రిప్లై తెలుసా.. 'నాకు నా సినిమాల్లో విలన్ లు అంటే చాలా ఇష్టం. ఆ పాత్రలను ప్రేమిస్తున్నాను' అని పంపారు. 'నాకు కూడా ప్రతినాయకులంటే ఇష్టమే' అని నేను కూడా సరదాగా రిప్లై పెట్టాను. ఈ సినిమా భారీస్థాయిలో విడుదలవుతుంది. ఆయన ఎప్పుడూ సాంకేతిక అంశాలను నటీనటులకు వివరించరు. ఆ కష్టమంతా తనే చూసుకుంటారు. మేం ఒక్కసారి కూడా కనీసం మానిటర్ చూడలేదు. షాట్ పూర్తవగానే మరో సన్నివేశంలోకి వెళ్లేవాళ్లం.

# రామ్‌చరణ్ 'పెద్ది' వాయిదా.. కొత్త విడుదల తేదీ ఇదే

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న సినిమా 'పెద్ది'. మార్చి 27న బాక్సాఫీసు ముందుకు రావాల్సిన ఈ చిత్రం వాయిదా పడింది. తాజాగా కొత్త



విడుదల తేదీని టీమ్ ప్రకటించింది. ఈ సినిమా ఏప్రిల్ 30న వస్తుందని తెలిపింది. ఈ మేరకు కొత్త పోస్టర్ ను అభిమానులతో పంచుకుంది.'ఉస్తాద్ భగత్సింగ్' విడుదల తేదీని ప్రకటించిన కొన్ని క్షణాల్లోనే 'పెద్ది' కొత్త రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేయడం గమనార్హం. పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న సినిమా ఇది. మార్చి 26న రానుంది. నెల వ్యవధిలోనే బాబాయ్- అబ్బాయిల సినిమాలు విడుదల కానుండటంతో అభిమానులు ఆనందంతో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న స్పోర్ట్స్ డ్రామా మూవీ 'పెద్ది'. జాన్వీ కపూర్ హీరోయిన్. కన్నడ నటుడు శివ రాజ్ కుమార్, బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. హీరో- డైరెక్టర్, హీరో- హీరోయిన్ కాంబినేషన్లతోపాటు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఓ షాట్ (చరణ్ క్రికెట్ ఆడటం) సినిమాపై భారీ అంచనాలు పెంచింది.

## బుల్లెట్ సునీల్‌గా

# రాజశేఖర్

చార్మింగ్ స్టార్ శర్వానంద్ నటిస్తున్న ది మోస్ట్ ప్రెస్టీజియస్ చిత్రం 'బైకర్'పై ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఈ సినిమాను దర్శకుడు అభిలాష్ రెడ్డి కంకర డైరెక్ట్ చేస్తున్నారు. ఇక ఈ సినిమా టాలీవుడ్ లో తొలి బైక్ రేసింగ్ చిత్రంగా ప్రేక్షకులను అలరించేందుకు రెడీ అయింది. కాగా, ఈ సినిమాలో యాంగ్రీ స్టార్ రాజశేఖర్ ఓ కీలక పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయన పాత్రకు సంబంధించిన గ్లింప్సు మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ సినిమాలో బుల్లెట్ సునీల్ అనే పాత్రలో రాజశేఖర్ నటిస్తున్నారు. ఒకప్పుడు మోటోక్రాస్ రేసర్ గా ఉన్న బుల్లెట్ సునీల్ బైక్ రేసింగ్ ఛాంపియన్ షిప్ లో ఇండియాను విజేతగా నిలిపేందుకు ఎలాంటి పాట్లు పడతాడు అనేది ఈ సినిమాలో రాజశేఖర్ పాత్రగా ఉండబోతుంది. ఈ పాత్రలో రాజశేఖర్ తన పర్ఫార్మెన్స్ తో మరోసారి ప్రేక్షకులను కట్టిపడేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక బైక్ రేసింగ్ కోసం శర్వాకు



రాజశేఖర్ ఎలాంటి ట్రైనింగ్ ఇస్తాడు అనేది మనకు ఈ సినిమాలో చూపెట్టబోతున్నారు. ఈ సినిమాలో శర్వా స్లిమ్ లుక్ తో ప్రేక్షకులను థ్రిల్ చేయబోతున్నాడు. ఈ సినిమాలో మాళవిక నాయర్ హీరోయిన్ గా నటిస్తోండగా గిబ్రాన్ సంగీతం అందిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ ప్రొడ్యూస్ చేస్తున్న ఈ బైకర్ చిత్రాన్ని ఏప్రిల్ 3న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.